

కలెక్టర్‌తో మాట్లాడుతున్న గ్రేడ్-5,6 ఉద్యోగులు

సంతకాలు నావే.. ఆర్డర్లు ఫేక్!

బదిలీల పంచాయితీపై త్రిసభ్య కమిటీ విచారణలో అనేక వింతలు

- పూర్వ డీపీవో ఉషారాణి వ్యవహారశైలిపై అవాక్కు
- విచారణాధికారులను ముప్పుతిప్పలు పెట్టిన వైనం
- కొత్తగా వచ్చిన అధికారిపై నిందలు వేసే ప్రయత్నాలు
- అయోమయంలో గ్రేడ్-5, 6 ఉద్యోగులు
- తమ పరిస్థితి ఏమిటని ఆందోళన
- విచారణ అనంతరం కలెక్టర్‌ను కలిసిన ఉద్యోగులు

'సంతకాలు నావే.. కానీ ఆ ఉత్తర్వులు మాత్రం ఫేక్..' ఇదీ జిల్లా పంచాయతీ కార్యాలయం పరిధిలో బదిలీల అక్రమాలపై పూర్వ ఇన్‌చార్జి డీపీవో ఉషారాణి వివరణ. ఆ మాట విని విచారణాధికారులు అవాక్కయ్యారు. బదిలీల్లో పారదర్శకతకు పాతరేసి, ఉద్యోగులకు సకాలంలో ఉత్తర్వులు ఇవ్వకుండా జాప్యం చేసి ఇప్పుడు అవి నకిలీవి అని మాటమార్చడంతో అంతా గందరగోళం నెలకొంది. విషయం తెలిసి ప్రస్తుతం గాలిలో (బాధ్యతలు తీసుకోకుండా) ఉన్న గ్రేడ్ 5,6 ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. వెంటనే వారు ఉత్తర్వులను తీసుకొని కలెక్టర్‌ను కలిశారు. తమ ఆవేదనను ఆమెకు వివరించారు. కాగా బదిలీలతో ఎలాంటి సంబంధం లేని ప్రస్తుత డీపీవోపై ఉషారాణి విచారణాధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చారు. దీంతో ఇక ఆ కార్యాలయంలో పనిచేసే వారిపై ఆమె ఏమి చెప్పి ఉంటారోనన్న ఆందోళన ఉద్యోగుల్లో నెలకొంది.



పూర్వ డీపీవోను విచారిస్తున్న త్రిసభ్య కమిటీ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ పరిధిలోని గ్రేడ్-5, గ్రేడ్-6 (సచివాలయ కార్యదర్శుల) ఉద్యోగుల బదిలీల్లో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై చేపట్టిన విచారణను పూర్వ ఇన్‌చార్జి డీపీవో పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించారు. తప్పులను ఇతరులపై నెట్టివేసే ప్రయత్నం చేయడంతో విచారణాధికారులు విస్తుపోయారు. పంచాయతీ కార్యదర్శుల బదిలీల్లో అక్రమాలపై ఫిర్యాదులు అందడంతో కలెక్టర్ తమీమ్ అన్సారియా విచారణకు త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. ఫారెస్టు సెటిల్‌మెంట్ ఆఫీసర్ లోకేశ్వరరావును ఛైర్మన్‌గా, జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవి, జిల్లా ఆడిట్ అధికారి శంకర్‌నారాయణరెడ్డిలను సభ్యులుగా నియమించారు. దీంతో వారు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఫారెస్టు సెటిల్‌మెంట్ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. బదిలీల ఉత్తర్వులు పొందిన ఉద్యోగులను విచారించారు. ఈ సందర్భంగా తాము పడిన ఇబ్బందులను వారు విచారణాధికారుల ఎదుట ఏకరువు పెట్టారు.

ఉత్తర్వులు ఇచ్చారు.. చేర్చుకోవద్దన్నారు

తమకు బదిలీ ఉత్తర్వులు ఇచ్చి విధుల్లో చేర్చుకోవద్దని ఎంపీడీవోలకు ఫోన్‌లు చేసి చెప్తున్నారని ఉద్యోగులు విచారణాధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఉద్యోగంలో చేరిన నాటి

మిగతా 6వ పేజీలో

రాతపూర్వకంగా సమాచారం తీసుకున్నారు

జిల్లా పంచాయతీ పూర్వ అధికారి ఉషారాణి చేసిన కొన్ని ఆరోపణలపై ప్రస్తుత డీపీవో వెంకటనాయుడుతోపాటు ఇతర ఉద్యోగుల నుంచి కూడా త్రిసభ్య కమిటీ రాతపూర్వకంగా వివరణ తీసుకున్నట్లు తెలిసింది. బదిలీల ఉత్తర్వుల ప్రక్రియలో ఇప్పటికే సస్పెండ్ అయిన ఉద్యోగులతోపాటు ప్రస్తుతం కార్యాలయంలో పనిచేస్తున్న వారిని కూడా మరికొన్ని అంశాలపై విచారించినట్లు తెలిసింది. మరోవైపు బదిలీల్లో అక్రమాలపై ఫిర్యాదు చేసిన రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి పెండ్యాల వెంకటేశ్వర్లు నుంచి కూడా విచారణాధికారులు వివరణ తీసుకున్నట్లు సమాచారం.

పంట నష్టంపై ప్రభుత్వం దృష్టి

- రైతువారీ గణనకు ఆదేశం
- 27 వరకు గడువు
- జిల్లాలో కొనసాగుతున్న వర్షాలు
- పెరుగుతున్న నష్టాలు



దర్శి మండలం మారెడ్డిపల్లిలో వర్షపు నీటిలో ఉన్న మిర్చి పైరు



ఒంగోలులో సోమవారం కురుస్తున్న వర్షం

ఒంగోలు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవలి వర్షాలకు జరిగిన పంట నష్టాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. జిల్లా అధికారులు పంపిన ప్రాథమిక అంచనా నివేదికలను పరిశీలించి రైతువారీ నష్టాలు లెక్కించాలని ఆదేశించింది. ఈనెల 27లోగా క్షేత్రస్థాయిలో పరిశీలన పూర్తిచేయాలన్న ఉత్తర్వులు వ్యవసాయశాఖ అధికారులకు అందాయి. మరోవైపు వాయుగుండం వీడినా జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. దీంతో పంట నష్టాలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఈనెల 10 నుంచి 20 వరకు సగటున జిల్లాలో 20 సెం.మీపైగా వర్షపాతం నమోదైంది. అలా దాదాపు పది రోజులు తెరపి లేకుండా కురిసిన వర్షాలతో పంటలు అధికంగా దెబ్బతిన్నాయి. తొలుత వాయుగుండం ప్రభావంతో వర్షాలు అధికంగా కురిసిన తూర్పుప్రాంతంలో ఖరీఫ్ సీజన్‌లో పెద్దగా పంటలు సాగుకాక పోవడంతో నష్టం అంతగా ఉండకపోవచ్చని భావించారు. అయితే తర్వాత కూడా మూడు, నాలుగు రోజులు విస్తారంగా వర్షాలు కురిశాయి. అలా ఈనెల 18వ తేదీ రాత్రి నుంచి తిరిగి ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కొన్ని ప్రాంతాల్లో పడ్డాయి. అలా ఈ మూడు రోజుల్లో సగటున జిల్లాలో 31.0 మి.మీ వర్షం కురిసింది. అందులో పంటలు అధికంగా సాగులో ఉన్న పశ్చిమప్రాంతంలో ప్రత్యేకించి దర్శి, కనిగిరి, మార్కాపురం

మిగతా 6వ పేజీలో

కేజీబీవీ పోస్టులకు భారీ డిమాండ్

- 51 కొలువులకు 1,930 దరఖాస్తులు
- ముగిసిన సర్టిఫికెట్ల పరిశీలన

ఒంగోలు విద్య, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో కాంట్రాక్టు పోస్టులకు భారీ డిమాండ్ ఏర్పడింది. ఈ పోస్టులు కేవలం 2024-25 విద్యా సంవత్సరానికి మాత్రమేనని నోటిఫికేషన్‌లో పేర్కొన్నా అభ్యర్థులు అత్యధిక సంఖ్యలో దరఖాస్తులు చేశారు. జిల్లాలోని 38 కేజీబీవీల్లో బోధన, బోధనేతర పోస్టులు ఉండగా 1,930



ఒంగోలులోని సమగ్ర శిక్ష కార్యాలయంలో అభ్యర్థుల సర్టిఫికెట్‌లను పరిశీలిస్తున్న అధికారులు

మంది దరఖాస్తు చేశారు. 42 బోధన పోస్టులకు 1,331, తొమ్మిది బోధనేతర పోస్టులకు 599 దరఖాస్తులు అందాయి. బోధన పోస్టుల్లో ఒక ప్రిన్సిపాల్ పోస్టుకు 128 మంది, రెండు పీటీటీ పోస్టులకు 46, నాలుగు ఇంగ్లీషు పోస్టులకు 69, ఆరు గణితం పోస్టులకు 259, ఐదు పీఎస్ పోస్టులకు 103, మూడు ఎస్ఎస్ పోస్టులకు 223 మంది దరఖాస్తు చేసుకున్నారు. మూడు సోషల్ పోస్టులకు 190, పీజీటీ ఫిజిక్స్ రెండు పోస్టులకు 34, రెండు కెమిస్ట్రీ పోస్టులకు 42, రెండు బోటనీ పోస్టులకు 47, రెండు జువాలజీ పోస్టులకు 43, రెండు జీఎఫ్‌సీ పోస్టులకు నాలుగు, ఎనిమిది పార్ట్‌టైం టీచర్ పోస్టులకు 143, బోధనేతరంలో మూడు వార్డెన్ పోస్టులకు 312, ఆరు

మిగతా 6వ పేజీలో



ఒంగోలులోని పోలీసు అమరవీరుల స్థూపం వద్ద సెల్యూట్ చేస్తున్న మంత్రి స్వామి, 20 సూత్రాల పథకం ఛైర్మన్ దినకర్, కలెక్టర్ అన్సారియా, జిల్లా న్యాయాధికారి భారతి, ఎస్పీ దామోదర్, మేయర్ సుజాత (ఇన్‌సెట్‌లో) నివాళులర్పిస్తున్న పోలీసులు

పోలీసుల త్యాగాలు మరువం

- మంత్రి డాక్టర్ స్వామి
- అమరవీరుల స్థూపం వద్ద నివాళి
- నగరంలో పోలీసుల ర్యాలీ

ఒంగోలుక్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రత కోసం పోలీసులు చేస్తున్న త్యాగాలు మరువలేమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక డీపీవోలోని అమరవీరుల స్థూపం వద్ద మంత్రి స్వామి.. 20 సూత్రాల పథకం ఛైర్మన్ లంకా దినకర్, కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా న్యాయాధికారి ఎ.భారతి, ఎస్పీ దామోదర్‌తో కలిసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ దేశ ప్రజల రక్షణ కోసం ప్రాణాలు పణంగా పెట్టి పనిచేస్తున్న పోలీసులకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందన్నారు. శక్తివంచన లేకుండా పనిచేస్తూ విధి నిర్వహణలో ప్రాణాలు పోగొట్టుకున్న వారి త్యాగాలు వెలకట్టలేనివని కీర్తించారు. ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ ఈనెల 21న దేశం యావత్తు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకుంటున్నదని తెలిపారు. పోలీసు

మిగతా 6వ పేజీలో

కోరిన వస్తువులు ఇంటికి..

డ్వాక్రా ఉత్పత్తులన్నీ ఆన్‌లైన్‌లో అందుబాటులోకి



విజయవాడలో సోమవారం ఏర్పాటు చేసిన డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శనలో జిల్లాకు చెందిన స్టాల్

- నెల రోజులుగా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లలో కొన్ని విక్రయాలు
- అది విజయవంతమవడంతో ఇక మరిన్ని ఉత్పత్తులు
- ఆ రెండు సంస్థలతో ప్రభుత్వ ఒప్పందం
- జిల్లాలో 1, 526 మంది పొదుపు మహిళలకు రూ.20లక్షల వరకూ హామీలేని రుణ సౌకర్యం

7



హైవేపై యుద్ధ ట్యాంకర్లు

చెన్నైలో తయారైన యుద్ధ ట్యాంకర్లను మధ్యప్రదేశ్‌కు తరలిస్తున్న ట్రాలీలు ఒంగోలు సమీపంలో త్రోవగుంట వద్ద జాతీయ రహదారిపై సోమవారం కొంతసేపు ఆగాయి. దీంతో ప్రజలు వాటిని ఆసక్తిగా గమనించారు. కొందరు సెల్ఫీలు దిగారు. పలువురు వాటి గురించి ఆరా తీయడం కన్పించింది.

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు

మద్యంపై వార్



ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎన్‌పాడులోని పెద్దబజారు వాసులు

- జనావాసాల మధ్య వైన్‌షాపులు వద్దు
- ఆందోళనకు దిగుతున్న ప్రజలు
- అధికారులకు వినతులు

వివరాలు 6వ పేజీలో

కీలక శాఖలపై సమీక్ష జరిగేనా?

నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం



ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలపై జడ్పీ సర్వసభ్య సమావేశంలో చర్చ జరిగేనా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అజెండాలో కీలక అంశాలు ఉన్నా పూర్తిస్థాయిలో చర్చించే అవకాశాలు కనిపించడం లేదు. గత రెండు పర్యాయాలు జరిగిన సమావేశాలే అందుకు నిదర్శనం. జడ్పీ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశపు హాలులో ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన జరగనుంది. అందులో చర్చించేందుకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా), డీఆర్‌డీఏ, గృహ నిర్మాణ, విద్య, విద్యుత్, వైద్య, గ్రామీణ నీటి సరఫరా-పారిశుధ్యం, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలకు చెందిన

మిగతా 6వ పేజీలో



ర్యాలీలో పాల్గొన్న మంత్రి డోలా, కలెక్టర్ అన్సారియా

పోలీసుల త్యాగాలు మరువం

(5వ పేజీ తరువాయి)

ఉద్యోగం కత్తి మీద సాములా మారిందని గుర్తు చేశారు. దేశంలో శాంతిభద్రతల పరిరక్షణలో ఈ ఏడాది 216 మంది పోలీసులు ప్రాణత్యాగం చేశారన్నారు. అనంతరం జిల్లాలో పోలీసు అమర వీరుల కుటుంబాలకు మంత్రి చేతులమీదుగా సాయం అందజేశారు. విధి నిర్వహణలో ఇటీవల మృతిచెందిన ఐదుగురు పోలీసుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున చెక్కులను ఇచ్చారు. ఏఎస్పీ కె.నాగేశ్వరరావు తొలుత దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన 216 మంది పేర్లు చదివి నివాళి అర్పించారు. పోలీసు కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ ఆర్టీసీ డిపో నుంచి తిరిగి పోలీసు కార్యాలయం వరకు చేరుకుంది. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ ఆశోక్‌బాబు, ఒంగోలు ఆర్డీఓ కె.లక్ష్మీప్రసన్న, డీటీసీ ఆర్.సుశీల, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, సీఐలు పాండురంగారావు, రాఘవేంద్రరావు, సూర్యనారాయణ, దేవప్రభాకర్, అజయ్‌కుమార్, నాగరాజు తదితరుల పాల్గొన్నారు.

అమరవీరుల కుటుంబాలతో సమావేశం

పోలీసు అమరవీరుల కుటుంబాలతో ఎస్పీ ఏఆర్.దామోదర్ సమావేశమయ్యారు. వారి సమస్యలు, కుటుంబ స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

సంతకాలు నావే...ఆర్డర్లు ఫేక్!

(5వ పేజీ తరువాయి)

నుంచి ఇటువంటి పరిస్థితి ఎప్పుడూ ఎదురుకాలేదన్నారు. న్యాయం చేసి ఆదుకోవాలని విచారణాధికారులకు విన్నవించారు. తదనంతరం జిల్లా పంచాయతీ పూర్వ ఇన్‌చార్జి అధికారి ఉషారాణిని కూడా విచారణ చేశారు. ఆ సమయంలో ఆమె చెప్పిన మాటలు విని విచారణాధికారులు అవాక్కయ్యారు. ఆ బదిలీల ఉత్తర్వులపై సంతకాలు మాత్రం తనవేనని, కానీ ఆ ఉత్తర్వులు మాత్రం ఫేక్ అని చెప్పినట్లు సమాచారం. మరోవైపు ఇటీవల జిల్లా పంచాయతీ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన గొట్టిపాటి వెంకటనాయుడు వారిని చేర్చుకోవద్దని ఎంపీడీవోలకు ఫోన్ చేసి చెప్పారని నెపం ఆయనపై మోపే ప్రయత్నం చేశారు. దీంతో విచారణాధికారులు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రస్తుత డీపీవో రాకముందే బదిలీలు

జిల్లా పంచాయతీ అధికారి వెంకటనాయుడు పది రోజుల క్రితమే బాధ్యతలు స్వీకరించారు. అప్పటికే ఉద్యోగుల బదిలీల ప్రక్రియ కూడా ముగిసింది. ఇప్పుడు ఆ తప్పును కప్పిపుచ్చేందుకు ఉషారాణి ఇతరులపై నెట్టివేస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు జిల్లా పంచాయతీ కార్యాలయంలో పనిచేసే ఇతర ఉద్యోగులపై కూడా ఆ నెపం మోపే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా అధికారిగా ఉన్న సమయంలో కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్ ప్రకారం బదిలీలు చేయాల్సి ఉండగా అందుకు భిన్నంగా చేపట్టడాన్ని విచారణాధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. అయితే దానిపై సరైన సమాధానం చెప్పకుండా దాటివేయడమే కాకుండా ఆ తప్పులను ఇతరులపై నెట్టేందుకు ప్రయత్నించినట్లు సమాచారం.

తలలుపట్టుకుంటున్న విచారణాధికారులు

పూర్వ డీపీవో ఉషారాణి చెప్తున్న మాటలతో విచారణాధికారులకు కూడా ఏమి చేయాలో తెలియక తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నట్లు సమాచారం. విచారణాధికారులు ఏ అంశాన్ని ప్రస్తావించినా దానిపై కాకుండా ఇతర అంశాలను పదేపదే ప్రస్తావించినట్లు తెలిసింది. దీంతో విచారణాధికారులు చేసేదేమీ లేక జిల్లా పంచాయతీ కార్యాలయం నుంచి బదిలీల సమయంలో కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను తెప్పించుకొని వాటిని క్షుణ్ణంగా పరిశీలించినట్లు సమాచారం. కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌కు, ఉద్యోగుల బదిలీల ఉత్తర్వులకు అసలు సంబంధం లేకుండా ఉన్నట్లు తెలిసింది. కాగా విచారణ సమయంలో ఉషారాణి చెప్పిన సమాధానం తెలిసి బాధిత ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. వెంటనే వారు తమ ఉత్తర్వులను తీసుకుని కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిశారు. ఆమె ఎదుట తమ ఆవేదన, ఆందోళనను వెలిబుచ్చారు. కాగా విచారణ సమయంలో తప్పులను కప్పిపుచ్చేందుకు, ఇతర ఉద్యోగులపై నెట్టివేసే ప్రయత్నాలు చేస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

కీలక శాఖలపై సమీక్ష జరిగేనా?

(5వ పేజీ తరువాయి)

అంశాలను అజెండాలో చేర్చారు. ఈ తొమ్మిది శాఖలు కీలకం కాగా ఆయా అంశాలపై సభ్యులు సమావేశంలో చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేయాల్సి ఉంది. అయితే కీలకమైన సమావేశానికి గత రెండు పర్యాయాలు అధికారపార్టీకి చెందిన శాసనసభ్యులు, ఇతర ముఖ్యనేతలు రాలేదు. ప్రస్తుతం జరిగే సమావేశంలో కూడా ఇదే పరిస్థితి ఉంటుందన్న అనుమానం వ్యక్తమవుతోంది. మరోవైపు ఈ సమావేశంలో సభ్యులు క్షేత్రస్థాయిలోని సమస్యలపై ప్రస్తావిస్తున్నా వాటి గురించి పట్టించుకుంటున్న పరిస్థితి లేకుండా పోయింది. మంగళవారం జరిగే సమావేశంలోనూఐనా ప్రజా సమస్యలపై పూర్తిస్థాయిలో చర్చిస్తారా? లేదా గత సమావేశపు తరహాలో మొక్కుబడిగా నిర్వహించి ముగిస్తారా? అన్నది వేచిచూడాల్సి ఉంది.

కేజీబీవీ పోస్టులకు భారీ డిమాండ్

(5వ పేజీ తరువాయి)

అకౌంటెంట్ పోస్టులకు 287 దరఖాస్తులు వచ్చాయి. కాంట్రాక్టు పోస్టులకు పెద్దఎత్తున దరఖాస్తులు రావడం నిరుద్యోగ సమస్య తీవ్రతకు దర్పణం పడుతోంది. ట్రిపుల్ ఐటీ లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ఇంజనీరింగ్ పూర్తిచేసిన విద్యార్థినులు కూడా ఈ పోస్టుల కోసం పోటీ పడుతున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థమవుతుంది. ఉమ్మడి జిల్లాకు చెందిన అభ్యర్థులు కూడా దరఖాస్తులు చేసుకున్నారు. అయితే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన వారు అర్హత లేకపోవడంతో వారు వెనుతిరగాల్సి వచ్చింది. ఒక్కో పోస్టుకు ఐదుగురు చొప్పున మెరిట్ అభ్యర్థులను సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచారు. సోమవారంతో సర్టిఫికెట్ల పరిశీలన ముగిసింది.

మద్యంపై వార్

జనావాసాల మధ్య వైన్‌షాపు వద్దు ● ఆందోళనకు దిగుతున్న ప్రజలు ● అధికారులకు వినతులు

ఒంగోలు క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జనావాసాల మధ్య మద్యం షాపులు వద్దంటూ జనం ఆందోళనకు దిగుతున్నారు. నూతన మద్యం పాలసీలో ప్రైవేటు దుకాణాలకు ఈనెల 16 నుంచి అనుమతులు ఇచ్చారు. ప్రస్తుతం వారంరోజులపాటు విక్రయాలు కొనసాగించేందుకు యజమానులకు ప్రొవిజినల్ లైసెన్స్‌లను ఎక్సైజ్ శాఖ అందజేసింది. దీంతో మొత్తం 171 మద్యం దుకాణాలు ఉండగా 150 ప్రారంభమయ్యాయి. అయితే ప్రజల నుంచి అనేక ప్రాంతాల నుంచి మద్యం దుకాణాల ఏర్పాటుపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. సంతనూతలపాడులో పెద్దబజారులో మద్యం షాపు ఏర్పాటు చేయవద్దని మహిళతోపాటు మరికొంతమంది స్థానికులు సోమవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఈఎస్ ఖాజామొహిద్దీన్ కలిసి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరులో ఆదివారం పలువురు ప్రజలు నిరసన తెలిపారు. ఇళ్ల మధ్య వైన్‌షాపులు ఏర్పాటు చేయవద్దు అంటూ నినాదాలు చేశారు. అదేవిధంగా సంతనూతలపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద జనావాసాల మద్యం దుకాణాలు వద్దు అంటూ ప్రజలు నిరసన తెలిపారు. అదుకు ఐద్వా నాయకురాళ్లు మద్దతు తెలిపారు. అదేవిధంగా మడనూరులో ఊరి బయట మద్యం షాపు ఏర్పాటు చేయాలని అధికారులకు వినతులు అందాయి. చీమకుర్తిలో కల్లుకొట్ల బజారులో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని ఎక్సైజ్ ఈఎస్‌కు వినతులు అందాయి. ఇలా జిల్లాలో అనేక ప్రాంతాలలో మద్యం దుకాణాలు ఏర్పాటును ప్రజలు నిరసిస్తున్నారు. ఈక్రమంలో ప్రభుత్వం లైసెన్సులు ఫీజు వసూలు చేసి వైన్‌షాపులు ఏర్పాటు చేయిస్తుందని, అందుకు మేము ఫీజులు చెల్లించామని మద్యం దుకాణాల యజమానులు అంటున్నారు. దీంతో కొన్నిచోట్ల మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రజలు అంగీకరించడం లేదు.

నిబంధనల ప్రకారం మద్యం దుకాణాలు: ఈఎస్

ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం దుకాణాలను ఏర్పాటు చేస్తునట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కె.ఖాజామొహిద్దీన్ తెలిపారు. లైసెన్సీదారులు దుకాణం ఏర్పాటులో వివాదాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. జిల్లాలో వచ్చిన వినతులను అధికారులు పరిశీలించి తగు న్యాయం చేస్తారన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తామని పేర్కొన్నారు.



ఎస్ఎన్‌పాడులో తహసీల్దార్ కాలనీ వద్ద నిరసన తెలుపుతున్న స్టేట్‌బ్యాంక్, పెద్దబజార్ కాలనీ వాసులు

ఇళ్ల మధ్య మద్యం షాపొద్దు

సంతనూతలపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల మధ్యన మద్యం షాపులు పెట్టొందంటూ సంతనూతలపాడులోని స్టేట్ బ్యాంకు కాలనీవాసులు, పెద్దబజారు వాసులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఐద్వా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయాలు, అంగన్‌వాడీ సెంటర్లకు, పాఠశాలలకు కూతవేటు దూరంలో ఏర్పాటుచేయడం సబబుకాదన్నారు. పెద్దబజారులోను, స్టేట్‌బ్యాంకు కాలనీలో ఇళ్ల మధ్యన ఏర్పాటుచేస్తున్న మద్యం దుకాణాలను జనవాసాలకు దూరంగా ఏర్పాటుచేయించాలని తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఎస్సై వి.అజయ్‌బాబులకు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజామొహిద్దీన్‌కు వినతిపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా నాయకులు కోదాటి కోటేశ్వరరావు, ఐద్వా మండల కార్యదర్శి ఎన్.మాలతి, నాయకులు ఎస్.వెంకటేశ్వర్లు, బి.సుబ్బారావు పాల్గొన్నారు.



వీటీసీలో ట్రేడ్ పరీక్షల్లో పాల్గొన్న క్వారీ ఉద్యోగులు

4 నుంచి క్వారీల్లో భద్రతా వారోత్సవాలు

ప్రారంభమైన ట్రేడ్ పరీక్షలు

చీమకుర్తి,అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గెలాక్సీ గ్రానైట్ క్వారీల్లో భద్రతా వారోత్సవాలు నవంబరు 4వ తేదీనుంచి 9వతేదీ వరకూ జరగనున్నాయి. ఈ వారోత్సవాల్లో భాగంగా ముందస్తుగా నిర్వహించే ట్రేడ్ పరీక్షలు సోమవారం రామతీర్థం వద్ద ఉన్న వీటీసి లో జరిగాయి. క్వారీల్లో వివిధ రకాల హోదాల్లో పని చేసే వారి సామర్థ్యాన్నినైపుణ్యాన్ని.భద్రత పట్ల బాధ్యత తీసుకొన్న వారికి నిర్వహించే ట్రేడ్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో విజేలతకు భద్రతా వారోత్సవాల ముగింపు సభలో బహుమతులు అందజేస్తారు.ఈనెల 26వ తేదీ వరకూ వివిధ విభాగాల్లో పరీక్షలు నిర్వహిస్తారు. తదుపరి వచ్చేనెల 4వ తేదీ నుంచి మైన్స్ స్టేఫ్టీ అధికారులు భద్రతా ప్రమాణాలపై క్వారీలను తనిఖీ చేస్తారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

మున్సిపల్ కార్యాలయం ముట్టడి

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విధుల నుంచి తొలగించిన తమను వెంటనే పనుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, మున్సిపల్ కార్మికులు సోమవారం మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడి చేశారు. కార్యాలయం ప్రధాన గేటు మూసివేసి కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడుతూ.. కార్మికుల ఉపాధి ఊడగొట్టే చర్యలు మానుకోవాలన్నారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. అప్కాస్ నిబంధనలకు వ్యతిరేకంగా ఏకపక్షంగా కార్మికులను తొలగించటం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి సోమయ్య, కార్మిక నాయకులు సుబ్బరాయుడు, హరి, ఇమాంసా, రమణ, నాగేంద్ర, సలాంఖాన్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏబీఆర్ఎస్ఎం విభాగాల కార్యవర్గాలు ఎన్నిక

ఒంగోలు విద్య, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహాసంఘ్ రాష్ట్ర శాఖకు సంబంధించి వివిధ విభాగాల నూతన కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏబీఆర్ఎస్ఎం రాష్ట్రశాఖ ప్రతినిధుల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంఘ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వైవీ రామిరెడ్డి, డాక్టర్ జి. రంగనాథ్ తెలిపారు. ఏబీఆర్ఎస్ఎం డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా డీఎస్‌వీఎస్ బాలసుబ్రహ్మణ్యం,కాశీబాబు, ఇంజనీరింగ్ కళాశాలల అధ్యాపకుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సి.శశిధర్, ముప్పాళ్ళ లక్ష్మణరావు, ఇంటర్మీడియేట్ కళాశాలల అధ్యాపకుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బి. శరత్‌చంద్రశేఖర్, ఎంవీ నరసయ్యలను ఎన్నుకున్నారు. రాష్ట్రంలోని వివిధ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు.

ముగిసిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష

● 9,510 మంది హాజరు

ఒంగోలు విద్య, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో ఈనెల 3నుంచి ప్రారంభమైన ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) సోమవారంతో ముగిసింది. జిల్లాలో 11,333మంది టెట్ పరీక్షకు దరఖాస్తు చేయగా 9,510 మంది పరీక్షకు హాజరుకాగా 1,823 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం సెషన్‌లో నిర్వహించగా చివరి రోజు సోమవారం మాత్రం ఒక కేంద్రంలో రెండు పూటలా నిర్వహించగా మిగిలిన మూడు కేంద్రాల్లో ఉదయం సెషన్‌లో మాత్రమే జరిగింది. ఉదయం సెషన్‌కు 523మంది అభ్యర్థులను కేటాయించగా 423మంది హాజరుకాగా 100 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌కు 124మంది అభ్యర్థులను కేటాయించగా 106 మంది హాజరు కాగా 18 మంది గైర్హాజరైనట్లు ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కె. శివకుమార్ తెలిపారు.

ఈ ప్రభుత్వమైనా ఆదుకోవాలి

● 2021లో కావూరివారిపాలెంలో షార్ట్‌సర్క్యూట్‌తో 12 పూరిళ్లు దగ్ధం
● మూడేళ్లుగా బాధితులకు రోడ్డే దిక్కు ● అప్పట్లో రూ.25 లక్షల ఆస్తి నష్టం
● స్పందించని అప్పటి వైసీపీ పాలకులు

చీరాలటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : 2021 జూలై 29న చీరాల మండల పరిధిలోని కావూరివారి పాలెం పంచాయతీ పాలిబోయినవారిపాలెంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో 12 పూరిళ్లు కాలి బూడిదయ్యాయి. దీంతో ఒక్కసారిగా ఆవీధంతా చిన్నాపెద్దా వృద్ధులు తేడా లేకుండా రోడ్డున పడ్డారు. ప్రమాదం కారణంగా విలువైన వస్తువులు, వెండి, బంగారు ఆభరణాలు, కొంతమంది విద్యార్థుల సర్టిఫికెట్లు మసయ్యాయి. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. మంటలను అదుపు చేసేందుకు ఆరోజు అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు చేసిన ప్రయత్నాలు ఇంకా కళ్లల్లో మెదులుతూనే ఉన్నాయి. నాటి నుంచి నేటివరకూ ఆసరా కోసం ఎదురు చూస్తున్నారు. అప్పట్లో ప్రజా ప్రతినిధులు, అధికార ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పరామర్శించి హామీలు ఇచ్చారు. అయితే నేటికీ వారి బతుకుల్లో ఏమాత్రం మార్పు రాలేదు. అప్పటి వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. ప్రస్తుతం ఒకరిద్దరు అప్పోసొప్పో చేసి చిన్న పాటి నివాసాలు కట్టుకుంటున్నారు. అప్పటి ప్రభుత్వం నుంచి తక్షణ సాయం లేక శాశ్వత ఆదరణకు నోచుకోలేదు. కూటమి ప్రభుత్వమైనా నిలువనీడ కల్పించాలని నిరాశ్రయులు వేడుకుంటున్నారు.



ఆహుతైన పూరిళ్లు (ఫైల్)

మూడేళ్లుగా రోడ్డుమీదే

అగ్ని ప్రమాదం కారణంగా మూడేళ్ల నుంచి రోడ్డు మీదే బతుకుతున్నాం. పూరింట్లో ఉంటూ కూలి పని చేసుకుంటున్నాం. ఇల్లు కట్టుకునే స్థోమత లేదు. దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నాం. చిన్నారులు బతుకు జీవుడా అంటూ బాధితులు రోదిస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలి. **- శ్రీలక్ష్మి, బాధితురాలు**

ఏళ్లు గడుస్తున్నా.. ఆదరణ లేదు

మంటల్లో ఇళ్లు కాలిపోయాయి. ప్రభుత్వాలు మారుతున్నా నేటికీ సాయం లేదు. వృద్ధులతో సహా రోడ్డే దిక్కయింది. ఏళ్లు గడుస్తున్నా బతుకుల్లో మార్పు లేదు. గృహాల మంజూరుకు ప్రభుత్వం చొరవచూపాలి.

- మంచాల అంకమ్మ, బాధితురాలు



పట్టణంలో సాగుతున్న ర్యాలీ

అమరవీరుల స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలి

● ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల స్ఫూర్తిని అందిపుచ్చుకొని పోలీసులు విధి నిర్వహణలో ముందుకు సాగాలని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక పట్టణ పోలీసుస్టేషన్ నుంచి ర్యాలీని ఎమ్మెల్యే నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలొడ్డిన పోలీసు అమరవీరులను జాతి ఎన్నటికీ మరువదన్నారు. ర్యాలీ దోర్నాల బస్టాండ్, నాయుడువీధి, రథం బజార్, మెయిన్ బజార్, రీడింగ్ రూమ్, కంభం సెంటర్ వరకు సాగింది. అక్కడ మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ పి.సుబ్బారావు, టౌన్, రూరల్, పీఎస్సైలు సైదుబాబు, అంకమ్మరావు, రాజమోహనరావు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, ఎన్‌సీసీ, పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు, మాజీ సైనికులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల చొరవకు సలామ్..

● ప్రమాదకర గుంతను పూడ్చివేయించిన సీఐ సుబ్బారావు



పూడ్చించిన గుంతవద్ద సీఐ సుబ్బారావు

మార్కాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అప్సర బార్ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. నెహ్రూబజార్‌కు, గడియారస్తంభం వద్దకు వెళ్లాలంటే ఆ రోడ్డే కీలకం. అటువంటి చోట రోడ్డుపై పెద్దపాటి గుంత ఏర్పడింది. దీంతో నిత్యం వేలాది వాహనాలు తిరిగే రోడ్డు కావడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి సమస్యను గమనించిన మార్కాపురం సీఐ పి.సుబ్బారావు వాహనదారుల ఇక్కట్లు తీర్చేందుకు నడుంబిగించారు. తాత్కాలికంగా క్రషర్ డస్ట్‌తో ఆ గుంతను పూడ్చివేయించారు. ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లారు. త్వరలోనే మరమ్మతులు చేయనున్నట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. పోలీసుల చొరవను పలువురు అభినందిస్తున్నారు.

ఈగోల మాకెందుకు..

● మైన్స్ అధికారుల దగ్గర తేల్చుకోండి
● గ్రానైట్ పంచాయితీపై తేల్చిచెప్పిన పోలీసులు



మైన్స్ ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ నాయకులు

చీమకుర్తి,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పోలీస్ స్టేషన్‌లో సోమవారం జరగాల్సిన గ్రానైట్ పంచాయితీని పోలీసులు ఈ గోల మాకెందుకు., మైన్స్ అధికారుల దగ్గర తేల్చుకోండి..శాంతిభద్రతల సమస్య తలెత్తితేనే తాము జోక్యం చేసుకుంటామంటూ తేల్చి చెప్పారు. దీంతో ఈ పంచాయతీ ఒంగోలు కలెక్టరేట్‌లో జరిగే గ్రీవెన్స్‌సెల్‌కు వెళ్లటం..ఉన్నతాధికారులు ఆ పంచాయతీని తేల్చాలని మైన్స్ అధికారులకు సిఫార్సు చేయటం జరిగాయి.ఈ క్రమంలో త్రీ సీఎం గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ నాయకులు జిల్లా మైన్స్ అధికారి రాజశేఖర్‌ని కలిశారు. అక్రమంగా జీరో బిల్లులతో వెళ్తున్న గ్రానైట్ శ్లాబుల రవాణాకి అడ్డుకట్ట వేయాలని రాజశేఖర్‌ని అసోసియేషన్ నాయకులు కోరారు. ఆ అర్జీపై రాజశేఖర్ స్పందిస్తూ అన్ని విషయాలను పరిశీలించి గ్రానైట్ అక్రమ రవాణా, జీరో దందాకి అడ్డుకట్ట వేసేవిధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వచ్చేనెల 17న కాపు వనభోజన మహోత్సవం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కాపు సంఘం ఆధ్వర్యంలో వచ్చేనెల 17వతేదీన ఒంగోలులో కాపువనభోజన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ తెలిపారు. స్థానిక రామనగర్‌లోని కాపు సంఘం కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో సంజీవరావు మాట్లాడారు.

పంట నష్టాలపై ప్రభుత్వం దృష్టి

(5వ పేజీ తరువాయి)

నియోజకవర్గాలలో అధికంగా కురిసింది. అలాగే సోమవారం పగటిపూట కూడా పలుచోట్ల ఒక మోస్తరు వర్షం కురిసింది.

కొనసాగుతున్న వానలు

జిల్లాలో సోమవారం కూడా వర్షం కురిసింది. సాయంత్రం ఐదు గంటల సమయానికి అత్యధికంగా కొత్తపట్నం మండలంలో 70.0 మి.మీ వర్షపాతం నమోదైంది. దొనకొండలో 53.50, పొదిలిలో 33.50, కనిగిరిలో 28.50, దర్శిలో 25.50 మి.మీ. కురిసింది. మార్కాపురం, కొమరోలు, హెచ్‌ఎంపాడు, గిద్దలూరు, జరుగుమల్లి, సీఎస్‌పురం, కురిచేడు, కొనకనమిట్ల, పామూరు మండలాల్లో ఒక మోస్తరు వానలు పడ్డాయి. దీంతో పంట నష్టాలు మరింతగా పెరుగుతున్నాయి. ఆదివారం రాత్రి, సోమవారం పగటి పూట మళ్లీ వర్షం పడటంతో నష్టాలు మరింత పెరిగే పరిస్థితి ఏర్పడటంతో తిరిగి తాజా అంచనాలను అధికారులను సిద్ధం చేస్తున్నారు. ఈనెల 27లోగా క్షేత్రస్థాయిలో వ్యవసాయశాఖ అసిస్టెంట్, వీఆర్వోలు పరిశీలన చేసి జాబితాలను సిద్ధంచేసి 28న రైతువారీ ఖాతాలను ఆర్‌బీకేల వద్ద ప్రచురించాలి. వాటిపై అభ్యంతరాలను స్వీకరించి లోటుపాట్లను సవరించి నవంబరు 2కు తుది జాబితాను సిద్ధం చేస్తే వాటిని క్షుణ్ణంగా పరిశీలించి నవంబరు 4 నాటికి కలెక్టర్ ప్రభుత్వానికి నివేదించాలి. ఆ షెడ్యూల్‌కు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు.

పెరుగుతున్న పంట నష్టాలు

● 8,409 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా గుర్తించిన అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో గత పది రోజుల నుంచి కురిసిన వర్షాలకు జిల్లాలో భారీగా పంట నష్టం వాటిల్లింది. ప్రస్తుతం వర్షాలు తగ్గి ఎండలు కాస్తుండటంతో నష్టాలు వెలుగులోకి వస్తున్నాయి. జిల్లా వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా ప్రకారం సోమవారం సాయంత్రం వరకు జిల్లాలోని 36 మండలాల్లోని 205 గ్రామాల్లో 8,409.27 హెక్టార్లలో పంటలకు నష్టం జరిగినట్లు గుర్తించారు. 7,672 మంది రైతులకు చెందిన వివిధ రకాల పంటలు వర్షాలకు దెబ్బతిన్నాయి. సజ్జ 1,883,47, మినుము 1379, జొన్న 3, అలసంద 1,683, పత్తి 2,627.80, వరి 120, కొర్ర 18, పొగాకు 695 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు సమాచారం. జిల్లావ్యాప్తంగా వర్షాలకు పలురకాల పంటలు దెబ్బతినడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. వర్షాల కారణంగా చేతికి వచ్చే పంటలు కోల్పోవడంతో భారీగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.



తర్లుపాడులో నీటిలో నానుతున్న పొగతోట



డ్వాక్రా మహిళలు, వినియోగదారులకు శుభవార్త. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లలో డ్వాక్రా ఉత్పత్తులకు అవకాశం లభించింది. ఆయా సంస్థలతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. జిల్లాలోని గ్రామైక్య సంఘాల మహిళలు తయారు చేసే ఉత్పత్తుల్లో 27 రకాలను మాత్రమే నెల రోజుల నుంచి ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నారు. ఇది విజయవంతం కావడంతో వారు తయారు చేసే అన్ని రకాల ఉత్పత్తులనూ ఇక నుంచి ఆన్‌లైన్‌లో అమ్మేందుకు మార్గం సుగమమైంది.

ఆర్డరిస్తే ఇంటికి

నెల రోజులుగా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లలో కొన్ని ఉత్పత్తుల అమ్మకాలు

- అది విజయవంతమవడంతో ఇక మరిన్ని ఉత్పత్తులు
- అమెజాన్, ఫ్లిప్‌కార్టు సంస్థలతో ప్రభుత్వ ఒప్పందం
- జిల్లాలో 1,526 మంది మహిళలకు రుణ సౌకర్యం
- ఒక్కొక్కరికి రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షలు

డ్వాక్రా ఉత్పత్తులన్నీ ఆన్‌లైన్‌లో అందుబాటులోకి

ఒంగోలు నగరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి : జిల్లాలో 1526 గ్రామైక్య సంఘాలున్నాయి. వీరు తయారు చేసే ఉత్పత్తులను సమీప పట్టణాల్లో సూపర్‌బజార్లతోనో, డీమార్ట్, మోర్ లాంటి పెద్ద వ్యాపార సంస్థలతోనూ ఒప్పందం చేసుకుని వాటిల్లో పెట్టి అమ్మకాలు సాగిస్తుంటారు. ఈ ఉత్పత్తులకు వినియోగదారుల నుంచి మంచి స్పందన వచ్చినా.. నేరుగా వారి ఇంటికి చేర్చే అవకాశం ఉండేది కాదు. ఈ స్పందనను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఆ ఉత్పత్తులకు ఆన్‌లైన్ సౌకర్యం అవకాశం కల్పించాలని భావించింది. అమెజాన్, ఫ్లిప్‌కార్టులతో ఒప్పందం చేసుకుంది. రాష్ట్రంలోని డ్వాక్రా సంఘాలు తయారు చేస్తున్న ఉత్పత్తుల్లో పచ్చళ్లు, కారం, జూట్ బ్యాగులు లాంటి 27 రకాలు రాష్ట్ర పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) ద్వారా అంతర్జాతీయ స్థాయిలో వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది. జిల్లాకు చెందిన ఈ ఉత్పత్తులు నెల రోజుల నుంచి ఆన్‌లైన్ వెబ్‌సైట్లలో ఇవి అందుబాటులోకి వచ్చాయి. వినియోగదారుల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. దీంతో వారు తయారు చేసే మొత్తం ఉత్పత్తులు అన్ని రకాల ఆన్‌లైన్ వ్యాపార సంస్థల్లో అమ్మకాలకు అవకాశం కల్పించేలా ప్రభుత్వం వ్యాపార సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. పొదుపుసంఘాల మహిళల తయారు చేసే ఉత్పత్తలను ఓఎన్‌డీసీసీ కింద ఉన్న మై స్టోర్ యాప్ ద్వారా అప్‌లోడ్ చేయటం ద్వారా అన్ని మార్కెటింగ్ యాప్‌లో ఈ వస్తువులు వినియోగదారులకు అందుబాటులోకి వస్తాయి.

ఉత్పత్తుల తయారీకి భారీగా రుణాలు



జిల్లాలో పొదుపు సంఘాల మహిళలు తయారుచేస్తున్న అనేక ఉత్పత్తులు ఇప్పటికే జాతీయస్థాయిలో కూడా గుర్తింపు పొందాయి. రాష్ట్ర ప్రభుత్వం వీటిని పలు రాష్ట్రాల్లో ప్రదర్శనల్లో పెట్టి గుర్తింపు తెచ్చింది. ఈ ఉత్పత్తులకు మరింత ప్రోత్సాహం కల్పించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. జిల్లాలోని ఒక్కో గ్రామైక్య సంఘంలో ఒకరిని ఎంపిక చేసి వారికి బ్యాంకుల నుంచి రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల రుణమిచ్చి పరిశ్రమలు ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభమైంది. మహిళలు లక్షాధికారులను చేయాలనే ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా చర్యలు ప్రారంభమయ్యాయి.

విజయవాడలో ప్రదర్శనకు వెలుగు అధికారుల హాజరు

డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసుకునే పరిశ్రమలు, ఉత్పత్తులు, మార్కెటింగ్ తదితర అంశాలపై సెర్ప్ ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల్లో ప్రస్తుతం డ్వాక్రా సంఘాలు చేస్తున్న ఉత్పత్తులు, ఇతర కార్పొరేట్ సంస్థలు తయారు చేస్తున్న ఉత్పత్తులు, వాటిని తయారు చేసేందుకు అవసరమైన పరిశ్రమల ఏర్పాటు, వాటిపై అవగాహన కల్పించారు. ఈ ప్రదర్శనకు వెలుగు జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, పొదుపు మహిళలు హాజరయ్యారు.

డ్వాక్రా మహిళలూ ఇక వ్యాపారవేత్తలే..



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న స్త్రీశక్తి, లక్‌పతిదీదీ, ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ జెనరేషన్ ప్రోగ్రాం (పీఎంఈజీపీ) లాంటి పథకాల కింద కూడా మహిళలు పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు రుణ సదుపాయం కల్పిస్తున్నారు. ఇక నుంచి మహిళలకు పరిశ్రమల ఏర్పాటుకు తగిన సాంకేతిక సహకారం, ముడిసరుకు లభ్యత, పరిశ్రమల నిర్వహణపై సెర్ప్ నుంచి తగిన సహకారం అందజేయనున్నారు. వీరు తయారు చేస్తున్న ఉత్పత్తులను ఆన్‌లైన్ ద్వారా అందుబాటులోకి తేవడం ద్వారా విదేశాల్లోనూ డిమాండ్ పెరుగుతుంది. తద్వారా పొదుపు సంఘాలు ఆర్థికంగా మరింత బలపడి మహిళలు లక్షాధికారులు కావొచ్చు.

మార్కెటింగ్ ఇబ్బందులు తొలగిపోయాయి



పదేళ్ల క్రితం రూ.10 లక్షల రుణం తీసుకుని తేనె తయారీ యూనిట్ ఏర్పాటు చేసుకున్నాం. తేనెటీగలను పెంచుతూ తేనె సేకరిస్తూ బాటిళ్ల అమ్ముతూ వచ్చిన ఆదాయంతో లోను తీర్చేశా. మార్కెటింగ్‌కు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇప్పుడు ఎన్‌డీసీ ద్వారా మైస్టోర్ యాప్‌లో మా ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో ఉంచటంతో డిమాండ్ వస్తోంది. మార్కెటింగ్ ఇబ్బందులు తొలగిపోయాయి.

- కరవది జయలక్ష్మి, ఇనమనమెళ్లూరు





అద్దంకమ్మ వార్షికోత్సవ వైభవం

చీరాల మండలం పాత చీరాల గ్రామంలో అద్దంకమ్మ అమ్మవారి 14వ వార్షికోత్సవం దేవు వంశస్థులు ఘనంగా నిర్వహించారు. నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న వేడుకలు సోమవారం ముగిశాయి. చివరిరోజు అమ్మవారి ఊరేగింపు ఘనంగా జరిగింది. భక్తిశ్రద్ధలతో భక్తులు పూజలో పాల్గొన్నారు. - చీరాల టౌన్ (ఆంధ్రజ్యోతి)

పృథులగిరీశుని భూములను పరిరక్షిస్తాం : తహసీల్దార్

పొదిలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కోట్లాది రూపాయాల విలువచేసే పృథుల గిరీశుని భూములను పరిరక్షిస్తామని, తహసీల్దార్ కృష్ణారెడ్డి తెలిపారు. ఆలయ భూములో అక్రమ కట్టడాలను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు సోమవారం ఆయన పరిశీలించారు. దేవాలయ భూమిలో పక్కాకట్టడలు ఎలా నిర్మిస్తారని గోశాల నిర్వాహకులను ప్రశ్నించారు. గోశాల నిర్వహణకు ఎలాంటి అనుమతులు ఉన్నాయని వారినుండి వివరాలు అడిగారు. ఎలాంటి అనుమతులు లేకుండా దేవాలయ భూమిని ఆక్రమించడం చట్టరీత్యానేరం కదా అని ప్రశ్నించారు. దీనికి నిర్వాహకులు సేవాభావంతో గోశాలను నిర్వహిస్తున్నామని తహసీల్దార్ దృష్టికి దృష్టికి తీసుకొచ్చారు. అయినప్పటికీ దేవాలయ భూములను అన్యాక్రాంతం చేయడం సమంజసం కాదన్నారు. దేవాదాయశాఖ ఉన్నతాధికారులు సైతం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'పృథులగిరీశుని భూమి హాంఫట్' కథనానికి స్పందించారు. ఒంగోలు అసిస్టెంట్ కమిషనర్ ఈవోను వివరణ కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు దేవాదాయశాఖ అధికారులు సైతం కలెక్టర్‌కు నివేదిక సమర్పించినట్లు తెలిసింది. ఆ శాఖ గుంటూరు డిప్యూటీ కమిషనర్ నుంచి అనుమతులు తీసుకొని శాశ్వత కట్టడాలు తొలగిస్తామని ఈవోలు తెలిపారు. ఆ మేరకు ప్రతిపాదనలు తయారుచేసి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు చెప్పారు. కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి సైతం ఈవోకు ఫోన్ చేసి కట్టడాలపై వివరాలు తెలుసుకున్నారు. మొత్తం మీద రూ.15కోట్ల విలువచేసే భూములపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం పట్టణంలో చర్చాంశనీయంగా మారింది.



గోశాలను శాశ్వత కట్టడాలను పరిశీలిస్తున్న తహశీల్దార్ క్రిష్ణారెడ్డి

అమరవీరులకు నివాళి

కంభం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : దేశంలో శాంతిభద్రతల రక్షణ కోసం ఎంతోమంది పోలీసులు వీరమరణం పొందారని కంభం సీఐ మల్లికార్జునరావు తెలిపారు. సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. కంభం, బేస్తవారపేట, అర్థవీడు మండలాల ఎస్సైలు, పోలీసులు, ఎన్‌సీసీ విద్యార్థులు ఆర్టీసీ బస్టాండ్ నుంచి కందులాపురం కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కందులాపురం సెంటర్‌లో మానవహారంగా నిలిచి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కంభం ఎస్సై నరసింహారావు, బేస్తవారపేట ఎస్సై రవీంద్రరెడ్డి, అర్థవీడు ఎస్సై నాయక్ పాల్గొన్నారు.



కంభంలో ర్యాలీలో పాల్గొన్న పోలీసులు

జనవరి 18 నుంచి ఎన్టీఆర్ కళాపరిషత్ కళార్చన

ఒంగోలు (కల్చరల్), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో భారతీయం కళార్చన 2024-25 కార్యక్రమాన్ని జనవరి 18 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కళాపరిషత్ అధ్యక్షులు ఈదర హరిబాబు తెలిపారు. సోమవారం స్థానిక మౌర్యా ఇన్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ప్రఖ్యాత నటులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వర్ధంతి సందర్భంగా అనేక సంవత్సరాలుగా కళాపరిషత్ ఆధ్వర్యంలో నాటకోత్సవాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అయితే గత 5 సంవత్సరాలుగా వైసీపీ ప్రభుత్వంలో అనేక అడ్డంకులు సృష్టించటం వలన నిర్వహించలేక పోయామన్నారు. 2025 జనవరిలో కళాపరిషత్ 25వ జాతీయ నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 64 కళల సంబరాలలో భాగంగా నిర్వహించే నాటకోత్సవాల అప్లికేషన్, బ్రోచర్‌ను ఈ సందర్భంగా ఆయన విడుదల చేశారు. అన్ని విభాగాల నాటకాలకు అవకాశం కలిగే విధంగా పోటీతత్వంలో కాక ఫెస్టివల్ నేపథ్యంలో పద్య, గద్య, సంగీత, నృత్య, చారిత్రాత్మక, సామాజిక, పౌరాణిక, ప్రయోగాత్మక, జానపద, కల్పిత, ముఖాభినయం, హాస్య, బాల, యువ, మహిళా, స్టేజీ, ఎరినీ, వీధి ఇలా వివిధ విభాగాలలో అన్ని కళా సంస్థలకు ఆహ్వానం పలుకుతున్నట్లు తెలిపారు. నాటక కాల పరిధి, నాటక అంశాలను దృష్టిలో ఉంచుకొని అన్ని విభాగాల నాటకాలకు గౌరవ పారితోషికం అందజేస్తామన్నారు. కళాసంస్థలు నవంబర్ 30వ తేదీ లోపు దరఖాస్తులను పంపాలన్నారు. ఈ సంవత్సరం నుంచి నాటకాలను వీడియో ద్వారానే స్క్రూట్నీ చేసి ఎంపికచేస్తామని హరిబాబు తెలిపారు. వీడియోను 9848910111 నెంబర్‌కు వాట్సాప్ చేయాలన్నారు. సీడీ, డీవీడీ, పెన్ డ్రైవ్ ద్వారా పంపేవారు అన్నమనేని ప్రసాద రావు, కార్యదర్శి, ప్లాట్ నెం.506, హిల్ టవర్స్, సీతారామపురం, ఒంగోలు, ప్రకాశం జిల్లా చిరునామాకు పంపాలన్నారు. మరిన్ని వివరాలకు 9849110111, 9347505277 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని ఈదర హరిబాబు తెలిపారు. సమావేశంలో అన్నమనేని ప్రసాద రావు, ప్రముఖ నాటక రచయిత పాటిబండ్ల ఆనంద రావు, ఎల్.భుజంగరావు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు హరిబాబు

ప్రభుత్వ వైద్యశాలలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రసవం

- వైద్యసేవలపై పూర్తి నమ్మకంతోనే..

గిద్దలూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలందితే పేదలే కాకుండా మధ్యతరగతి ప్రజలు కూడా వాటిని ఆశ్రయిస్తారు. గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలే ఇందుకు నిదర్శనం. ఈ వైద్యశాలపై ఉన్న విశ్వాసంతో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఇక్కడే కాన్పు చేయించుకున్నారు. వైద్యులు సుఖప్రసవం చేయడంతో సంతోషించారు. తమవంతు తోడ్పాటుగా వైద్యశాలకు నాలుగు కుర్చీలు బహూకరించారు. గిద్దలూరు పట్టణంలోని నల్లబండ బజారుకు చెందిన ముత్యాల కృష్ణవేణి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కాగా ఆమె భర్త కూడా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. గర్భిణిగా ప్రసవం కోసం పుట్టిల్లు అయిన గిద్దలూరుకు వచ్చారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి చెందిందని, అనుభవం ఉన్న గైనికాలజిస్టు, వైద్యనిపుణులు ఉన్నారని తెలుసుకొని, వారిపై నమ్మకంతో ప్రసవానికి ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. ఆమెకు ఈ వైద్యశాలలో ఈనెల 18న సుఖప్రసవం అయింది. ఆమె బిడ్డను చిన్నపిల్లల విభాగంలోని ఐసీయూలో ఉంచారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. ప్రభుత్వ వైద్యుల పట్ల, ప్రభుత్వ ఆసుపత్రి పట్ల నమ్మకంతో ఇక్కడికి వచ్చానని ఈ సందర్భంగా కృష్ణవేణి పేర్కొన్నారు. పుట్టిన బిడ్డతో పాటు ఆమె సోమవారం ఆమె డిశ్చార్జ్ అయ్యారు. ప్రసూతి, చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ జయమ్మ, డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ కాదరయ్య డాక్టర్ సుధాకర్, డాక్టర్ గౌసియాలకు కృతజ్ఞతలు తెలిపారు.



వైద్యులతో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ క్రిష్ణవేణి

రోడ్లు ఇలా.. ప్రయాణమెలా?

- వర్షాలకు రొచ్చురొచ్చుగా కొన్ని.. గుంతలమయంగా మరికొన్ని దారులు
- నడవడానికి కూడా అవకాశం లేని దైన్యం
- జాడి పడిపోతున్న వాహనాలు

'అడుగుకో గుంత. బారకొక గతుకు' అన్నట్టుంది జిల్లాలో రోడ్ల దుస్థితి. ఇటీవల పడిన వర్షాలకు రహదారులు దారుణంగా తయారయ్యాయి. బురదమయమై రొచ్చురొచ్చుగా మారాయి. ఈ దారుల్లో వెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల గుంతలు పడి వాహనాలు దిగబడిపోతున్నాయి. ఇంకొన్నిచోట్ల బురదలో టైర్లు జారి వాహనాలు పక్కకు జారి పడిపోతున్నాయి. మరికొనిచోట్ల బురదకయ్యలుగా మారి ప్రజలు నడవడానికి కూడా అవకావశం లేకుండా ఉన్నాయి. రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. ఈ బురద ఆరడానికి నాలుగైదు రోజులు పడుతుంది. కూటమి ప్రభుత్వం తక్షణమే రోడ్ల మరమ్మతులు చేపడితే తప్ప గ్రామీణ రహదారులపై రాకపోకలు సాధ్యమయ్యేలా లేదు.

రోడ్డంతా గుంతలే..





ఇది ఒంగోలులోని కొప్పోలు రోడ్డు బృందావన గార్డెన్స్ కాలనీకి వెళ్లే రహదారి. అడుగడుగునా గుంతలే. రోడ్డంతా ఎత్తుపల్లాలే. ఇవి అడుగు లోతులో ఉండటంతో కార్లు, ద్విచ్రవాహనాలు కాలనీలోకి వెళ్లాలంటేనే ప్రమాదభరితంగా ఉంది. కార్పొరేషన్ అధికారులు తక్షణమే స్పందించి మరమ్మతులు చేయాలని బృందావన్ గార్డెన్స్ కాలనీవాసులు కోరుతున్నారు. - ఒంగోలు(రూరల్)



ఇది గిద్దలూరులోని నల్లబండ బజారు చివరలో ఉన్న నాయిబ్రాహ్మణ కాలనీలో రోడ్డు. సిమెంటు రోడ్లు, డ్రైనేజీ సౌకర్యం లేక వర్షపు నీరంతా రోడ్డుపైనే నిలిచి బురదమయమైంది. నడిస్తే జారిపడటమే. - గిద్దలూరు

దారి మొత్తం బు'రొదే'!



మరమ్మతులకు గురైన లారీ



కింద పడిపోయిన గ్రానైట్ రాయి

ఇది మండల పరిధిలోని కొణిదెన- మార్టూరు అర్అండ్‌బీ రోడ్డు. రహదారిలో గుంతలు చాలా లోతుగా ఉన్నాయి. శనివారం గ్రానైట్ ముడిరాయి తరలించే లారీ గుంతల్లో అదుపు తప్పడంతో లారీపై ఉన్న రెండు రాళ్లు రోడ్డు సగభాగంలో పడిపోయాయి. సోమవారం స్లాబుల లారీ రోడ్డు మధ్యలో మరమ్మతులకు గురైంది. దీంతో ఈ మార్గంలో ద్విచక్ర వాహనాలు తప్ప నాలుగు చక్రాల వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. రెండు రోజుల నుంచి అర్టీసీ బస్సులు రావడం లేదని పట్టణ ప్రాంతాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నామని కొణిదెన వాసులు వాపోతున్నారు. -బల్లికురవ

ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించాలి

మీకోసంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా



గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మీకోసంలో వచ్చిన ప్రతి అర్జీని సీరియస్‌గా పరిగణన లోకి తీసుకొని సకాలంలో సహేతుకంగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీ కోసం హాలులో సోమవారం జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణతో కలిసి ప్రజలనుంచి ఆర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మీ కోసం కార్యక్రమాన్ని ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. జిల్లాలో అర్జీలను పరిష్కరిస్తున్న తీరును ముఖ్యమంత్రి కార్యాలయంనుంచి అధికారులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. మొక్కుబడి సమాధానాలతో అర్జీదారులకు ఎండార్స్‌మెంట్ ఇచ్చేసి సమస్యను పరిష్కరించినట్లుగా రికార్డులలో చూపితే సహించేది లేదని హెచ్చరించారు. క్షేత్ర స్థాయిలో సమస్య పరిష్కారం కావాల్సిందేనని స్పష్టం చేశారు. ఆ సమస్య పరిష్కరించలేని పక్షంలో అందుకు కారణాలను కూడా అర్జీదారులకు వివరించాలని సూచించారు. మీ కోసం కార్యక్రమానికి అధికారులు సమయపాలన పాటించాలన్నారు. ప్రతి సోమవారం ఉదయం 9.55 గంటలకల్లా అధికారులందరూ హాజరుకావాలని ఆదేశించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సుమారు 249 అర్జీలు అధికారులకు అందాయి. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఆర్. శ్రీలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాధురి, ఝాన్సీ లక్ష్మితో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ ఏఆర్ దామోదర్



ప్రజాఫిర్యాదుల వేదికలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలుక్రైం, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ కోరారు. సోమవారం స్థానిక పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 69 మంది తమ వినతులను ఎస్పీకి అందజేశారు. వీటిలో సైబర్ నేరాల పై ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగాయని అన్నారు. నేరగాళ్లు అనేక రకాలుగా ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. సైబర్ మోసాలకు గురైయిన వారు వెంటనే 1930 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

బాల్యం బంగారుమయం కావాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : బాల్యమనేది ప్రతి ఒక్కరికి బంగారుమయం కావాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. ఆ దిశగా 18 ఏళ్లలోపు వారందరికి విద్య, వైద్యం, సామాజిక భద్రత కల్పనే లక్ష్యంగా దృష్టి పెట్టినట్లు తెలిపారు. అందుకోసం జిల్లాలో బంగారుబాల్యం కార్యక్రమాన్ని ప్రత్యేకంగా రూపొందించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో సోమవారం సాయంత్రం సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని నివారించడంతో పాటు స్కూలు డ్రాప్ అవుట్స్ తగ్గింపునకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆయా వయస్సుకుతగినట్లుగా బాలలు అంగన్‌వాడీలు, పాఠశాలలు, కాలేజీల్లో ఉండే విధంగా చేస్తామన్నారు. జిల్లా యంత్రాంగం చేపడుతున్న ఈచర్యలకు స్వచ్ఛంద సంస్థలు కూడా అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థుల డ్రాప్ అవుట్స్ లేకుండా స్కూలు మేనేజ్‌మెంట్‌కమిటీలు క్రీయాశీలకంగా వ్యవహరించేలా చూడాలని కోరారు. బాలల అక్రమ రవాణా, వారితో కూలీ పనులు చేయించకుండా నివారించేందుకు సంబంధిత శాఖలు అంతర్గతంగా చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయా అంశాలపై కలెక్టర్ మాట్లాడుతూ బాలల సమ్మిళిత అభివృద్ధే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం దృష్టి పెట్టిందన్నారు. స్వచ్ఛంద సంస్థల సూచనలు,సలహాలను పరిగణనలోకి తీసుకొని చైల్డ్ ఫ్రెండ్లీ గ్రామాలు సాక్షాత్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు మాధురి, సామా సుబ్బారావు, గాయత్రీదేవి, సురేష్‌కుమార్, వసుంధర, రవికుమార్. లక్ష్మానాయక్, జగన్నాథరావు, అంజల, బాల ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

ఎంపీటీసీ సభ్యుడిపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వైద్యాధికారుల సంఘం నేతలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కొత్తపట్నం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ వైష్ణవి పట్ల అసభ్యకర పదజాలంతో దూషించిన ఎంపీటీసీ సభ్యుడు వెంకటరావుపై చర్యలు తీసుకోవాలని వైద్యాధికారుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ రాహుల్, డాక్టర్ ఖాదర్‌మస్తాన్‌బీలు కోరారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ చాంబర్‌లో తమీమ్ అన్సారియానుకలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఈ ఘటనపై ముగ్గురు అధికారులతో విచారణ చేయించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సురేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని కడతేర్చాడు!

- ఊళ్లపాలెంలో వివాహిత హత్య కేసులో భర్త అరెస్టు
- వివరాలను వెల్లడించిన సీఐ హజరత్తయ్య



వివరాలు వెల్లడిస్తున్న సీఐ హజరత్తయ్య

సింగరాయకొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊళ్లపాలెంలో భార్యను కత్తితో పొడిచి చంపిన భర్తను పోలీసులు అరెస్టు చేశారు. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందన్న కారణంతోనే ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు తేల్చారు. నిందితుడిని కందుకూరు కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి రిమాండ్ విధించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ హజరత్తయ్య వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. నెల్లూరు జిల్లా ఇసుకపల్లికి చెందిన పురిణి మాలకొండయ్య, ఆదెమ్మ దంపతులకు ఐదుగురు కుమార్తెలున్నారు. వారిలో నాలుగో కుమార్తె అయిన లక్ష్మీతిరుపతమ్మను సింగరాయకొండ మండలంలోని ఊళ్లపాలెం గ్రామానికి చెందిన పుట్టా వెంకట్రావుకు ఇచ్చి 2018 మార్చిలో వివాహం చేశారు. తొలుత వారి దాంపత్య జీవితం సాఫీగానే సాగింది. ఒక కుమారుడు, కుమార్తె జన్మించారు. కొంతకాలం నుంచి వెంకట్రావు మద్యానికి బానిసవడంతో పాటు మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. దీంతో భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. వివాహేతర సంబంధానికి అడ్డుచెప్తున్నదన్న కారణంతో లక్ష్మీతిరుపతమ్మను వెంకట్రావు మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు.

ఈ క్రమంలో ఈనెల 17న భార్యాభర్తల మధ్య వివాదం జరిగింది. ఆ సమయంలో వెంకట్రావు ఇంట్లో ఉన్న కత్తితో లక్ష్మీతిరుపతమ్మ మెడభాగంలో విచక్షణారహితంగా పొడిచాడు. దీంతో తీవ్రరక్తస్రావమై ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. బంధువులు సింగరాయకొండలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందింది. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సోమవారం స్థానిక కందుకూరు ఫ్లైవోవర్ వద్ద నిందితుడు వెంకట్రావును అరెస్ట్ చేశారు. అనంతరం కందుకూరు కోర్టులో హాజరుపరగా న్యాయాధికారి 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ వివరించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఒంగోలులో ఇటీవల అతికిరాతకమైన చెడ్డీ గ్యాంగ్ కదిలికలను గుర్తించామని సీఐ హజరత్తయ్య తెలిపారు. ఈనేపథ్యంలో సింగరాయకొండ సర్కిల్ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటికి తాళాలు వేసుకొని ఇతర గ్రామాలకు, ప్రాంతాలకు వెళ్లేవారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ముందుగా సమాచారం ఇవ్వాలన్నారు. ఆ ఇళ్లపై ప్రత్యేక నిఘా ఉంచుతామని వెల్లడించారు. అధిక మెత్తంలో బంగారం, నగదు ఉంటే బ్యాంకులలో దాచుకోవాలని సూచించారు. అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ గృహాలలో సీసీ కెమెరాలను అమర్చుకోవాలన్నారు.

పోలీసు అమరవీరుల స్మారక ర్యాలీ



కొండపిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సైలు, పోలీసులు, విద్యార్థులు

కొండపి/సింగరాయకొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా కొండపిలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీసు స్టేషన్ నుంచి ప్రారంభమైన ప్రదర్శన మండల కార్యాలయాల వరకూ సాగింది. ఈసందర్భంగా అమరులైన పోలీసులకు జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో కొండపి, పొన్నలూరు, మర్రిపూడి ఎస్సైలు ప్రేమ్‌కుమార్, అనూక్, రమేష్ బాబు, కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సింగరాయకొండలో..

పోలీసు అమరవీరుల సేవలు అజరామరమని సీఐ హజరత్తయ్య అన్నా రు. అమరులైన పోలీసు వీరులకు స్థానిక స్టేషన్‌లో సోమవారం నివాళులర్పించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ నుంచి కందుకూరు రోడ్డు కూడలి వరకూ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడి అమరవీరులకు అంజలి ఘటించారు. సర్కిల్ పరిధిలోని ఎస్సైలు మహేంద్ర, నాగమల్లేశ్వరరావు, వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చీమకుర్తిలో

చీమకుర్తి : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో విద్యార్థులు, పోలీసులు,పట్టణ పౌరులు పాల్గొన్నారు. విధి నిర్వహణలో అశువులు బాసిన అమర వీరులకు ఘన నివాళులు అర్పించారు.

కొత్తపట్నంలో

కొత్తపట్నం(ఒంగోలునగరం) : పోలీసు అమర వీ రుల స్మారక దినోత్సవం సందర్భంగా సోమవారం కొత్తపట్నంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎస్ఐ సుధాకర్, హెడ్‌కానిస్టేబుల్ పాండురంగారావు, జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ట్రైనింగ్ కమిషనర్ కొణిజేటి వెంకట శేషారావు ర్యాలీలో పాల్గొన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ సుధాకర్ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసుసిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్దిపాడులో

మద్దిపాడు :పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయమని మద్దిపాడు ఎస్ఐ శివరామయ్య అన్నారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో నిర్వహించిన అమరవీరుల సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. ఏఎ్‌సఐ రవికిషోర్, పోలీస్ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అధిక వడ్డీలను నిలుపుదల చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా గ్రూపు మహిళల నుంచి అధిక వడ్డీవసూలు చేసే విధానాలను నిలుపుదల చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్ చేశారు. డ్వాక్రా మహిళలతో కలిసి సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ స్థానిక గాంధీనగర్‌కు చెందిన డ్వాక్రా గ్రూపు మహిళల నుంచి ఏడాది కాలంగా గ్రూపు మహిళలకు ఇచ్చిన లోన్లకు అవసరానికి మించి అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధులు జి. ఆదిలక్ష్మి, ఎస్‌డీ అమీరున్నీసా, సీఐటీయూ నాయకుడు ఎస్‌డీహస్సేన్, డ్వాక్రా గ్రూపు మహిళలు పాల్గొన్నారు

డీఎస్సీ శిక్షణకు 25లోగా దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలునగరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న డీఎస్సీ పరీక్షకు ఉచితంగా శిక్షణ పొందేందుకు జిల్లాలోని ఎస్సీఎస్టీ అభ్యర్థులు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం గడువును పొడిగించిందని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.లక్ష్మానాయక్, జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి జగన్నాథరావు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్

కొండపి, అక్టోబరు 21 : మండలంలోని మూగచింతల సచివాలయాన్ని తహసీల్దార్ పి.మురళి సోమవారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను చూశారు. అనంతరం గ్రామంలోని ఎంపీ స్కూల్‌ను ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.



దాతలతో కలసి శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ వైకుంఠ పద్మశ్రీ

దాతల ఔదార్యం మరువలేనిది

నాగులుప్పలపాడు అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : దాతల ఔదార్యం మరువలేనిదని ముప్పాళ్ల సర్పంచ్ వైకుంఠ పద్మశ్రీ అన్నారు. మద్దిరాల గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేలా ఊర చెరువులో దాత ఏలూరి చక్రపాణి అలివేలమ్మ దంపతుల కుమారులు భవానీ శంకర్ ,వెంకటేష్ సహకారంతో రూ. 8 లక్షలతో నిర్మించిన తాగునీటి బావిని సోమవారం రాత్రి సర్పంచ్ వైకుంఠ పద్మశ్రీ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాతల సహకారంతో తాగునీటి ఊట బావి ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు ఎక్కించి పైప్‌లైన్ల ద్వారా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వైకుంఠ వీరాంజనేయులు, పుచ్చకాయల వెంకటేశ్వర్లు, వెంకటేష్(టింకు) కండ్లగుంట శ్రీనివాసరావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, తగిరిశ వేణుబాబు, వార్డు మెంబరు కండ్లగుంట మహాలక్ష్మి పాల్గొన్నారు.

చెరువులో పడి యువకుడు మృతి

మద్దిపాడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):దొడ్డవరప్పాడు చెరువులో పడి సోమవారం ఓ యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. దొడ్డవరప్పాడు గ్రామానికి చెందిన గడ్డం శ్రీకాంత్(45) ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు మద్దిపాడు ఎస్ఐ శివరామయ్య సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

రౌడీ షీటర్లు నేర ప్రవృత్తిని వీడి సమాజం కోసం పనిచేయాలని ఎస్ఐ శివరామయ్య కోరారు. సోమవారం రౌడీ షీటర్లకు పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, బెదిరింపులకు దిగడం లాంటి చర్యలు చేపడితే కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో రౌడీషీటర్లు ఇబ్బందులు పెడితే తమకు తెలియజేయాలని ఎస్ఐ కోరారు.

రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలి

రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ సృజన్ కుమార్ ఆదేశించారు. గ్రీవెన్స్‌సెల్‌లో వచ్చిన అర్జీలను తక్షణం పరిష్కరించాలని సోమవారం వీఆర్వోలకు సూచించారు. గ్రామాల్లో రెవెన్యూపరంగా సమస్యలు ఉంటే అర్జీ రూపంలో తెలియజేయాలని, పెండింగ్ సమస్యలు క్షేత్రస్థాయిలో పరిష్కరించాలని వీఆర్వోలను ఆయన ఆదేశించారు.

విద్యుదాఘాతానికి గురై రైతు మృతి

చీమకుర్తి,అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తన పంటపొలంలో పంటను కాపాడుకోవడానికి వెళ్లిన రైతు కరెంట్‌షాక్ తగిలి మృత్యువాతకు గురైన సంఘటన చీమకుర్తి మండలంలో మంచికలపాడు పొలాల్లో జరిగింది. మంచికలపాడుకు చెందిన రైతు కోరా సుబ్బారావు(39) తన గ్రామానికి సమీపంలోని తొర్రగుడిపాడు పరిధిలో ఉన్న పొలంలో వరి పంట సాగు చేశాడు. పంటకు నీరు పెట్టేందుకు నీళ్ల మోటారు వద్ద ఉన్న స్విచ్ ఆన్ చేసిన క్రమంలో నేల మీద గడ్డి కింద ఉన్న కరెంట్ వైర్ ఎడమకాలికి తగిలి షాక్ కొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

మురుగు కాలువలో తేలిన వలస కార్మికుని మృతదేహం

చీమకుర్తి, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం వచ్చి మురుగు కాలువలో పడి వలస కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం చీమకుర్తి పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో చోటుచేసుకుంది.వివరాల్లోకి వస్తే పీరు(47) అనే వైజాగ్‌కి చెందిన వ్యక్తి గత కొంత కాలంగా గ్రానైట్ పరిశ్రమలో జాకీ కార్మికునిగా పనిచేస్తున్నాడు. కాగా బస్టాండ్ సెంటర్‌లో ఉన్న డ్రైనేజీ చప్టాపై అపస్మారక స్థితిలో నిద్రించిన పీరు జారి మురుగుకాలువలో పడి మృతి చెందాడని సీఐ సుబ్బారావు తెలిపారు.కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి సంఘటనపై విచారణ జరుపుతున్నారు.

అవీ..ఇవీ



మాట్లాడుతున్న వేలం కేంద్రం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

అనుమతి మేరకే పొగాకు సాగు చేయాలి

టంగుటూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : బోర్డు అనుమతించిన మేరకే రైతులు పొగాకు సాగు చేయాలని వేలం కేంద్రం సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక వేలం కేంద్రంలో సోమవారం పొగాకు నియంత్రణ, ప్రత్యామ్నాయ పంటల సాగుపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 2024-25 పంట కాలానికి బ్యారన్‌కు 5.5 ఎకరాల పంట సాగు, 4,175 కిలోల పంట ఉత్పత్తికి బోర్డు అనుమతించిందని చెప్పారు. దానికి లోబడి పంట పడించాలన్నారు. రైతులంతా బోర్డు, సీటీఆర్ఐ వారు సిఫార్సు చేసిన అధిక దిగుబడులిచ్చే వంగడాలను మాత్రమే సాగు చేయాలన్నారు. ప్రత్యామ్నాయంగా శనగ, మిరప, కంది తదితర పంటలు పండించడం ద్వారా పొగాకు మార్కెట్‌లో ఒడిదొడుకులు ఎదురైనా రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చన్నారు. కార్యక్రమంలో క్షేత్ర అధికారి ఉపేంద్ర, ఐటీసీ మార్కెటింగ్ మేనేజర్ పి.రాజశేఖర్, జీపీఐ మేనేజర్ ఉన్నం శ్రీనివాస్, పీఎస్ఎస్ మేనేజర్ ఆర్ల రామాంజనేయులు, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.



యూనివర్సిటీ ప్రాంగణంలో నిలిచిన నీటిని బయటకు మళ్లిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

వర్షపు నీరు బయటకు మళ్లింపు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆంధ్రకేసరి యూనివర్శి ప్రాంగణంలో నిలిచిన వర్షపు నీటిని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు బయటకు మళ్లించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్‌మండే హర్షప్రీతమ్ దేవ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఆ నీటిని బయటకు పంపించేందుకు కాలువలు తీశారు. వారం రోజుల నుంచివిస్తారంగా వర్షాలు పడుతుండటంతో యూనివర్శిటీ ప్రాంగణంలో వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆ నీటిని బయటకు పంపేందుకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కే భాస్కర్, అజయ్‌కుమార్, ప్రియాంక, సాయి శరణ్య, డికే సంఘమిత్ర, అంజలికే భూమిక తదితరులు ఉన్నారు.



ప్రోగ్రామ్ అధికారులతో మాట్లాడుతున్న డాక్టర్‌వరుణ్‌విజయ్ గైకి

ఆరోగ్య పథకాలను ప్రజలకు చేరువ చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖ అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలను ప్రజలకు చేరువయ్యే విధంగా పని చేయాలని కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ పరిశీలకులు డాక్టర్ వరుణ్ విజయ్ గైకి సూచించారు. జిల్లాలో అమలు జరుగుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను పరిశీలించేందుకు ఆయన జిల్లాకు వచ్చారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో పథకాల ప్రోగ్రామ్ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్యశాఖ పరిధిలో పనిచేసే వైద్యాధికారుల నుంచి సిబ్బంది వరకు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లా ప్రధాన ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రులు, సామాజిక, పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలను పరిశీలిస్తానన్నారు. ఆయా పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకుంటానని ఆయన తెలిపారు. అందుకు అవసరమైన నివే దికలను అందజేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సురేష్‌కుమార్, ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ పద్మజ, డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్‌భగీరథి, ఎన్‌సీడీ నోడల్ అధికారి శ్రీనివాసులు, జిల్లా మాస్‌మీడియా అధికారి సుగుణమ్మ తదితరులు ఉన్నారు.

ఫీజు బకాయిలను విడుదల చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లాకార్యదర్శి సీహెచ్ వినోద్ కోరారు. స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, ఇతరకోర్సులు చదువుతున్న 47,423 మంది విద్యార్థులకు 2023-24 సంవత్సరానికి సంబంధించిన బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి బండి వీరస్వామి, విజయ్, దేవ, కార్తీక్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఆధార్‌క్యాంపులు

సంతనూతలపాడు, అక్టోబరు 21: (ఆంధ్రజ్యోతి) ఈనెల 22 నుంచి 25 వరకు ఆయా గ్రామాల్లో ప్రత్యేక ఆధార్‌క్యాంపులు ఏర్పాటుచేస్తున్నట్లు ఎంపీడీవో సురేష్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 22, 23న ఎమ్.వేములపాడు, రుద్రవరం సచివాలయాల్లోను, 24న బొడ్డువారిపాలెం, ఎండ్లూరు సచివాలయాల్లోను, 25న ఎనికపాడు, ఎండ్లూరు సచివాలయాల్లోను ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తారని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని ఎంపీడీవో సురేష్‌బాబు కోరారు.

అవీ..ఇవీ

పిడుగుపాటుకు గేదె మృతి

తర్లుపాడు, అక్టోబరు 21 ఆంధ్రజ్యోతి: మండలంలో సోమవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. తర్లుపాడు గ్రామానికి చెందిన పశపోషకులు పొలంలో గేదెలు మేపుతుండగా ఒక్కసారిగా వర్షం వచ్చింది. దీంతో దుగ్గెంపూడి శివారెడ్డికి చెందిన గేదెలు వేర్వేరుగా మేస్తున్నాయి. గేదెమీద పిడుగు పడటంతో ఒక గేదె అక్కడికక్కడే మృతి చెందింది. పోషకులు దూరంగా ఉండటంతో పెనుప్రమాదం తప్పింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని శివారెడ్డి తెలిపారు. నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

అనారోగ్యంతో బాలిక ఆత్మహత్య

మార్కాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ ఘటనలో కొత్రపోలు కొండమ్మ అలియాస్ అరుణ (16) మృతి చెందింది. పట్టణ ఎస్సై ఎం.సైదుబాబు కథనం మేరకు మండలంలోని గొట్టిపడియ గ్రామానికి చెందిన కొత్రపోలు మరియదాసు అదే గ్రామానికి చెందిన సువర్ణను 20 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఏడేళ్ల క్రితం భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో విడిపోయారు. మరియదాసు స్వగ్రామంలో, సువర్ణ పట్టణంలోని నివాసముంటున్నారు. తండ్రి వద్ద కుమారుడు, తల్లి వద్ద ఇద్దరు కుమార్తెలు ఉంటున్నారు. కొన్నాళ్లుగా కొండమ్మ అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం సువర్ణ బయటికి వెళ్లింది. రాత్రి 8.00 గంటలకు ఇంటికి వచ్చి చూసేసరికి కొండమ్మ ఫ్యానుకు ఉరి వేసుకుని ఉంది. వెంటనే కొండమ్మను ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు చనిపోయినట్లు నిర్ధారించారు.

వంతెన నిర్మించి అప్రోచ్‌రోడ్డు వదిలేసి!

- గుండ్లకమ్మ నదిపై పూర్తయిన వంతెన
- ఐదేళ్ల పూర్తికాని అనుసందాన రహదారి
- తీవ్ర అవస్థలు పడుతున్న ప్రయాణికులు



గుండ్లకమ్మపై పూర్తయిన వంతెన

త్రిపురాంతకం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్లంపల్లి సమీపంలో గుండ్లకమ్మ నదిపై వంతెన నిర్మాణం పూర్తయ్యింది. అయితే ఆ వంతెనకు అనుసందానంగా అప్రోచ్ రోడ్డు (వంతెన నుంచి ప్రధాన రహదారికి) ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రజలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. 2007లో అప్పటి దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి చొరవతో వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. నిర్మాణంలో భాగంగా 12 పిల్లర్లకుగాను నాలుగు పిల్లర్లను నిర్మించిన గుత్తేదారు ఖర్చులు పెరిగిపోవడంతో చేతులెత్తేశారు. అప్పటి నుంచి సుమారు 9 ఏళ్లపాటు దీని పనులు కొనసాగక పోవడంతో టీడీపీ ప్రభుత్వ హయాంలో మంత్రి శిద్దా రాఘవరావు అదనపు నిదులు మంజూరు చేయించారు. 2016 ఆగస్టులో పనులను పునఃప్రారభించారు. అయితే 247 మీటర్ల బ్రిడ్జి నిర్మాణం, 400 మీటర్ల సీసీ రోడ్డు పూర్తయ్యాయి. 2019 మార్చి 9న వంతెనను ప్రారంభించారు. కానీ వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు మాత్రం నిర్మించలేదు. అప్రోచ్ రోడ్డు నిర్మించేందుకు రెండు వైపులా భూమి కోసం ప్రయత్నాలు చేసినా భూ యజమానుల నుండి అంగీకారం రాలేదు. దీంతో నిర్మాణం నిలిచింది. ఇక వంతెనకు సైడ్ వాల్స్ కూడా పూర్తి చేయలేదు. దీంతో ద్విచక్రవాహనాలు మాత్రమే వెళ్లేందుకు తాత్కాలిక ఏర్పాటు చేశారు. తప్పనిసరి పరిస్థితులలో ద్విచక్ర వాహనదారులు మాత్రం వంతెనపై అలానే ప్రయాణిస్తున్నారు. ట్రాక్టర్లు, కార్లు, లారీలు, ఆటోలు మాత్రం పాడుపడిపోయిన పాత చప్టాపై నుంచే వెళుతున్నాయి. నేలచప్టానే ఉండడంతో వర్షాకాలంలో సాగర్ కాలువకు నీరు విడుదలైనపుడు గుండ్లకమ్మ ఉధృతంగా ప్రవహించి చప్టాపై నుంచి నీరు పారుతుంది. దీనికితోడు పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాహనాలు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వంతెన పనులు మొత్తం పూర్తయితే ఎర్రగొండపాలెం, మార్కాపురం, దర్శి నియోజకవర్గాల్లోని అనేక గ్రామాల వారికి రాకపోకలకు ఇబ్బందులు తొలగుతాయి. త్రిపురాంతకం, ఎర్రగొండపాలెం మండలాల్లోనివారు కురిచేడు, దొనకొండ, దర్శి, ముండ్లమూరు, ఒంగోలు ప్రాంతాలకు వెళ్లేందుకు, ఒంగోలు, దర్శి, పొదిలి ప్రాంతాలవారు హైదరాబాద్ వెళ్ళేందుకు సుమారు 50 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. దీనికి తోడు చందవరం వద్ద ప్రముఖ బౌద్ధ క్షేత్రం, దొనకొండ వద్ద విమానాశ్రయం, పారిశ్రామిక కారిడార్‌లను ఏర్పాటు చేసే పరిస్థితి ఉన్నందున ఈ వంతెన నిర్మాణం ఎంతో ఉపయోగకరం. కూటమి ప్రభుత్వం ఈ వంతెనను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

అప్రోచ్ రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి

వంతెన వద్ద ఇరువైపులా అప్రోచ్ రోడ్డును త్వరగా పూర్తిచేయాలి. గుండ్లకమ్మ నదిపై నిర్మించిన వంతెన ద్వారా ఒంగోలు, దర్శి, కురిచేడు, దొనకొండ ప్రాంతాలకు త్వరగా వెళ్లవచ్చు. సంబంధిత రైతులతో మాట్లాడి సమస్యను పరిష్కరించి రోడ్డును ఏర్పాటు చేస్తే అందరికీ ఉపయోగం.



బి.వెంగళరెడ్డి, వెల్లంపల్లి



సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి



మండలస్థాయి నాయకులతో మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న సభ్యత్వ నమోదును పార్టీ శ్రేణులు విజయవంతం చేయాల ని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి పార్టీ కార్యాల యం వద్ద ఆరు మండలాల ముఖ్యనాయకులతో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నవంబరు 26వ తేదీన సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ సభ్యత్వం శ్రేణులకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. నూతన సభ్యత్వ విధానంలో సభ్యత్వం చేసుకున్న వారికి ప్రమాద బీమా రూ.5 లక్షలు, సహజ మరణానికి రూ.10వేలు వర్తిస్తుందన్నారు. నియోజకవర్గంలోని టీడీపీ కార్యకర్తలకు, అభిమానులకు, సానుభూతి పరులకు పార్టీ సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పించి గతంలో జరిగిన నమోదు కంటే అత్యధికంగా నమోదు చేపించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ, మండల పార్టీల నాయకులు పాల్గొన్నారు.

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి

కొమరోలు : టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని ఆ పార్టీ నాయకులు గోడి ఓబుల్‌రెడ్డి, యల్లారెడ్డిలు అన్నారు. మండలంలోని బాదినేనిపల్లి గ్రామంలో రూ.10 లక్షల నిధులతో సిమెంట్ రోడ్లకు భూమి పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్లతోపాటు గ్రామంలో మురగునీరు బయటకు పోవడానికి సైడు కాలువలకు ప్రతిపాదనలు పంపామన్నారు. బాదినేనిపల్లెలో ఆరోగ్య సబ్‌సెంటర్‌కు సొంత భవనం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సర్పంచ్ ముత్తుముల జయరామిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ వీరయ్య, ఈసీ కోటిరెడ్డి, కార్యదర్శి బండి.కారుణ్య, అహల్యారాణి, సచివాలయ సిబ్బంది, నాయకులు లక్ష్మీరంగారెడ్డి, పోలెబోయిన రమణ, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంభం (అర్ధవీడు) : రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతోందని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. సోమవారం అర్ధవీడు మండలంలో రూ.1.25 కోట్లతో అంతర్గత సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా టీడీపీ కూటమి ప్రభుత్వం పల్లెపండుగ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. అర్ధవీడు మండలంలో మొహిద్దీన్‌పురం, అర్ధవీడు, పాపినేనిపల్లెలో అంతర్గత సీసీరోడ్లకు శంకుస్థాపన చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ సుబ్బారెడ్డి, ఎంపీడీవో నరసయ్య, మాజీ ఎంపీపీ చేగిరెడ్డి కాశిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు బండ్లమూడి ఆంజనేయులు, బండి నారాయణరెడ్డి, సాగర్, దిబ్బయ్య, ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోన చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.



ఆంజనేయులుకు జాతీయసేవా పురస్కారం



ఆంజనేయులును సన్మానిస్తున్న నిర్వాహకులు

పొదిలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగ రక్షక ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవళ్ల ఆంజనేయులు సేవలను గుర్తించి సత్తెనపల్లి హెల్త్ ఫౌండేషన్ మదర్‌థెరిస్సా జాతీయసేవా పురస్కారం అవార్డును సోమవారం అందజేసింది. అనంతరం హెల్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ పుట్టుకతో దివ్యాంగుడైనా ఆంజనేయులు చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డును ప్రధానం చేశామన్నారు. అన్నీ ఉన్నా వారు కూడా ఎవరి స్వార్ధ వారు చూసుకునే ఈ రోజుల్లో శరీరం సహకరించకపోయినా తోటి దివ్యాంగులకే కాకుండా పేదలకు, వృద్ధులకు ఎన్నో విశిష్ట సేవలు అందిస్తున్నారన్నారు. అందుకుగాను ఈ పురస్కారం అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఆంజనేయులును ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు ఏదో ఒక విధంగా సహాయం చేయలని వారు కోరారు. అనంతరం ఆంజనేయులును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఫౌండర్ నరసింహారావు, కార్యదర్శి బ్రహ్మారెడ్డి, రాధ, శ్రీను, రమణయ్య ఆచారి పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో రాక్‌వెల్ విద్యార్థుల ప్రతిభ

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రాక్‌వెల్ స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలలో సత్తాచాటారు. ఈ సందర్భంగా రాక్‌వెల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్లు వెన్నా నాగార్జునరెడ్డి, తూరా సింధూజలు సోమవారం విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా తమ పాఠశాల విద్యార్థులు 3 బంగారు, 8 వెండి, 15 కాంస్య పతకాలు గెలుచుకున్నారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్, స్కేటింగ్ కోచ్ మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనాలి

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు వివిధ పోటీ పరీక్షల్లో పాల్గొనాలని శ్రీసాయి చైతన్య హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్ అన్నారు. స్థానిక పాఠశాలలో ఇటీవల అవోపా ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలు కేవీ.భవ్య, జీవీ తులసీలను సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి నుంచే వివిధ అంశాలపై నైపుణ్యాలు కలిగి ఉండాలన్నారు. సంస్కృతి సాంప్రదాయాలు, ఆటపాటలు, చదువు విద్యార్థి దశలో ఎంతో ముఖ్యం అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యుత్ చౌర్యంపై అధికారుల దాడులు

త్రిపురాంతకం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలలో అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తూ చౌర్యానికి పాల్పడుతున్న వినియోగదారులపై ఆ శాఖ అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. మార్కాపురం ఈఈ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో డీపీ డీఈఈ శ్రీనివాసరావు పలు బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు చేశారు. అక్రమ కనెక్షన్ల ద్వారా విద్యుత్‌ను వినియోగిస్తున్న వారిపై 44 కేసులు నమోదు చేశారు. రూ.67,850 అపరాధ రుసుంను విధించారు. ఈదాడులలో గిద్దలూరు డీఈఈ శేషగిరిరావు, కంభం డీఈఈ శ్రీనివాసరెడ్డి, మార్కాపురం డీఈఈ సియానాయక్, ఏఈఈలు, ఎల్‌ఐలు, ఎల్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ

త్రిపురాంతకం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తఅన్నసముద్రం, నడిపాలెం, మేడపి, టి.చెర్లోపల్లి, డీవీఎన్ కాలనీ, ఉమ్మడివరం, కంకణాలపల్లి, ముడివేముల, ఒడ్డుపాలెం గ్రామాలలో నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి సోమవారం భూమి పూజ కార్యక్రమాలు చేశారు. అభివృద్ధి సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమాలలో ఈవోపీఆర్‌డీ రామసుబ్బయ్య, పీఆర్ ఏఈఈ సుబ్బయ్య, ఏపీవో సుజాత, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



పేద రజక విద్యార్థుల అభివృద్ధికి కృషి

మార్కాపురం రూరల్ అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి). ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని పేద రజక విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలుగు రాష్ట్రాల రజక సేవా సంఘం అధ్యక్షుడు దేవలూటి శంకర్ తెలిపారు. ఏపీ, తెలంగాణలలో ఉన్నత విద్య అవకాశాలు కల్పించి అభివృద్ధి చెందే దిశగా వారికి ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నామన్నారు. కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలలో పదవతరగతిలో ప్రతిభ ఆధారంగా మంచి మార్కులు సాధిస్తున్న రజక విద్యార్థులకు తోడ్పాటునిస్తున్నట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో పేద రజలకు తాము తోడ్పాటు అందిస్తామన్నారు.

ఏకగ్రీవంగా ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

పెద్ద దోర్నాల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దోర్నాలలోని శివసదన్‌లో నూతనంగా మాదిగ చర్మ డప్పు కళాకారుల పరిరక్షణ సమితి సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇండియా వైస్ ప్రెసిడెంట్ ఎన్ నాగయ్య అధ్యక్షతన మండల అధ్యక్షుడు పందిటి కిశోర్‌బాబు, వర్కింగ్ టీం అధ్యక్షులు బందూరి శ్యామును ఎన్నుకున్నట్లు సమితి సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు 2016-17లో లీడ్ క్యాప్ చైర్మన్‌గా ఉన్నప్పుడు డప్పు కళాకారుల సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లారన్నారు. వారికి పింఛన్లు మంజూరు చేయించారని గుర్తు చేశారు. వారి మేలు మరువలేనిదన్నారు. కార్యక్రమంలో సభ్యులు బరిగెల ప్రసాద్, రాజారత్నం, ఆశీర్వాదం, కె శ్రీను, అశోక్‌కుమార్, జిన్ను పాల్గొన్నారు.

మౌలాలికి కలాం ట్రస్ట్ అవార్డు

తర్లుపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలుజువ్వలపాడు పంచాయతీలోని లింగారెడ్డి కాలనీ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు ఎస్‌కే మౌలాలి కలాం ట్రస్ట్ అవార్డును అందుకున్నారు. విప్రో బెంగళూరు సంస్థ కేవీ లక్ష్మణ్ కుమార్, భవానీ కుమార్ చేతుల మీదుగా మౌలాలి అవార్డు అందుకున్నారు. ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సైన్సుపట్ల అవగాహన కల్పించి వివిధ రకాల ప్రయోగాలు చేయించడం ద్వారా అవార్డుకు ఎంపిక చేసినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ సందర్భంగా మౌలాలిని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

విద్యార్థిని మృతికి నివాళి

గిద్దలూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లాలో ఇంటర్ చదువుతున్న విద్యార్థినిని ప్రేమపేరుతో నమ్మించి నిర్మానుష ప్రాంతంలో నిప్పు అంటించి చంపిన నిందితులను కఠినంగా శిక్షించాలని పలువురు డిమాండ్ చేశారు. స్థానిక సాయిచైతన్య డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం జరిగిన ఒక కార్యక్రమంలో బాధిత విద్యార్థిని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రంగస్వామిరెడ్డి, వివిధ స్వచ్ఛంద సేవాసంస్థల అధ్యక్షులు చల్లా అశోక్‌రెడ్డి, మాగులూరి శ్రీకాంత్, లొక్కు శరత్, తదితరులు పాల్గొన్నారు.





పంటలకు రోడ్లకు నష్టం

- ఉరకెత్తుతున్న పైర్లు
- అల్లాడుతున్న రైతులు
- రోడ్లు మరింత ఛిద్రం
- వెంటాడుతున్న గత పాలకుల నిర్లక్ష్యం

దర్శి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : దర్శి ప్రాంతంలో విడవకుండా కురుస్తున్న వర్షంతో అటు పంటలు, ఇటు రోడ్లు దెబ్బతింటున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పైర్లు ఉరకలెత్తి దెబ్బతింటుండటంతో అన్నదాతలు ఏం చేయాలో పాలుపోక అల్లాడుతున్నారు. మండలంలోని మారెడ్డిపల్లి, బసిరెడ్డిపల్లి, చందలూరు తదితర గ్రామాల్లో సాగుచేసిన మిర్చి పొలాల్లోకి వర్షపు నీరు భారీగా చేరింది. ఏపుగా పెరుగుతున్న మిర్చిపైరు ఉరకలెత్తుతోంది. సజ్జ పంట పండి కోతలు కోసి కల్లాలు చేసే సమయంలో వరుసగా వారం రోజుల పాటు వర్షం కురవటంతో అనేకచోట్ల ఓదెలు తడిసిపోయాయి. సజ్జలు రంగు మారే ప్రమాదం ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వైట్ బర్లీ పొగాకు కూడా ఉరకెత్తుతోంది. పూత దశలో ఉన్న కంది పైరు కూడా దెబ్బ తింటోంది. ఇంతటితో వర్షం ఆగిపోతే కొద్దిపాటి నష్టంతో రైతులు బయటపడే అవకాశం ఉంది. ఇంకా వర్షాలు కురిస్తే సాగుచేసిన అన్నీ పంటలు పూర్తిగా దెబ్బతింటాయని వారు ఆందోళన చెందుతున్నారు.

దొనకొండలో...

దొనకొండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : మండలంలో సాగు చేసిన పొగాకు పంటలో నీరు నిలిచి ఉరకెత్తి ఆకు ఎర్రగా వాడిపోతోందని, పత్తి కాయలు నల్లగా మారి గుడ్డికాయలుగా మారుతున్నాయని, మిరప చేనులో నీరు నిలవటంతో తేమశాతం ఎక్కువై మొక్కలు కుళ్లిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. విడవని వర్షాలకు గ్రామాల్లో మట్టిరోడ్లు బురదమయమై ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



దొనకొండలో వర్షపు నీటిలో మునిగిన పొగాకు పంట

అధ్వానంగా కురిచేడు-పేరుంబొట్లపాలెం రోడ్డు

కురిచేడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కురిచేడు-పేరుంబొట్లపాలెం రోడ్డు గుంతలమయమై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కాటంవారిపల్లె, పేరుంబొట్లపాలెం గ్రామాల ప్రజలు ప్రజాప్రతినిధులను పలుమార్లు రోడ్డు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. నాలుగేళ్ల క్రితం రోడ్డు నిర్మాణానికి రూ.2.5 కోట్లు నిధులు మంజూరైనా పనులు పూర్తి కాలేదు. సోమవారం కురిసిన భారీ వర్షానికి రోడ్డంతా ఛిద్రంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కాటంవారిపల్లె, పేరుంబొట్లపాలెం గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గంటపాటు భారీ వర్షం

కురిచేడులో సోమవారం భారీవర్షం కురిసింది. గంటపాటు ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. కాల్వలు నిండి మురుగు నీరు రోడ్డు మీదకు వచ్చింది. పొలాల్లో నీరు నిలిచింది. మెట్ట పంటలు ఇప్పటికే దెబ్బతినగా తాజా వర్షంతో రైతులకు మరింత నష్టం వాటిల్లింది. వేలాది ఎకరాలలో వేసిన పొగాకు పంట నేల వాలడమే కాక ఆకుపై ఉన్న జిడ్డు కారిపోయిందని రైతులు వాపోతున్నారు. ఆకులు సైతం ఎర్ర రంగులోకి మారాయి. మిర్చి పంట మొక్కలు సైతం నేలవాలాయి. పత్తికాయలు నల్లగా మారాయి. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



కమ్మవారిపల్లిలో మురుగునీటిలోనే బైక్‌పై వస్తున్న వృద్ధుడు

కంపుకొడుతున్న కమ్మవారిపల్లి

పీసీపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కమ్మవారిపల్లి గ్రామంలో రోడ్లు రొచ్చురొచ్చుగా మారాయి. గతంలో సీసీ రోడ్డు నిర్మించినప్పటికీ డ్రైనేజీ నిర్మించలేదు. కొద్దిపాటి వర్షం కురిసినా గ్రామం మధ్యలో సీసీ రోడ్డుపైనే నీరు నిలిచి బురదగా మారుతోంది. నిలిచిన నీరు ఎటూ వెళ్లలేని పరిస్థితుల్లో మురుగునీటి కుంటగా మారింది. ఈ మురుగునీటి కుంటలో వాహనాలు రాకపోకల సమయంలో దుర్వాసన వస్తోంది.

కాలువలో పూడిక పనులు చేపట్టాలి

పామూరు, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి) : పామూరులో వాగులు, వంకలు పూడి పోవడంతో ఇటీవల కురిసిన వర్షానికి నీరు వెళ్లే మార్గం లేక రోడ్లపై నిలుస్తున్నాయి. పశువైద్యశాల ఎదురు ఉన్న లైన్‌లో సరైన రోడ్డు, మురుగు కాలువ సౌకర్యం లేదు. దీంతో వర్షం నీరు రోడ్డుపై నిల్వ చేరింది. రోడ్డు సమీపంలో ఉన్న పంట కాలువలో పూడిక చేరటంతో వర్షం నీరు వెళ్లడం లేదు. దీంతో దోమల ఉధృతి పెరిగింది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు పంట కాలువల్లో పూడికతీత పనులు తీయించాలని, మురుగు కాలువలు నిర్మించాలని ఏసురత్నం, మస్తానయ్య కోరారు.









కనిగిరిలో కాలువలను తలపించిన రోడ్లు

కనిగిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి పట్టణంలో సోమవారం కురిసిన వర్షానికి రోడ్లన్నీ ఛిద్రంగా మారి పంట కాలువలను తలపించాయి. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. రామాలయం వీధి, ఓవీ రోడ్డులోని డ్రైనేజీలు పూడిపోవటంతో వర్షం నీరుతోపాటు మురుగుకూడా రోడ్లపైకి చేరింది. ఒంగోలు బస్టాండు, పామూరు బస్టాండు సెంటర్లలో రోడ్లపై నీరు కాలువలా ప్రవహించి పామూరు హైవే రోడ్డుపై పెట్రోలు బంక్‌ల వద్దకు చేరుకున్నాయి. అక్కడ పెద్ద నీటి గుంతగా మారింది. ఆ పక్కనే ఉన్న వాగు కబ్జాకు గురికావటంతో వాగులోని మురుగు నీరు కూడా రోడ్డుపైకి చేరింది. అదేవిధంగా కందుకూరు రోడ్డు నుంచి పాత శంఖవరం గ్రామానికి వెళ్లే రహదారి గుంతలు పడి అధ్వానంగా తయారైంది. గ్రానైట్ క్వారీ వాహనాలు ఆ రోడ్డులో రావటంతో రోడ్డంతా పెద్దపెద్ద గుంతలు పడ్డాయి. గత వైసీపీ పాలనలో రోడ్ల బాగోగులు పట్టించుకోకపోవడంతో ఇప్పుడు మరింత దరిద్రంగా తయారయ్యాయి.



కనిగిరి పట్టణంలో పామూరు హైవేపై నిలిచిన మోకాలు లోతు నీరు

మెరుగైన సేవలతోనే ప్రజామన్ననలు

అధికారులకు ఎమ్మెల్యే ఉగ్ర హితవు

ప్రజాదర్బార్‌లో భూ సమస్యలపై వెల్లువెత్తిన ఫిర్యాదులు



ప్రజాదర్బార్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

కనిగిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అధికారులు మెరుగైన సేవలు అందించి మన్ననలను పొందాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయం సమావేశపు హాలులో సోమవారం ఎమ్మెల్యే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు వివిధ సమస్యలపై ఎమ్మెల్యేకు ఫిర్యాదులతో కూడిన వినతులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కనిగిరి అభివృద్ధిలో ముందుండాలనే తలంపుతో తాను కృషి చేస్తున్నామన్నారు. సమస్యలపై వచ్చే వారిని కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని హితవు పలికారు. అధికారుల దృష్టికి తీసుకువచ్చిన సమస్యను వీలైనంతవరకు పరిష్కారమార్గం చూపాలన్నారు. సమస్య పరిష్కారం కాకుంటే రాతపూర్వకంగా ఇవ్వాలని సూచించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఆర్టీసీ డిపో డౌన్‌లో ఉన్న వైన్‌షాపులను తొలగించాలని కోరుతూ మహిళలు వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ విశ్వనాథరెడ్డి, ఎంపీడీవో హనుమంతరావు, మున్సిపల్ కమిషనర్ దానియేలు, పీఆర్ డీఈ శ్రీధర్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ ప్రకాశం, ఎంఈవో నారాయణరెడ్డి పాల్గొన్నారు. ప్రజాదర్బార్‌లో భూసమస్యలపై వినతులు వెల్లువెత్తాయి. మొత్తం 207 అర్జీలు రాగా, వాటిల్లో 108కు పైగా భూ సమస్యలపై వచ్చినట్లు అధికారులు చెప్పారు.

హనుమంతునిపాడులో... హనుమంతునిపాడులో కూడా ఎమ్మెల్యే ఉగ్ర ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 170 వరకు వివిధ సమస్యలపై వినతిపత్రాలు అందించారు.

మహిళల అభ్యున్నతే లక్ష్యం

దర్శి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : మహిళల అభ్యున్నతే టీడీపీ కూటమి ప్రభుత్వ ధ్యేయమని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని పేర్కొన్నారు.ఇచ్చిన హామీల అమలులో భాగంగా దీపావళి నుంచి ఉచిత గ్యాస్ పథకాన్ని అమలు చేయటం ఆనందదాయకమని తెలిపారు. మహాశక్తి పథకం కింద ప్రతి కుటుంబానికి మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తూ సీఎం చంద్రబాబు, మహిళ పక్షపాతిగా ప్రజల హృదయాల్లో నిలచిపోతారని తెలిపారు.

తాళ్లూరులో కూలిన ఇళ్లు

తాళ్లూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరులోని పడమటి బజార్‌లోని మారం నాగేశ్వరమ్మకు చెందిన పెంకుటిల్లు ఆదివారంరాత్రి కూలిపోయింది. ఎడతెరపి లేకుండా కుస్తున్న వర్షాలకు పూర్తిగా నాని ఇంటి మధ్యభాగం నుంచి ఒకవైపు పూర్తిగా కూలిపోయి, మిగిలిన భాగం కూడా దెబ్బతింది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని నాగేశ్వరమ్మ కోరుతున్నారు.

భైరవకోనలో వీసీ ప్రత్యేక పూజలు

సీఎస్‌పురం అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : మండలంలోని భైరవకోన పుణ్యక్షేత్రాన్ని సోమవారం ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డీవీఆర్ మూర్తి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. దుర్గాంబ అమ్మవారు, కాలభైరవస్వామికి పూజలు నిర్వహించారు. ఈయన వెంట బెల్లంకొండ విద్యా సంస్థల కరస్పాండెంట్ మద్దుల శ్రీనివాసులు, ఎస్వీజేసీ డైరెక్టర్ వీ కృష్ణంరాజు, రత్నండిగ్రీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ, ఎన్ వెంకటేష్ ఉన్నారు.

వారి త్యాగాలు మరువలేనివి



దర్శిలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

దర్శి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ చెప్పారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా సోమవారం దర్శి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక గడియారస్తంభం సెంటర్‌లో మానవహారం నిర్మించారు. తహసీల్దార్ ఎం శ్రావణ్‌కుమార్, సీఐలు వై రామారావు, హస్సాన్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

దొనకొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక గౌతమీ డిగ్రీ కాలేజీ అడ్మిన్ ఎఫ్రాయిమ్(నాని) ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలు శ్రావణి, సరస్వతి, నితస్‌లకు ప్రిన్సిపల్ రామయోగి, అడ్మిన్ నానిలు బహుమతులు అందజేశారు.

పామూరులో...

పామూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : పామూరు పోలీస్‌స్టేషన్ వద్ద నుంచి కూటమి నాయకులు, విద్యార్థులతో కలిసి పోలీసులు ర్యాలీ నిర్వహించారు. మమ్మీ డాడి సెంటర్‌లో మానవహారం నిర్మించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు యారవ శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యులు బొల్లా నరసింహారావు, ఆకుపాటి వెంకటేష్, ఉప్పలపాటి హరిబాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు హుసేన్‌రావు, బీ సత్యం, కేవీ రమణయ్య, వై రహీముల్లా, దరిశి ఏడుకొండలు, ఎస్ఐ కిశోర్‌బాబు, ఊఎస్ఐ ముల్లాహుసేన్ పాల్గొన్నారు.

నట్టల నివారణ మందులు పంపిణీ

తాళ్లూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీవాలకు నట్టల నివారణ మందులు తాగించి రోగ నిరోధక శక్తిని పెంపొందించాలని డాక్టర్ ప్రతాప్‌రెడ్డి చెప్పారు. తాళ్లూరులో సోమవారం గొర్రెలకు, మేకలకు నట్ట నివారణ మందులు తాగించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పామూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : పామూరులో పలు చోట్ల చేపట్టబోయే సిమెంటు రోడ్డు పనులను పంచాయతి రాజ్ అధికారులు సోమవారం ప్రారంభించారు. విరాట్‌నగర్ కాలనీ, విరువూరు రోడ్డు, ఎన్జీవో కాలనీ ఏరియాల్లో డోజర్‌తో రోడ్డు చదును పనులు చేపట్టారు. రూ.5 కోట్లతో 23 సీసీ రోడ్డు పనులు నిర్మించేందుకు ఎమ్మెల్యే ఉగ్ర పనులు మంజూరు చేయించారని పంచాయతీ రాజ్ ఏఈ షేక్ మస్తాన్‌వలి తెలిపారు. మాజీ సర్పంచ్ డీవీ మనోహర్, టీడీపీ నాయకులు సయ్యద్ అమీర్‌బాబు, ఎన్ నాగేంద్రచారి, పత్తు మస్తాన్ పాల్గొన్నారు.

పట్టా భూమిని ఆన్‌లైన్ చేయాలి

తాళ్లూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మంజూరు చేసిన డీకే పట్టా భూమికి పాస్‌బుక్, అన్ని రికార్డులున్నా ఆన్‌లైన్ చేయాలని ఏడాది నుంచి తిరుగుతున్నానని తాళ్లూరు గ్రామానికి చెందిన చందోలు రామారావు సోమవారం మీకోసం కార్యక్రమంలో అర్జీ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.సుందరరామయ్య, ఎంఈవో జి.సుబ్బయ్య, డీటీ ఇమ్మానియేల్‌రాజు, వ్యవసాయాధికారి ప్రసాదరావు పాల్గొన్నారు.



వేగవంతంగా హత్య కేసు విచారణ

సీఎస్‌పురం అక్టోబరు, 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని డీజీపేటలో పశువుల మేత కోసం వెళ్లి హత్యకు గురైన డేగా రత్తమ్మ(58) కేసు విచారణను పోలీసులు వేగవంతం చేశారు. సీఐ భీమానాయక్ ఆధ్వర్యంలో డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీం బృందం సోమవారం హత్యాప్రాంతానికి వెళ్లాయి. వర్షం వల్ల డాగ్ స్క్వాడ్‌కు ఎటువంటి ఆనవాళ్లు లభించలేదు. రత్తమ్మ తలపై బలమైన ఆయుధంతో మోదిన ఆనవాళ్లను గుర్తించారు. హత్యచేసిన తీరును చూస్తే బయట ప్రాంతానికి చెందిన వ్యక్తుల ప్రమేయం ఉండవచ్చునని అనుమానిస్తున్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

పామూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : వరి, కంది, శనగ, మినుము పొగాకు పంటలలో మేలైన మాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక ఉత్పత్తి సాధించవచ్చునని డీఆర్‌సీ వ్యవసాయ అధికారిణి శేషమ్మ సూచించారు. పామూరు మండలంలోని దూబగుంట, సీఎస్‌పురం మండలం రేగులచిలక గ్రామాల్లో కంది, శనగ పైర్లను సోమవారం పరిశీలించారు. అనంతరం రైతులకు శిక్షణ ఇచ్చారు.

ముండ్లమూరు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా శ్రీకాంత్

ముండ్లమూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ముండ్లమూరు మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా శ్రీకాంత్ నియమితులయ్యారు. రెగ్యులర్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎల్ లక్ష్మీనారాయణ 20 రోజుల పాటు వ్యక్తి గత సెలవుపై వెళ్లారు. డీటీ శ్రీకాంత్‌ను నియమించడంతో ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు.







నరసరావుపేటలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో విరిగిపోయిన కిటికీ తలుపులు



అద్దంకి పట్టణంలోని రాంనగర్ ఎస్సీ బాలుర వసతి గృహం బాత్‌రూం డోర్లకు లేని తలుపులు



మాచర్ల: దుర్గి బీసీ హాస్టల్‌లో చాలీచాలని దుప్పట్లతో సరిపెట్టుకుంటున్న విద్యార్థులు

హాస్టల్లో.. అన్నీ కష్టాలే

తల్లిదండ్రులు, బంధువులు, అయినవారందరికీ దూరంగా ఉంటూ నాలుగక్షరాలు నేర్చుకుందామని సంక్షేమ వసతి గృహాలకు వచ్చిన చిన్నారుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. సంక్షేమ వసతి గృహాల్లో కనీస వసతులు లేక వారు పడుతున్న అగచాట్లకు అంతే లేదు. నాలుగు ముక్కలు నేర్చుకుని ప్రయోజకులవుదామనుకున్న వారికి ఆ భాగ్యం ఎంతవరకూ దుక్కుతుందో ఏమో తెలియదుగానీ, వారు హాస్టళ్లలో నిత్యం పోరాడుతూనే ఉండాల్సి వస్తోంది. వసతి గృహాలకు బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి. వసతి గృహాల నిర్వహకులు అందినకాడికి అప్పులు చేసి విద్యార్థుల ఆకలి తీరుస్తున్న దుస్థితి. ఇది ఒక్క సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లోనే నెలకొంది. బీసీ సంక్షేమ వసతి గృహాలకు మాత్రం ఇటీవల బిల్లుల బకాయిలు చెల్లింపులు జరిగాయి. ఎస్సీ వసతి గృహాలకు ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. వసతి గృహాలకు నిధులు విడుదల చేయకుండానే ఖచ్చితంగా మెనూ అమలు చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలు ఇస్తుండటం గమనార్హం. వసతి గృహాల నిర్వాహక అధికారులు తమ బంగారం కుదువ పెట్టి కూడా అప్పులు తెస్తున్న పరిస్థితి.. ఇదిలా ఉంటే ఫ్యానులు తిరగక, దోమతెరలు లేక పిల్లలు ప్రతి రోజూ దోమలతో యుద్ధం చేయాల్సి వస్తోంది. శీతాకాలం చలితో పోరాటం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఎప్పుడో విద్యా సంవత్సరం ఆరంభంలో ఇవ్వాల్సిన దుప్పట్లు వారికి ఈరోజు వరకూ అందలేదు. ఇలా అష్టకష్టాలతో విద్యార్థుల హాస్టళ్ల జీవితాలు ఉమ్మడి జిల్లాలో నెలకొన్నాయి.

- భోజన బకాయిలు.. 7 నెలలు
- కాస్మోటిక్ ఛార్జీలకూ దిక్కులేదు
- నోట్ బుక్స్.. సామాగ్రి పంపిణీ లేదాయె
- నాలుగు నెలలైనా అందని దుప్పట్లు
- ఫ్యానులు తిరగక, దోమ తెరలు లేక అగచాట్లు
- చలికాలం వచ్చేస్తున్నా ఇదిగో.. అదిగో అంటున్న అధికారులు
- కనీస వసతులు లేక ఇబ్బందులు
- వెంటాడుతున్న మరుగుదొడ్ల సమస్య

ఆంధ్రజ్యోతి విజిట్

-ఆంధ్రజ్యోతి, (బాపట్ల బృందం)

ప్రభుత్వ వసతిగృహాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో గత విద్యా సంవత్సరం జనవరి నుంచి బిల్లులు చెల్లించలేదు. ఆ ప్రభుత్వం వసతిగృహాల నిర్వహణను పూర్తిగా గాలికివదిలేసింది. జనవరి, ఫిబ్రవరి బిల్లులు రెండు రోజుల క్రితం ప్రభుత్వం విడుదల చేసింది. ఈ విద్యా సంవత్సరం లో కూడా నేటివరకు ఒక్క రూపాయి కూడా వసతి గృహాలకు నిధులు విడుదల చేయలేదు. ఏడు నెలలు గా వసతిగృహాల బిల్లులు విడుదల కాలేదు. రూ.కోట్ల ల్లో బకాయిలు పేరుకుపోయాయి. కాస్మోటిక్ ఛార్జీలు పైకం విద్యార్థులకు అందలేదు. చివరకు నోటు పుస్తకా లు, దుప్పట్లు, ప్లేట్లు, ట్రంకు పెట్టె తదితర సామగ్రి ఈ విద్యా సంవత్సరంలో ఒక్కరికి కూడా పంపిణీ చేయలేదు. బిల్లుల బకాయిలు పేరుకుపోవడంతో నిర్వాహక అధికారులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. విద్యా ర్థుల కడుపు మాడ్చలేక.. అప్పులు తీర్చలేక.. బిల్లులు రాక దిక్కుతోచని స్థితిలో హెచ్‌డబ్ల్యూవోలు కొట్టుమి ట్టాడుతున్నారు. ఈ నేపథ్యంలో నిర్దేశించిన భోజన పట్టికను అమలుచేయలేక నిర్వహణ అధికారులు చేతులెత్తేస్తున్నారు. భోజన బిల్లులు విడుదల చేయకపోవడంతో నిర్వాహకులు విద్యార్థుల ఆకలిని తీర్చలేకపోతున్నారు. కాస్మోటిక్ చార్జీలు 9 నెలలుగా చెల్లించలేదు.

కాస్మోటిక్ చార్జీలకూ దిక్కులేదు

ప్రభుత్వం మాత్రం నెల వారీ కాస్మోటిక్ ఛార్జీల నగదు ఇవ్వడం లేదు. దీంతో తలకు నూనె కొనాలన్నా, స్నానానికి సబ్బు కావాలన్నా ఇంటివైపు చూడక తప్పడంలేదు. విధిలేక ప్రతి నెలా తమ తల్లిదండ్రులను ఖర్చులకు డబ్బులు పంపమని అడగడం పరి పాటిగా మారింది. వసతిగృహాలల్లోని విద్యార్థులకు ప్రతినెలా కాస్మోటిక్ ఛార్జీల కింద 3 నుంచి 6వ తరగతి బాలికలకు రూ.110, బాలురకు రూ.100 అందజేయాల్సి ఉంది. 7నుంచి 10వ తరగతి వరకు బాలికలకు రూ.160, బాలురకు రూ.125 చొప్పున తలనూనె, సబ్బులు ఇతర సామాగ్రి కొనుగోలుకు ఇ స్తుంటుంది. బాలురకు రూ.30చొప్పున హెయిర్ కటింగ్ ఛార్జీల కింద అదనంగా విడుదలచేస్తుంది. ఈ సొ మ్ము ను ప్రభుత్వం చెల్లించకపోతుండటంతో విద్యార్థులు ఇంటికెళ్లి తమ అవసరాల నిమిత్తం డబ్బు తెచ్చు కుంటున్నారు. ఇది తల్లిదండ్రులకు భారంగా మారుతోంది.

కనీసం దుప్పట్లు పంపిణీ లేదాయె..

విద్యా సంవత్సరం ప్రారంభంలో వసతి గృహాల్లో చేరే విద్యార్థులకు కొంత సామాగ్రిని ప్రభుత్వం పంపిణీ చేస్తుంది. వసతి గృహాలు తెరిచి రెండు నెలలు గడిచినా నేటి వరకు విద్యార్థులకు ఎటువంటి సామాగ్రి అందజేయలేదని నిర్వహకులు తెలిపారు. ప్రతి విద్యార్థికి నోట్ పుస్తకాలు, దుప్పట్లు, ప్లేట్, గ్లాసు, ట్రంగ్ పెట్టె తదితర సామాగ్రిని పంపిణీ చేయాలి. ఇవేవి నేటి వరకు విద్యార్థులకు అందజేయలేదు. వీటిని కూడా పంపిణీ చేయలేదంటే వసతి గృహాల నిర్వహణపై పాలకుల చిత్త శుద్ధిని తెలియజేస్తోంది.

కనీస వసతులకు నిధులు లేవాయే

వసతి గృహాల నిర్వహణకు నిధులు విడుదల కావడంలేదు. కొన్ని నెలలుగా ఇదే పరిస్థితులను ఎదుర్కోంటున్నట్లు సంబంధితులు వాపోతున్నారు. చివరకు బల్బు మాడిపోయినా దానిని మార్చాలన్నా వారి జేబులో నుంచి ఖర్చు చేయాల్సిందే. మరుగుదోడ్ల నిర్వహణ, తాగునీటి, అవసరమైన మరమ్మతులకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడంలేదు. కనీస వసతులకు హెచ్‌డబ్ల్యూవోలు సొంతంగా ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొందన్న విమర్శలున్నాయి. వైసీపీ పాలనలో వసతి గృహాలపై నిర్లక్ష్యపు గ్రహణం పట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వసతి గృహాలకు మహార్దశ పడుతుందని అయా వర్గాల తల్లి దండ్రులు ఆశించారు. అయితే కూటమి ప్రభుత్వంలో కూడా వసతి గృహాల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో తల్లి దండ్రుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

బాపట్ల జిల్లాలో హాస్టల్స్ గమనించినట్లయితే స్నానాల గదులకు తలుపులు లేవు, కిటికీలకు రెక్కలు లేకపోవడంతో దుప్పట్లు అడ్డంగా కట్టిన వైనం, ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోక పెచ్చు లూడుతున్న హాస్టల్ భవనాలు, సెప్టిక్ ట్యాంకుల పరిస్థితి అధ్వానం, ఒకే దోమతెరలో ముగ్గురు విద్యార్థులు తలదాచుకోవాల్సి రావడం, వసతి గృహాలు ఎదురుగానే మురికికూపాలుగా మారిన చెరువులు, హాస్టల్స్‌లో లైట్లు సరిగా లేకపోవడంతో సెల్ ఫోన్ టార్చ్ ఆధారంగా వంట చేయాల్సిన దుస్థితి

- జిల్లాలో మొత్తం 64 వసతి గృహాలు ఉండగా ఇందులో ఎస్సీ వెల్ఫేర్ విభాగం కింద 27 ఉన్నాయి. వీటిలో ప్రీమెట్రిక్ 15, పోస్ట్ మెట్రిక్ 12గా ఉండగా 1400 మంది విద్యార్థులు ఉంటున్నారు. బీసీ వెల్ఫేర్ కింద 27 హాస్టల్స్ ఉండగా ఇందులో ప్రీమెట్రిక్ 19, పోస్ట్ మెట్రిక్ 8 గా ఉన్నాయి. వీటిలో 1000 మంది వరకు విద్యార్థులు వసతి పొందుతు న్నారు. ఇక ట్రైబల్ వెల్‌ఫేర్ కింద మొత్తం 10 వసతి గృహాలు ఉండగా ఇందులో ప్రీమెట్రిక్ 2, పోస్ట్ మెట్రిక్ 2, గురుకులాలు 6 ఉన్నాయి. వీటిలో 1300 మంది విద్యార్థుల వరకు ఉంటున్నారు

పరిశీలనలో వెల్లడైన ఇక్కట్లు....

బాపట్ల పరిధిలోని సంజయ్ గాంధీ కాలనీలో ఉన్న ఎస్టీ హాస్టల్లో ఉంటున్న విద్యార్థులకు దోమతెరలు కూడా సరిపడా అందించకపోవడంతో ఒకే దానిలో ముగ్గురు విద్యార్థులు తలదాచుకోవాల్సిన పరిస్థితి ఉంది. వంటగదిలో లైట్లు లేకపోవడంతో సెల్‌ఫోన్ టార్చ్ సాయంతో వంట చేయడంతో పాటు వసతి గృహం ఎదురుగానే దుర్గంధం వెదజల్లే చెరువు ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చీరాల పట్టణ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ హాస్టల్స్ నిర్వహణ అధ్వానంగా మారింది. ఎస్సీ బాలికల హాస్టల్స్ మరుగుదొడ్లకు డోర్లు కూడా లేని పరిస్థితి ఉంది. అద్దంకి రాంనగర్‌లోని ఎస్సీ హాస్టల్‌లో మరుగుదొడ్లు పనిచేయకపోయినా పట్టించుకునే వారులేరు. సింగరకొండ రోడ్డులోని హాస్టల్ గదులకు తలుపులతో పాటు కిటికీలు లేని పరిస్థితి. బాపట్ల మండల పరిధిలోని స్టూవర్ట్‌పురం గ్రామంలో ఉన్న ఎస్టీ గురుకుల వసతి గృహంలో అరకొరగానే దుప్పట్లు పంపిణీ చేశారని విద్యార్థులు చెబుతున్నారు. భవనం శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందనని బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారు.

- రేపల్లె పట్టణంలోని జూనియర్ కళాశాల వెనుకబాగంలో ఉన్న ఎస్సీ కళాశాల విద్యార్థుల వసతి గృహంలో ఐదు సంవత్సరాలుగా ప్రతినెల మెయింటినెన్స్ క్రింద ఇచ్చే నిధులు వచ్చిన దాఖలాలు లేవు. మొత్తం 160ట్యూబ్‌లైట్లు, 80సీలింగ్ ఫ్యాన్లు ఉన్నాయి. వాటిల్లో సగంపైనే పనిచేయని దుస్థితి. వసతి గృహంలో 90మంది విద్యార్థులు ఉంటున్నారు. ఐదు సంవత్సరాలుగా విద్యార్థులకు దుప్పట్లు ఇచ్చిన దాఖలాలు లేవు. ఇంటి దగ్గర నుంచి తెచ్చుకున్న దుప్పట్లతో కొంతమంది చలికి వణుకుతూ దుప్పట్లు లేకుండానే నిద్రిస్తున్నారు. ఈవసతి గృహానికి రూ.8లక్షల64వేల524రూపాయలు కరెంటు బిల్లు పెండింగ్‌లో ఉంది.ఎస్సీ బాలుర వసతి గృహంలో రూ.2.30లక్షలు విద్యుత్ బకాయిలు పెండింగ్ ఉంది. పాతభవనం కావటంతో శ్లాబ్‌లు పెచ్చులూడిపోయి ఇనుపసువ్వలు బయట పడ్డాయి. విద్యార్థులు ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు.
- రాబోయేది శీతాకాలం కూడా కావడంతో భవనాల మరమ్మతుల తో పాటు విద్యార్థులకు సరిపడా దుప్పట్లు అందించడంతో పాటు స్నానాల గదులకు డోర్లు బిగించేలా చూడడం, పారిశుధ్య పనులు చేయడం చేస్తేనే వసతి గృహాల పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉంది

ఉండాల్సింది 6,000 వరకు...

జిల్లాలోని ఉన్న 64 వసతి గృహాల పరిధిలో 6,000 మంది విద్యార్థుల వరకు అడ్మిషన్లు ఉండేలా చూడాలనేది ప్రభుత్వ ఆదేశంగా ఉంది. కానీ ప్రస్తుతం ఉన్న విద్యార్థుల సంఖ్య 3,700 మంది మాత్రమే కావడం గమనార్హం. ఇందులో ఎస్సీ వెల్ఫేర్‌కు సంబంధించిన మూడు వసతి గృహాల్లో జీరో అడ్మిషన్లు నమోదయ్యాయి. హాస్టల్ భవనాల్లో దాదాపు సగం వరకు ప్రైవేటు భవనాల్లోనే నడుస్తున్నాయి. వీటికి అద్దె చెల్లించే విషయంలో కూడా గత ప్రభుత్వం ఎడతెగని నిర్లక్ష్యం ప్రదర్శించింది. ఇక ప్రభుత్వ భవనాల్లోనే నడుస్తున్న వసతి గృహాలు పరిస్థితి అయితే మరీ అధ్వానం. పై స్లాబులు పెచ్చులూడుతూ దర్శనమివ్వడంతో పాటు బాత్‌రూం డోర్లకు తలుపులు లేక ఆరుబయటే స్నానాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది.



నరసరావుపేటలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో చిరిగిపోయిన కిటికి మెస్



రేపల్లె : ఎస్సీ బాలుర వసతి గృహంలో శ్లాబ్ పెచ్చులూడి ప్రమాదకరంగా మారిన దుస్థితి



రేపల్లె : ఎస్సీ బాలుర వసతి గృహంలో ఫ్లోరింగ్ చిద్రమైన దుస్థితి



బాపట్ల : సంజయ్ గాంధీ కాలనీలో ఉన్న ఎస్సీ హాస్టల్‌లో సెల్ ఫోన్, టార్చ్ లైటు వెలుతురులో చేస్తున్న వంట



రేపల్లె: ఎస్సీ కళాశాల వసతి గృహంలో కిటికీ తలుపులు లేకపోవడంతో దుప్పట్లు కట్టుకున్న విద్యార్థులు



వినుకొండ: బీసీ హాస్టల్‌లో విరిగిపోయిన కిటికీ తలుపులు



బాపట్ల పట్టణంలోని సంజయ్‌గాంధీ ఎస్టీ హాస్టల్లో ఒకే దోమ తెరలో తలదాచుకున్న ముగ్గురు విద్యార్థులు

సాగు నీటి సంఘాల.. ఎన్నికల నగారా

- ప్రకటన జారీ చేసిన కలెక్టర్ అరుణ్‌బాబు
- 274 నీటి సంఘాలకు నవంబర్ 21న పోలింగ్
- 40 రోజుల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తి
- కౌలు రైతులకూ ఓటు హక్కు
- పల్లెల్లో రైతు వర్గాల్లో ఎన్నికల సందడి
- పట్టు సాధించేందుకు ప్రధాన పార్టీల కసరత్తు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సాగు నీటి సంఘాల ఎన్నికల నగారా మోగింది. పల్నాడు కలెక్టర్ అరుణ్‌బాబు ఇందుకు సంబంధించిన ప్రకటనను సోమవారం విడుదల చేశారు. ఎన్నికల ప్రకటన విడుదలలో జల వనరుల శాఖ ఎస్ఈ, ఎన్నికల అధికారి పి.కృష్ణమోహన్, డీఈఈ నరేంద్ర పాల్గొన్నారు. నాగార్జునసాగర్ కుడికాలువ పరిధిలోని పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలో

(మిగతా 6వ పేజీలో...)



కంప చెట్లతో మూసుకుపోయిన గోవిందాపురం మైనర్ కాలువ

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

ఎస్పీ తుషార్‌డూడి

బాపట్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : విధినిర్వాహణలో అశువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని ఎస్పీ తుషార్‌డూడి పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణదినోత్సవం సోమవారం బాపట్ల పట్టణ పోలీసుస్టేషన్ ప్రాంగణంలో నిర్వహించారు. అమరవీరుల స్థూపానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, అధికారులతో కలిసి నివాళులు అర్పించారు. అడ్మిన్ ఆర్ఐ షేక్.మాలుద్దీన్ పెరేడ్ కమాండర్‌గా వ్యవహరిస్తూ ముఖ్య అతిథులకు గౌరవవందనం సమర్పించి పోలీసు వాయిద్యాలతో స్మృతి పేరెడ్ నిర్వహించారు. అమరవీరుల వివరాలతో ఉన్న షహీద్‌పుస్తక్‌టో లిని ఆర్ఎస్ఐ ఎస్.గోపిధీరేచ ల్లో వచ్చి ముఖ్యఅతిథికి అందించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, అడిషనల్ ఎస్పీ టిపి విఠలేశ్వర్, డీఎస్పీ జి.రామాంజనేయులు, చీరాల డీఎస్పీ పి.జగదీష్‌నాయక్, రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు, ఎఆర్‌డి ఎస్పీ ఎస్.చంద్రమోహన్‌లు, పోలీసు అమరవీరుల స్థూపం వద్దకు చేరుకొని అంకితభావంతో సేవలందిస్తూ ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగధనులందరికి పుష్పగుచ్చాలతో ఘన నివాళులు అర్పించారు. ధైర్య సాహసాలతో ప్రజా సేవ చేస్తూ అసాం ఘిక శక్తులతో పోరాడుతూనే అశువులు బాసిన పోలీసు వీరులను స్మరించుకుంటూ 2నిమిషాలు మౌనం పాటించారు. షహిద్‌పుస్తక్‌టోలిలో ఉన్న అమరవీరుల పేర్ల ను అడిషనల్ ఎస్పీ టిపి విఠలేశ్వర్ చదివి వినిపించారు. ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా 214మంది తమ ప్రాణాలను కోల్పోయారని వారిలో ఇద్దరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రలో మృతి చెందారని శ్రద్ధాంజలి ఘటించారు.



అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎస్పీ తుషార్ డూడి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు

అనంతరం అక్కడ జరిగిన సభలో ఎస్పీ మాట్లాడుతూ నేరాలను నియంత్రించటలో, శాంతిభద్రతలు పరిరక్షించటంలో పోలీసుశాఖ విశేష కృషి చేస్తుందన్నారు. శాంతిభద్రతలు పరిరక్షించటంలో పోలీసు చే స్తున్న కృషిని, వారి త్యాగాలను, విధులను ప్రజలకు తెలియజేసేందుకు అక్టోబరు 21వ తేదీ నుండి 31 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు.

విధినిర్వహణలో అశువులు బాసిన పోలీసులకు ఘననివాళులు అర్పిస్తూ వారి కుటుంబ సభ్యులను ఆదుకోవాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. పోలీసు అమరవీరుల త్యాగఫలితంగానే శాంతిభ ద్రతల సంరక్షణ జరుగుతున్నదన్నారు. స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నామన్నారు. రాజ్యాంగ విలువలకు కట్టుబడిఉంటూ సిద్ధాంతాలకు లోబడి పనిచేయటం అభినందనీయమన్నారు. నేరాలు చేసేవారిని కట్టుదిట్టం చేయటం వారికి శిక్షలు పడేవిధంగా పోలీసు వ్యవస్థ పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా విధినిర్వహణలో అశువులు బాసిన పోలీసు అమరవీరుల కుటుంబాలను సత్కరించారు. అనంతరం పురవీధులలో ప్రదర్శన చేసి అంబేద్కర్‌సర్కిల్‌లో మాన వహారం ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో పోలీసుఅధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బాపట్ల అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు, పోలీసు అధికారులు

నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలి

జాయింట్ కలెక్టర్‌కు రైతుల వినతి

బాపట్లరూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన పంటకు నష్టపరిహారం ఇప్పించాలంటూ చినగంజాం మండలం పెదగంజాం రెవెన్యూ పరిధిలోని రైతులు సోమవారం కలెక్టరేట్ నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీవర్షాలకు చినగంజాం మండలం పెదగంజాం రెవెన్యూ పరిధిలోని కొమ్మమూరు కాల్వలో, కొత్తకాల్వ కింద ఉన్న వరిపంట, నారుమడులు పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయి. ఈ రెవెన్యూ పరిధిలో సుమారు 800 ఎకరాలు వరినాట్లు వేసిన పొలం పూర్తిగా దెబ్బతింది. అదేవిధంగా కొత్తకాల్వ కింద సుమారు 800 ఎకరాలు వరినారుమడులు దెబ్బతిన్నాయి. మురుగుకాల్వ, సాగునీటి కాల్వలకు అనేకచోట్ల గండ్లుపడి పొలాలు నీటమునిగాయి. అధికారులు మా సమస్యను పరిశీలించి వెంటనే కాల్వలకు గండ్లు పూడ్చి నష్టపోయిన పంటకు వ్యవసాయాధికారులు నష్టపరిహారం ఇప్పించాలని కలెక్టర్‌కు వినతిని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణను వినియోగించుకోవాలి

జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి రాజదెబోరా

పర్చూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ప్రభుత్వం ద్వారా అందించనున్న ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి జె.రాజదెబోరా అన్నారు. సోమవారం మండలంలోని ఉప్పుటూరు గ్రామంలో ఉన్న ఎస్సీ బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించారు. వసతులు, విద్యార్థుల హాజరు తదితర అంశాలను వార్డెన్ జి.అనంతలక్ష్మి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షలకు హాజరు అవుతున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ప్రభుత్వం ఉచిత శిక్షణ, భోజన వసతి సదుపాయాన్ని కల్పిస్తుందన్నారు. అభ్యర్థులు ఈనెల 25లోపు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలో త్వరలో శిక్షణ తరగతులను ప్రారంభమవుతాయని తెలిపారు.

కొత్త వ్యక్తులు కన్పిస్తే సమాచారం ఇవ్వండి



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్సైలు ఖాదర్‌బాషా, ప్రవీణ

అద్దంకి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద, కొత్త వ్యక్తులు కనపడితే వెంటనే సమాచారం అందించాలని ఎస్ఐ ఖాదర్‌బాషా అన్నారు. శ్రీ ప్రసన్నాంజనేయ నేస్తమా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు యూనియన్ గుర్తింపు కార్డులను సోమవారం ఎస్ఐలు ఖాదర్‌బాషా, ప్రవీణ అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేత పూనూరి నరేంద్ర, యూనియన్ ప్రెసిడెంట్ నాగిపోగు చక్రవర్తి, వైస్ ప్రెసిడెంట్ దాసి బుల్లియ్య, అన్నం నాగేశ్వరరావు, సెక్రటరీ బత్తుల చందు, తుళ్లూరి ఏసుదాసు, సురభి రాంబాబు, దొండపాటి రాజా, నల్లబోతుల శ్యామ్, ఆవుల రమణయ్య, దాసరి సిలోమాను, చుండూరి శ్రీను, దేవరకొండ కోటి, దాసరి కోటేశ్వరరావు, షేక్ ఖాజావలి, వడ్లమూడి మార్కు, పసుమర్తి ప్రభు కిరణ్ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాగులో బంగారం అపహరణ

అద్దంకి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : బస్సు ఎక్కే మహిళ హ్యాండ్ బ్యాగ్‌లో బంగారం గొలుసు అపహరణకు గురైన సంఘటన సోమవారం మధ్యాహ్నం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మద్దిపాడుకు చెందిన దయమ్మ అద్దంకిలో బంధువుల ఇంటికి వచ్చి బంగారం గొలుసు కొనుగోలు చేసి హ్యాండ్‌బ్యాగ్‌లో పెట్టుకొని ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చింది. మధ్యాహ్నం 2 గంటల సమయంలో మహిళ ఒంగోలు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా ఇద్దరు మహిళలు ఎదురుగా తోసుకుంటూ వచ్చారు. బస్ సీట్‌లో వెళ్లి కూర్చున్న తరువాత దయమ్మ హ్యాండ్ బ్యాగ్ చూడగా కోసి ఉంది. అందులో ఉండాల్సిన 3 సవర్ల బంగారం గొలుసు చోరీకి గురైనట్లు గుర్తించి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బాలికపై యువకుడి అసభ్య ప్రవర్తన

ప్రశ్నించిన తండ్రిపై దాడి

అద్దంకి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఓ యువకుడు బాలికకు డబ్బు ఆశ చూపి అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై ప్రశ్నించిన తండ్రి పై దాడి చేయడంతో గాయాలయ్యాయి. బాధితుడి కథనం మేరకు.. అద్దంకి పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన 11 ఏళ్ల బాలికకు ఏడుకొండలు నాలుగు రోజుల కిందట కూడా డబ్బు ఆశ చూపి ఇంట్లోకి రమ్మని పిలిచాడు. బాలిక కేకలు వేసింది. విషయాన్ని తండ్రికి చెప్పింది. దీంతో తండ్రి ప్రశ్నించడంతో ఏడుకొండలు దాడి చేశాడు. తలకు గాయమైంది. అతను స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చేరారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఖాదర్‌బాషా తెలిపారు.

రోడ్డెక్కిన ముస్లింలు

మసీదు ప్రాంతంలో మద్యం దుకాణం వద్దంటూ డిమాండ్



తహసీల్దార్ గోపీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న ముస్లింలు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మసీద్ సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడంపై ముస్లింలు రోడ్డెక్కారు. చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెం - తోటవారి పాలెం రోడ్డులో ఉన్న మసీదు సమీపంలో షాపు నెంబర్ 69ని దక్కించుకున్న నిర్వాహకులు నిర్మాణాలు చేపట్టారు. ఈ క్రమంలో ఆగ్రహించిన ముస్లిం నాయకులు, మహిళలు సోమవారం ఆందోళనలు చేపట్టారు. విషయం తెలుసుకున్న ఈపూరుపాలెం ఎస్ఐ శివకుమార్ చేరుకుని వారిని సర్ది చెప్పారు. అనంతరం ముస్లింలు ర్యాలీగా చీరాల ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకుని సీఐ నాగేశ్వరరావుకు, స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ గోపీకృష్ణకు సమస్యను వివరించి, రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అధికారులు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు.

భర్త మృతదేహంతో అత్తారింటికి..

- మాకొద్దంటూ ఇంటికి తాళం వేసి వెళ్లిన తల్లి, సోదరుడు
- శ్మశానంలో ఉంచిన భార్య



శ్మశానవాటికలో ఉన్న రాఘవేంద్రరావు మృతదేహం

మార్టూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కుటుంబసభ్యులు ఇంట్లోకి రానివ్వకపోవడంతో భార్య భర్త మృతదేహాన్ని శ్మశానంలో ఉంచింది. ఈ ఘటన బాపట్ల జిల్లా మార్టూరులో కలకలం రేపింది. ఏఎస్ఐ సయ్యద్ బాషా కథనం ప్రకారం.. మండలంలోని ద్రోణాదుల గ్రామానికి చెందిన కాళహస్తి రాఘవేంద్రరావుకు ఇద్దరు భార్యలు. వారిలో మొదటి భార్య చంద్రకళతో కడప జిల్లా రాజంపేటలో అతను ఉంటున్నాడు. వారికి ఇద్దరు కుమార్తెలు. రెండవ భార్య హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఆదివారం ఉదయం పచ్చకామెర్లు, ఇతరత్రా అనారోగ్య కారణాలతో రాజంపేటలో రాఘవేంద్రరావు మృతిచెందారు. దీంతో రాఘవేంద్రరావు మృతదేహాన్ని భార్య చంద్రకళ అత్తారిల్లు అయిన ద్రోణాదులకు ఆదివారం రాత్రి తీసుకురాగా, మాకు అవసరం లేదంటూ అతని తల్లి, సోదరుడు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. దాంతో భర్త మృతదేహాన్ని మార్చురీ బాక్సులో పెట్టి బంధువుల సహాయంతో మార్టూరులోని శ్మశానవాటికకు తరలించింది. సోమవారం తన సోదరుడి మృతి అనుమానాస్పదంగా ఉందని నాగార్జున స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో, కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం సోదరుడికి అప్పగించగా మార్టూరు శ్మశాన వాటికలోనే అంత్యక్రియలు నిర్వహించారు. ఇదిలావుండగా మహిళలను వివాహం చేసుకుంటానని మోసం చేసి, వారి దగ్గర డబ్బులు కాజేసినట్లు పలు పోలీస్ స్టేషన్‌లలో మృతిచెందిన రాఘవేంద్రరావుపై కేసులు ఉన్నట్లు తెలిసింది.

సాగు నీటి సంఘాల.. ఎన్నికల నగారా

- ప్రకటన జారీ చేసిన కలెక్టర్ అరుణ్‌బాబు
- 274 నీటి సంఘాలకు 21న పోలింగ్
- 40 రోజుల్లో ప్రక్రియ పూర్తి
- కౌలు రైతులకూ ఓటు హక్కు
- పల్లెల్లో రైతు వర్గాల్లో సందడి
- పట్టు సాధించేందుకు ప్రధాన పార్టీల కసరత్తు

5వ పేజీ తరువాయి

274 సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు జలవనరుల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. 274లో 55 సంఘాలు మైనర్ ఇరిగేషన్ శాఖ పరిధిలో ఉన్నాయి. ఈ సారి కౌలు రైతులకు ఓటు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సాగు నీటి సంఘాలకు ఆ తదుపరి డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ఆ తర్వాత ప్రాజెక్టు కమిటీ ఎన్నిక జరగనుంది. ఈ ప్రక్రియ అంతా 40 రోజుల్లో పూర్తికానుంది. ఎన్నికల ప్రక్రియను జలవనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా ఇందులో రెవెన్యూ శాఖ కీలక పాత్ర పోషిస్తోంది. 21న ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం 40 రోజుల్లో ముగియ నుంది. ఈసారి కౌలు రైతులకు ఓటు హక్కును కల్పిస్తున్నారు. నీటి సంఘాల పరిధిలో టీసీలను 31న ప్రకటించనున్నారు. వీటిపై అభ్యంతరాలను 1 నుంచి స్వీకరిస్తారు. 3న టీసీల తుది జాబితాను విడుదల చేస్తారు. 3న డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీ నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నారు. 6న భూ యజమానుల జాబితా(ఓటర్ల)ను రూపొందించే ప్రక్రియ ప్రారంభమై 10న ముగుస్తుంది. 11, 12 తేదీల్లో ఓటర్ల జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ, 13నఅభ్యంతరాల పరిష్కారం, ఓటర్ల తుది జాబితాలను ప్రకటిస్తారు. 20న నీటి వినియోగదారుల సంఘాలు (డబ్ల్యూయూఏ) నోటిఫికేషన్‌ను విడుదల చేస్తారు. 21న డబ్ల్యూయూఏలకు ఎన్నికలు నిర్వహిస్తారు. 21 నుంచి 23 తేదీలలోపె సంఘాల సభ్యులు, అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడి ఎన్నికలను పూర్తి చేస్తారు. 24 నుంచి 26 తేదీలలో నీటి పంపిణీ సంఘాలు (డీసీ)లు, 27 నుంచి 29 తేదీల మధ్య ప్రాజెక్టు కమిటీ(పీసీ) కార్యవర్గ ఎన్నికలు పూర్తి చేయాల్సి ఉంది.



కంపచెట్లతో నిండిపోయిన పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్

తొమ్మిదేళ్ల తర్వాత ఎన్నికలు.. రైతుల్లో సంతోషం

సాగర్ కుడికాలువ ప్రాజెక్టు కమిటీ పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో 30 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. 2003 తొలిసారిగా సాగునీటి వినియోగదారుల సంఘాలు ఏర్పాటయ్యాయి. చివరిసారిగా 2015లో ఎన్నికలు జరిగాయి. 2020తో కాలపరిమితి ముగిసింది. గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణను విస్మరించింది. దీంతో సాగు నీటి కాలువల నిర్వహణలో రైతుల భాగస్వామ్యం లేకుండా చేసింది. సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తే సాగు నీటి సరఫరా.. కాలువ మరమ్మతుల్లో అవి కీలక పాత్ర పోషిస్తాయి. ఈ దిశగా ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగంగానే నీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. తొమ్మిదేళ్ల తర్వాత సదరు సంఘాలకు ఎన్నికలు జరగనుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పల్లెల్లో సాగునీటి సంఘాల ఎన్నికల సందడి నెలకొంది. ఐదేళ్లు నిర్వీర్యమైన సాగు నీటి వ్యవస్థను కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతోంది. జనవనరులలో రైతులను భాగ స్వాములను చేస్తోంది. నీటి పంపిణీలో రైతులకు కీలక పాత్ర కల్పించనుంది.

భూమి, పట్టాదారు పాసు పుస్తకం ఉంటేనే ఓటరు

సాగు నీటి సంఘాలకు ఎన్నికలకు సంబంధించి రైతులకు ఓటు హక్కు కల్పిస్తారు. భూమి, పట్టాదారు పాసు పుస్తకం ఉంటే రైతులను ఓటర్లుగా గుర్తిస్తారు. సాగునీరు సరఫరా చేసే ప్రాంతాల్లో భూములు ఉన్న రైతులను ఓటర్లుగా గుర్తిస్తారు. సర్వే నెంబర్లు ఆధారంగా సాగు నీటి సంఘాల వారీగా ఓటర్లను కేటాయిస్తారు. రుణ అర్హత కార్డులు పొందిన కౌలు రైతులకు ఓటు హక్కు కల్పిస్తున్నారు. డబ్ల్యూయూఏకు కమిటీలను టీసీ సభ్యులు ఎన్నుకుంటారు. ఈ సంఘాలు డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకుంటాయి. డీసీల నుంచి ప్రాజెక్టు కమిటీని ఎన్నుకుంటారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు చర్యలు

సాగునీటి రంగాన్ని బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం సాగు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తోంది. సమస్యాత్మక సంఘాలను గుర్తించి వీటిలో ప్రశాంత ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపడుతున్నారు. ఎన్నికలకు రైతుల ఓటర్ల లిస్టుల తయారీ బాధ్యతలను రెవిన్యూ శాఖకు అప్పగించారు. నీటి సంఘాల పరిధిని ఇప్పటికే జలవనరుల శాఖ గుర్తించింది. మైనర్ ఇరిగేషన్ అంటే చెరువుల కింద సాగు చేస్తున్న ఆయకట్టు రైతులకు ఓటు హక్కు కల్పిస్తారు. చెరువుల ఆయకట్టు పరిధిలోని రైతుల వివరాలను సంబంధిత శాఖ సేకరించింది. ఒక్కొక్క నీటి సంఘం పరిధిలో ఆయకట్టు ఆధారంగా రైతులకు ఓటు హక్కును కల్పిస్తారు. ఇందుకు సంబంధించి అయకట్టు పరిధిలో సర్వే నెంబర్లు సేకరించారు. ఏ సర్వే నెంబర్‌లో ఎంత మంది రైతులు ఉన్నారు, వీరిలో కౌలు రైతులు ఎంత మంది ఉన్నారో నిర్ధారిస్తారు. ఈ వివరాలు ఆధారంగా సాగు నీటి సంఘం పరిధిలో ఓటర్ల జాబితాలను సిద్ధం చేస్తున్నారు. జలవనరుల, రెవిన్యూ శాఖలు సంయుక్తంగా ఓటర్లను గుర్తిస్తాయి.

దృష్టి సారించిన ప్రధాన పార్టీలు

సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా స్వీకరిస్తున్నాయి. సాధారణ ఎన్నికల అనంతరం జరగనున్న తొలి ఎన్నికలపై పార్టీలు దృష్టి సారించాయి. రైతుల వర్గాల్లో పట్టు నిలుపుకునేందుకు నేతలు సమాయత్తమయ్యారు.

సంతకాలు నావే...ఆర్డర్లు ఫేక్

- పూర్వ డీపీవో ఉషారాణి వ్యవహారశైలిపై అవాక్కు
- విచారణాధికారులను ముప్పుతిప్పలు పెట్టిన వైనం
- కొత్తగా వచ్చిన అధికారిపై నిందలు వేసే ప్రయత్నాలు
- అయోమయంలో గ్రేడ్-5, 6 సిబ్బంది
- తమ పరిస్థితి ఏమిటని ఆందోళన
- విచారణ అనంతరం కలెక్టర్‌ను కలిసిన ఉద్యోగులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ పరిధిలోని గ్రేడ్-5, గ్రేడ్-6 (సచివాలయ కార్యదర్శులు) ఉద్యోగుల బదిలీల్లో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలు వెలుగులోకి వస్తుండటంతో ఆ తప్పులను ఇతరులపై నెట్టి వేసే ప్రయత్నాలు చేస్తుండటంపై విచారణాధికారులు విస్తుపోయారు. పంచాయతీ కార్యదర్శుల బదిలీలల్లో అక్రమాలపై ఫిర్యాదులు అందడంతో కలెక్టర్ తమీమ్ అన్సారియా త్రిసభ్య కమిటీని విచారణకు నియమించారు. ఫారెస్టు సెటిల్‌మెంట్ ఆఫీసర్ లోకేశ్వరరావును చైర్మన్‌గా, జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవి, జిల్లా ఆడిట్ అధికారి శంకర్‌నారాయణరెడ్డిలను సభ్యులుగా నియమించారు. దీంతో వారు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఫారెస్టు సెటిల్‌మెంట్ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీల ఉత్తర్వులు పొందిన ఉద్యోగులను విచారించారు. ఈ సందర్భంగా తాము పడిన ఇబ్బందులను వారు విచారణాధికారుల ఎదుట ఏకరువు పెట్టారు.



పూర్వ డీపీవోను విచారిస్తున్న త్రిసభ్య కమిటీ

ఉత్తర్వులు ఇచ్చారు.. చేర్చుకోవద్దన్నారు

తమకు బదిలీ ఉత్తర్వులు ఇచ్చారని, కానీ విధుల్లో చేర్చుకోవద్దని ఎంపీడీవోలకు ఫోన్‌లు చేసి చెప్తున్నారని ఉద్యోగులు విచారణాధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఉద్యోగంలో చేరిన నాటి నుంచి ఇటువంటి పరిస్థితి ఎప్పుడూ ఎదురుకాలేదన్నారు. న్యాయం చేసి ఆదుకోవాలని విచారణాధికారులకు విన్నవించారు. తదనంతరం జిల్లా పంచాయతీ పూర్వ ఇన్‌చార్జి అధికారి ఉషారాణిని కూడా విచారణ చేశారు. ఆ సమయంలో ఆమె చెప్పిన మాటలు విని విచారణాధికారులు అవాక్కయ్యారు. ఆ బదిలీల ఉత్తర్వులపై సంతకాలు మాత్రం తనవేనని, కానీ ఆ ఉత్తర్వులు మాత్రం ఫేక్ అని చెప్పినట్లు సమాచారం. మరోవైపు ఇటీవల జిల్లా పంచాయతీ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన గొట్టిపాటి వెంకటనాయుడు వారిని చేర్చుకోవద్దని ఎంపీడీవోలకు ఫోన్ చేసి చెప్పారని నెపం ఆయనపై మోపే ప్రయత్నం చేశారు. దీంతో విచారణాధికారులు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రస్తుత డీపీవో రాకముందే బదిలీలు

జిల్లా పంచాయతీ అధికారి వెంకటనాయుడు పది రోజుల క్రితమే బాధ్యతలు స్వీకరించారు. అప్పటికే ఉద్యోగుల బదిలీల ప్రక్రియ కూడా ముగిసింది. ఇప్పుడు ఆ తప్పును కప్పిపుచ్చేందుకు ఉషారాణి ఇతరులపై నెట్టివేస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు జిల్లా పంచాయతీ కార్యాలయంలో పనిచేసే ఇతర ఉద్యోగులపై కూడా ఆ నెపం మోపే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా అధికారిగా ఉన్న సమయంలో కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్ ప్రకారం బదిలీలు చేయాల్సి ఉండగా అందుకు భిన్నంగా చేపట్టడాన్ని విచారణాధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. దానిపై సరైన సమాధానం చెప్పకుండా దాటివేయడమే కాకుండా ఆ తప్పులను ఇతరులపై నెట్టేందుకు ప్రయత్నించినట్లు సమాచారం.

తలలుపట్టుకుంటున్న విచారణాధికారులు

పూర్వ డీపీవో ఉషారాణి చెప్తున్న మాటలతో విచారణాధికారులకు కూడా ఏమి చేయాలో తెలియక తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నట్లు సమాచారం. విచారణాధికారులు ఏ అంశాన్ని ప్రస్తావించినా దానిపై కాకుండా ఇతర అంశాలను పదేపదే ప్రస్తావించినట్లు తెలిసింది. దీంతో విచారణాధికారులు చేసేదేమీ లేక జిల్లా పంచాయతీ కార్యాలయం నుంచి బదిలీల సమయంలో కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను తెప్పించుకొని వాటిని క్షుణ్ణంగా పరిశీలించినట్లు సమాచారం. కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌కు, ఉద్యోగుల బదిలీల ఉత్తర్వులకు అసలు సంబంధం లేకుండా ఉన్నట్లు తెలిసింది. కాగా విచారణ సమయంలో ఉషారాణి చెప్పిన సమాధానం తెలిసి బాధిత ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. వెంటనే వారు తమ ఉత్తర్వులను తీసుకుని కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిశారు. ఆమె ఎదుట తమ ఆవేదన, ఆందోళనను వెలిబుచ్చారు. కాగా విచారణ సమయంలో తప్పులను కప్పిపుచ్చేందుకు, ఇతర ఉద్యోగులపై నెట్టివేసే ప్రయత్నాలు చేస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.



ప్రమాణ స్వీకారోత్సవ సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున

అధైర్యపడవద్దు.. అండగా ఉంటాం

మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ

బాపట్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ శ్రేణులు అధైర్యపడవద్దు అండగా ఉంటామని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున అన్నారు. పట్టణంలోని ఎంఎస్ఆర్ కల్యాణ మండపంలో పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నాగార్జున సోమవారం ప్రమాణ స్వీకారోత్సవం చేశారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి నివాసం దగ్గర నుంచి పార్టీశ్రేణులు బైక్ ర్యాలీతో కల్యాణ మండపానికి చేరుకొని నాగార్జునకు ఘనస్వాగతం పలికారు. గజమాలలతో సత్కరించారు. కార్యక్రమానికి కోన రఘుపతి అధ్యక్షత వహించగా మేరుగ మాట్లాడుతూ వైసీపీ శ్రేణులు తలెత్తుకొని తిరిగే పరిస్థితికి వస్తుందన్నారు. ఎక్కడ అన్యాయం జరిగిన జగన్‌సైన్యం వస్తుందని భరోసానిచ్చారు. ప్రతి గ్రామంలో తిరిగి ఏ ఒక్క కార్యకర్తకు అన్యాయం జరిగిన అండగా ఉండి పోరాటం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వంలో వైసీపీశ్రేణులపై దాడులు పెరిగిపోయాయన్నారు. పోలీసులు కళ్ళుమూసుకొని వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రెడ్‌బుక్‌పాలన చేస్తూ వైసీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తున్నారన్నారు. చట్టాలు ఉన్నాయని చట్టప్రకారం చర్యలు తీసుకొని కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జిలను సమన్వయ పర్చుకుంటూ పనిచేస్తానన్నారు.

ప్రమాణస్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉమ్మడి ప్రకాశం రీజనల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పనితీరు దారుణంగా ఉందని అన్నారు.

వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, యాంకర్ శ్యామల మాట్లాడుతూ సనాతన ధర్మం అడ్డుపెట్టుకొని తప్పులు చేస్తున్నారన్నారు. వైసీపీ కార్యకర్తలే పార్టీకి పునాదులు అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, దర్శి ఎమ్మెల్యే బూచెపల్లి శివప్రసాదరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గాదె మధుసూధనరెడ్డి, చీరాల, రేపల్లె, వేమూరు, అద్దంకి ఇన్‌చార్జులు, ప్రకాశం జడ్పీ చైర్‌పర్సన్ కె.వెంకాయమ్మ, దూపాటి నాగరాజు, మాధవరావు, కనకారావు, బాపట్ల నాయకులు కాగిత సుధీర్‌బాబు, కోకి రాఘవరెడ్డి, జోగి రాజా, డి.సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానంటూ మోసం

- రూ.5లక్షలు కాజేశారని ఫిర్యాదు
- న్యాయం చేయాలంటూ ఎస్పీకి బాధితుడి వినతి

బాపట్లరూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : హోంగార్డ్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.5లక్షలు తీసుకొని ఓ వ్యక్తి తనను మోసం చేశాడంటూ చీరాల మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన కావూరి కోటిరెడ్డి అనే వ్యక్తి సోమవారం బాపట్ల ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఎస్పీకి వినతిపత్రాన్ని అందజేశాడు. అనంతరం ఎస్పీ కార్యాలయం ఎదుట విలేకరులతో మాట్లాడుతూ చీరాల మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన బక్కా హరికృష్ణారెడ్డి అనే వ్యక్తి హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తానని నా దగ్గర సుమారు రూ.5లక్షలు తీసుకొని ఉద్యోగం ఇప్పించకపోగా రెండేళ్లయినా సమాధానం చెప్పడంలేదని, అదేమని అడిగితే ఉద్యోగం మీకొడుకుకు ఇప్పిస్తానని మభ్య మాటాలు చెప్తున్నారని అన్నారు. నేను ఇచ్చిన డబ్బులు గురించి అడుగుతుంటే మాపై దౌర్జన్యం చేస్తున్నారని తెలిపారు. మోసం చేసిన బక్కా హరికృష్ణారెడ్డి అతని అల్లుడు సత్యనారాయణరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని వేడుకున్నారు.

ఆధ్యాత్మిక చింతన అందరికీ అవసరం

ఈపూరుపాలెం(చీరాలటౌన్), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతన ప్రతి ఒక్కరికీ అవసరమని, అప్పుడే మనసు ప్రశాంతగా ఉంటుందని బూదాటి రాంప్రసాద్, సుజాత దంపతులు పేర్కొన్నారు. మండల పరిధిలోని ఈపూరుపాలెం పద్మనాభునిపేటలోని శ్రీభద్రావతి సమేత భావనాఋషి దేవస్థానానికి దేవస్థాన వైస్ ప్రెసిడెంట్ రాంప్రసాద్ దంపతులు రంగుల నిమిత్తం రూ.లక్ష నగదును విరాళంగా అందజేశారు. ఈసందర్భంగా కమిటీ ప్రతినిధులు వారిని అభినందించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు అవ్వారు బాలకృష్ణమూర్తి, అధ్యక్షుడు భట్టు వెంకట సుబ్బయ్య, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కేజీబీవీ పోస్టులకు భారీ డిమాండ్

ఒంగోలు విద్య, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లోని కాంట్రాక్టు పోస్టులకు భారీ డిమాండ్ ఏర్పడింది. ఈ పోస్టులు కేవలం 2024-25 విద్యా సంవత్సరానికి మాత్రమేనని నోటిఫికేషన్‌లో పేర్కొన్నా అభ్యర్థులు అత్యధిక సంఖ్యలో దరఖాస్తులు చేశారు. జిల్లాలోని 38 కేజీబీవీల్లో బోధన, బోధనేతర పోస్టులు ఉండగా 1,930 మంది దరఖాస్తు చేశారు. 42 బోధన పోస్టులకు 1,331, తొమ్మిది బోధనేతర పోస్టులకు 599 దరఖాస్తులు అందాయి. బోధన పోస్టుల్లో ఒక ప్రిన్సిపాల్ పోస్టుకు 128 మంది, రెండు పీఈటీ పోస్టులకు 46, నాలుగు ఇంగ్లీషు పోస్టులకు 69, ఆరు గణితం పోస్టులకు 259, ఐదు పీఎస్ పోస్టులకు 103, మూడు ఎస్ఎస్ పోస్టులకు 223 మంది దరఖాస్తు చేసుకున్నారు. మూడు సోషల్ పోస్టులకు 190, పీజీటీ ఫిజిక్స్ రెండు పోస్టులకు 34, రెండు కెమిస్ట్రీ పోస్టులకు 42, రెండు బాటనీ పోస్టులకు 47, రెండు జువాలజీ పోస్టులకు 43, రెండు జీఎఫ్‌సీ పోస్టులకు నాలుగు, ఎనిమిది పార్ట్‌టైం టీచర్ పోస్టులకు 143, బోధనేతరంలో మూడు వార్డెన్ పోస్టులకు 312, ఆరు అకౌంటెంట్ పోస్టులకు 287 దరఖాస్తులు వచ్చాయి. కాంట్రాక్టు పోస్టులకు పెద్దఎత్తున దరఖాస్తులు రావడం నిరుద్యోగ సమస్య తీవ్రతకు దర్పణం పడుతోంది. ట్రిపుల్ ఐటీ లాంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో ఇంజనీరింగ్ పూర్తిచేసిన విద్యార్థినులు కూడా ఈ పోస్టుల కోసం పోటీ పడుతున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థమవుతుంది.

చీరాలలో రెచ్చిపోయిన రేషన్ దొంగలు

- ఏకంగా అర్ధరాత్రి హైవేలో హల్‌చల్
- ఆపై కొట్లాట
- ఆధిపత్య పోరులో సింహభాగం సిండికేట్ వ్యాపారి జులుం
- అక్రమంగా ఒక వ్యక్తి తరలిస్తున్న సరుకు తనకివ్వలేదని దాడి
- దీంతో స్టేషన్‌ను ఆశ్రయించిన చిరుదొంగ
- బాధితుడు పీడీఎఫ్ పత్రిక విలేకరి కావడం విశేషం

చీరాలటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : చీరాలలో రేషన్ మాఫియా రెచ్చిపోయింది. ఏకంగా అర్ధరాత్రి చిరుదొంగపై అహంకారం చూపి దాడికి తెగబడ్డారు. ఈ ఘటన 216 జాతీయ రహదారిలోని హాయ్ రెస్టారెంట్ సమీపంలో చోటుచేసుకుంది. పేరాలకు చెందిన హరీష్ పోగు చేసిన సుమారు 80 బస్తాల రేషన్ బియ్యంను ఉప్పుగుండూరుకు వాహనం ద్వారా అర్ధరాత్రి తరలిస్తున్నారు. అయితే ఇప్పటికే సిండికేట్‌గా మారి రేషన్ మాఫియా డాన్‌గా హవా సాగిస్తున్న ఒంగోలుకు చెందిన ప్రసాద్, ఉప్పుగుండూరుకు చెందిన రాజా, మరో ఇద్దరు దారికాచి తెగబడ్డారు. కారులో వచ్చి సినిమా తరహాలో వెంటపడి పట్టుకున్నారు. క్రికెట్ వికెట్లతో విచ్చలవిడిగా దాడి చేశారు. చిరుదొంగ తరలిస్తున్న 80 బస్తాలు బియ్యంతో ఉడాయించారు. దీంతో చిరుదొంగ హరీష్ టూటౌన్ పోలీసుల ను ఆశ్రయించాడు. ఇప్పటికే రెండు వర్గాలను విచారించిన పోలీసులు కేసు నమోదు చేసేందుకు మొగ్గు చూపినట్లు తెలుస్తుంది.

కిరాతక ప్రియుడు

- వివాహితపై హత్యాయత్నం
- దేగరమూడిలో ఘటన
- గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

మార్టూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : భర్తకు దూరంగా ఉంటూ,వివాహేతర సంబంధం ఉన్న మహిళను ప్రియుడు కిరాతకంగా కత్తితో నరికిన దారుణం ఆదివారం రాత్రి బాపట్ల జిల్లా మార్టూరు మండలం దేగరమూడి గ్రామంలో జరిగింది. ఈ ఘటనలో బాధితురాలు సూరేపల్లి మేరీ(27) గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందింది. నిందితుడు కండె వరప్రసాద్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. మేరీకి 7 ఏళ్ల అబ్బాయి, 4ఏళ్ల కూతురు ఉన్నారు. సోమవారం స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎం.శేషగిరిరావు ఆ వివరాలను తెలిపారు. మండలంలోని రాజుపాలెంలోని జయంతినగర్‌కు చెందిన సూరేపల్లి నాగరాజు పెద్ద కుమార్తె మేరీ. 9 ఏళ్ల కిందట మేరీని పల్నాడు జిల్లా గొట్టిపాడు గ్రామానికి చెందిన నాగండ్ల నాగేంద్రబాబుతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు. తర్వాత కొన్ని కారణాలు వలన భర్తకు దూరంగా మేరీ తన పిల్లలతో కలిసి తండ్రి ఇంటివద్ద రాజుపాలెంలో ఉంటోంది. రెండేళ్ల కిందట పొగాకు పచ్చాకు పనుల నిమిత్తం మేరీ నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలంలోని డీసీపల్లి గ్రామానికి వెళ్లగా అక్కడ వరప్రసాద్ అనే వ్యక్తితో ఆమెకు పరిచయం అయింది. అతనిది కొరిశపాడు మండలం ఎర్రపాలెం గ్రామం. భార్యతో దూరంగా ఉంటున్నాడు. వరప్రసాద్, మేరీ సహజీవనం చేస్తూ డీసీపల్లిలో ఉంటున్నారు. తండ్రి నాగరాజు అనారోగ్య కారణంగా దేగరమూడిలో అద్దె ఇంటిలో తన ఇద్దరు కుమార్తెలతో ఉంటున్నారు. మేరీ తండ్రిని చూసేందుకు రెండునెలల కిందట దేగరమూడి వచ్చి అక్కడే ఉంటోంది. తన దగ్గరకు రావాలని ప్రసాద్ తరచుగా మేరీని ఒత్తిడి చేసేవాడు. మేరీ వెళ్లకపోవడంతో ఆగ్రహానికి గురైన ప్రసాద్ ఆదివారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో మేరీ ఇంటికి వెళ్లి బయటకు రమ్మన్నాడు. ఆమె వచ్చాక కంట్లో కారం చల్లి కత్తితో ఆమె మెడ, తల, భుజంపై గాయపరిచి పరారయ్యాడు. ఈ సంఘటనతో పెద్దగా కేకలు వేసిన మేరీ విపరీతమైన రక్తస్రావానికి గురై కుప్పకూలింది. కుటుంబ సభ్యులు ఆమెను ఆటోలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగై వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అర్ధరాత్రి మృతి చెందింది. తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు మేరీ మృతదేహానికి పోస్టు మార్టమ్ నిర్వహించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని శేషగిరిరావు తెలిపారు. నిందితుని కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

స్కూల్ భవనాలకు వైసీపీ శాపం

- సిమెంట్ బిల్లులు చెల్లించకపోవడంతో సరఫరా నిలిపివేత
- ఆగిపోయిన నిర్మాణ పనులు
- విద్యార్థులు, ఉపాధ్యాయులకు తప్పని అవస్థలు
- కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని విజ్ఞప్తి

మార్టూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మండలంలో రెండేళ్ల కిందట పూర్తికావలసిన పాఠశాలల భవనాల నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయాయి. సిమెంట్ కొరత, సిమెంట్ రాకపోవడంతో పనులు ఆగిపోయాయి. ప్రతి స్కూలు భవన నిర్మాణానికి ఎంతో కొంత నిధులు ఉన్నప్పటికీ సిమెంట్ లేకపోవడంతో భవనాలు నిర్మాణం జరగలేదు. వైసీపీ పాలనలో దాదాపుగా మూడేళ్ల కిందట నాడు-నేడు కింద మండలంలో రెండవ ఫేజు లో 23 స్కూళ్ల భవన నిర్మాణాలకు రూ.9 కోట్ల నిధులు మంజూరయ్యాయి. వాటిలో శిథిలమైన కొన్ని భవనాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవాటిని నిర్మిస్తుండగా, హైస్కూళ్లలో అదనపు తరగతి గదులు, 3 అంగనవాడీ భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. మండలంలో మార్టూరులో సంపత్‌నగర్ లో, గొట్టిపాటి నగర్‌లో, వలపర్ల బీసీ కాలనీ తదితర గ్రా మాలలో ప్రాథమిక పాఠశాలల


సంపత్‌నగర్‌లో స్లాబ్ దశలో ఆగిపోయిన పాఠశాల భవన నిర్మాణం

భవనాల నిర్మాణం, మార్టూరు, ద్రోణాదుల తదితర హైస్కూల్స్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ భవనాల నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వం వివిధ కంపెనీల నుంచి సిమెంట్‌ను పంపించింది. బస్తా ధర రూ.250 నుంచి రూ.260 చెల్లించారు. తర్వాత సిమెంట్ రావడం లేదు. దీంతో పనులు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి.

సిమెంట్ బిల్లులు వైసీపీ చెల్లించకపోవడంతో ఆయా కంపెనీల వారు సిమెంట్‌ను పంపడం ఆపేశారు. ప్రత్యామ్నాయంగా ప్రైవేటు వ్యక్తుల దగ్గర సిమెంట్‌ను కొనే అవకాశం లేకపోవడంతో స్కూలు పనులను నిలిపివేశారు. కొన్ని స్కూల్ భవనాలు స్లాబు దశలో ఉండగా, మరికొన్ని ప్లాస్టింగ్ చేయాల్సి ఉంది. ద్రోణాదుల హైస్కూల్లో అదనపు తరగతి గదులు ఇనుప పిల్లర్లు పోసిన దశలో ఉన్నాయి. ఇంకా వివిధ దశలలో భవనాల నిర్మాణాలు ఉన్నాయి. మండలంలో దాదాపుగా రూ.5కోట్లతో పనులు జరిగినట్లు ప్రధానోపాధ్యాయులు చెప్తున్నారు. స్కూల్ భవనాల పూర్తికి కూటమి ప్రభుత్వం స్పందిస్తేనే విద్యార్థులు, ఉపాధ్యాయుల అవస్థలు తీరుతాయి. మన బడి, మన భవిష్యత్ కార్య క్రమాన్ని ప్రవేశపెట్టిన కూటమి ప్రభుత్వం సిమెంట్‌ను సరఫరా చేస్తే తిరిగి పనులు ప్రారం భించవచ్చని ఉపాధ్యా యులు చెప్తున్నారు. ఈ విషయమై ఎంఈవో వస్రాంనాయక్ మా ట్లాడుతూ సిమెంట్ రాకపోవడంతో స్కూలు భవనాల నిర్మాణాల పనులు ఆగిన మాట వాస్తవమన్నారు. ఈ విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు.


ద్రోణాదుల హైస్కూల్‌లో పునాదికే పరిమితమైన తరగతి గది

తెలుగు ఉపాధ్యాయుడికి జాతీయ సేవా పురస్కారం

అద్దంకిటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి మండలంలోని మైలవరం జడ్పీ పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న వంగెవరపు రమేష్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాయతీ సేవా పురస్కారం అందుకున్నారు. హెల్ప్ స్వచ్ఛంద సంస్థ తృతీయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం సత్తెనపల్లిలోని ఐఎంఏ హాల్‌లో జరిగాయి. ఈ వేడుకల్లో వివిధ రంగాలలో సేవలు అందించిన వారికి పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు రమేష్ 22 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాలల్లో పని చేస్తూ బాలికల విద్యా పట్ల పోత్సాహ కార్యక్రమాలు, పాఠశాల అభివృద్ధికి, బడిబయట పిల్లలను బడిలో చేర్పించడం, అభినవ కవిగా కవితా కథనాలతో రచనలు చేయడం, సామాజిక కార్యకర్తగా సేవలందిస్తున్నారు. ఆయన సేవలకుగాను భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ సేవా పురస్కారాన్ని ఫౌండేషన్ వ్యవస్థాపకులు కె.బుల్లిబాబుతో పాటు అతిథులు అందజేశారు. రమేష్‌కు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.


పురస్కారం అందుకుంటున్న రమేష్

పోలీస్ అమర వీరులకు నివాళి

బల్లికురవ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ మండల కేంద్రంలో సోమవారం పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌ఐ జీవీ చౌదరి, పోలీసు సిబ్బంది విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అమరులైన పోలీసు సిబ్బందికి నివాళులర్పించారు.


బల్లికురవలో ర్యాలీ చేస్తున్న పోలీసు సిబ్బంది

ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం

వేటపాలెం (చీరాల), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌సీసీ శిక్షణ పొందిన పందిళ్లపల్లి హైస్కూల్ విద్యార్థులకు సోమవారం ఏ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా 23 (ఏ) ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ సునీల్ గౌతమ్ మాట్లాడుతూ పాఠశాలలో 8, 9 చదువుతున్న 36 మందికి రెండు సంవత్సరాలు ఎన్‌సీసీలో శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ పూర్తి చేసినవారికి ఏ సర్టిఫికెట్లను అందజేశామన్నారు. ఎన్‌సీసీ క్రమశిక్షణకు మారుపేరన్నారు. నేర్చుకున్న అంశాలను జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు ఉపయోగించుకోవాలని క్యాడెట్లకు సూచించారు. కార్యక్రమంలో సూల్ హెచ్‌ఎం ఎం.శేఖరరావు, ఎన్‌సీసీ సెకండ్ ఆఫీసర్ తోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో ప్రతినిధులు

రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తాం

ఈఈ మస్తాన్‌రావు


బల్లికురవ. అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రైతులకు నాణ్యమైన వ్యవసాయ విద్యుత్‌ను అందిస్తామని ఆ శాఖ అద్దంకి డీవిజన్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. సోమవారం మండలంలోని గుంటుపల్లి, చెన్నుపల్లి గ్రామాలలో రైతులతో విద్యుత్ అధికార్లు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఈఈ మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకొన్న రైతులకు సకాలంలో కొత్త లైన్లు ఏర్పాటు చేసి మెరుగైన విద్యుత్‌ను అందజేస్తామన్నారు. గ్రామాల వారీగా రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి వారికి అవసరమైన లైన్లను మంజూరు చేయిస్తామన్నారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు పంటలకు పగటి సమయంలో 9 గంటల కరెంట్ అందిస్తామని, ఈమేరకు రైతులకు అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాలలో గృహాలకు లోవోల్టేజీ సమస్య రాకుండా ట్రాన్స్‌పార్మర్లను ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను మార్పు, త్రిఫేజ్ లైన్ ఏర్పాటుకు శరవేగంగా పనులు జరుగుతున్నట్లు ఈఈ మస్తాన్‌రావు తెలిపారు. సమావేశంలో మార్టూరు ఏడీఈఈ సురేంద్రబాబు, ఏఈ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు మలినేని గోవిందరావు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయానికి శంకుస్థాపన

- వైభవంగా స్వామి వారి కల్యాణం
- పాల్గొన్న మంత్రి గొట్టిపాటి సతీమణి ఝాన్సీ

అద్దంకి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చినకొత్తపల్లి డొంక వద్ద శ్రీయాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్‌ఆర్‌ఐల సహకారంతో భూ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయం నిర్మాణానికి సోమవారం ఉదయం శంకుస్థాపన చేశారు. అనంతరం స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సతీమణి ఝాన్సీ ఈ పూజలలో పాల్గొన్నారు. ట్రస్ట్ ఫౌండర్, ఎన్‌ఆర్‌ఐ దేవినేని శ్రీకాంత్, రామకృష్ణ, కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.


స్వామి కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు


పూజలో పాల్గొన్న గొట్టిపాటి ఝాన్సీ

ఇంకొల్లు నుంచి గుంటూరుకు బస్సు

ఇంకొల్లు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు నుంచి గుంటూరు వెళ్లేందుకు బస్సు లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని పలువురు ఆర్టీసీ రీజియన్ అధికారికి విన్నవించారు. దీనిపై స్పందించిన గుంటూరు ఆర్‌ఎం రవికాంత్ పల్లె వెలుగు బస్సు సర్వీసును నడుపుతామని హామీ ఇచ్చారు. బస్సు లేకపోవడంతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను గుంటూరు ఆర్టీసి రీజియన్ అధికారికి పలువురు విన్నవించగా ఆయన స్పందించారు. మంగళవారం నుంచి బస్సు సర్వీసు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఇంకొల్లు నుంచి ఉదయం 8 గంటలకు, సాయంత్రం 5 గంటలకు బస్సు బయలుదేరుతుందని మండల ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు మోహనకృష్ణ తెలపారు. అక్టోబరు చివరిలోగా జిల్లా కేంద్రం బాపట్ల నుంచి కూడా ఇంకొల్లుకు ఒక సర్వీసు నడపనున్నట్లు తెలిపారు.

ఆంధ్రకేసరి వర్సిటీ టీంకు 8 మంది ఎంపిక

వేటపాలెం(చీరాల), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రకేసరి యూనివర్సిటీ బాల్‌బాడ్మింటన్ టీం ఎంపికకు కొత్తపేట రావి సుబ్బారాయుడు, జయలక్ష్మి ఇండోర్ స్టేడియంలో సోమవారం సెలక్షన్స్ జరిగాయి. అంతరకళాశాలల నుంచి హాజరైన 30 టీంల నుంచి 8 మందిని వర్సిటీ టీంకు ఎంపిక చేశారు. ఆ టీం ఈ నెల 25న చెన్నై ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో జరిగే పోటీలలో పాల్గొంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బీబీహెచ్ విద్యా సంస్థల వైస్ ప్రెసిడెంట్ కె.ఏకాంబరేశ్వరబాబు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సీహెచ్ వాసుదేవరావు, యూనివర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దేవి వరప్రసాద్, సెలక్షన్ కమిటీ మెంబరు సాయి సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ, బీబీహెచ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆదిలక్ష్మి, క్రీడాకులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

వేటపాలెం(చీరాల), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ చీరాల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.జాన్‌థామస్ పర్యవేక్షణలో సోమవారం 36 బృందాలు వేటపాలెంలో విద్యుత్ మీటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం 3,119 సర్వీసులను తనిఖీ చేశారు. అందులో 76 సర్వీసులు అధికలోడు వినియోగిస్తున్నట్లు గుర్తించి వాటికి రూ.3,76,200 అపరాధ రుసుము వేశామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వేటపాలెం, చీరాల, పర్చూరు డీఈఈలు జె.శ్రీనివాసులు, బి. హరిప్రసాదరావు, ఎస్.రమేష్, చీరాల, వేటపాలెం మండలాల ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల అందజేత

అద్దంకిటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండలోని వృద్ధుల ఆశ్రమంలోని వృద్ధులకు డాక్టర్ హేమ మాధురి దుప్పట్లు, పండ్లు అందజేశారు. సోమవారం కాకానిపాలెం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మేకా హేమామాధురి తన తల్లి శాంత జ్ఞాపకార్థం శ్రీరామా వృద్ధాశ్రమంలో దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బందితో ఆశ్రమ నిర్వాహకులు రంగయ్య పాల్గొన్నారు.

అధైర్య పడకండి..అండగా ఉంటాం

కరణం వెంకటేష్

వేటపాలెం(చీరాల), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : అధైర్యపడకండి.. అండగా ఉంటామని వైసీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ శ్రీను కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఇటీవల అనుమానాస్పదంగా మృతిచెందిన పులి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను సోమవారం వెంకటేష్ పరామర్శించారు. అనంతరం ఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. పోలీసులు విచారణను వేగవంతం చేయాలన్నారు. అంతకు ముందు బాపట్ల జిల్లా వైసీపీ అధ్యక్షునిగా మాజీ మంత్రి మేరుగ నాగార్జున ప్రమాణ స్వీకారంలో పాల్గొన్నారు. అతని వెంట వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


పరామర్శిస్తున్న వెంకటేష్

రేపు మండల సర్వసభ్య సమావేశం

పంగులూరు, అక్టోబరు, 21 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 23వ తేదీ బుధవారం ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో కె.స్వరూపారాణి తెలిపారు. ఎంపీపీ తేళ్ల నాగమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ప్రభుత్వ కార్యాలయం వరకు సీసీ రోడ్డు

ఇంకొల్లు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : గంగవరం ఆర్అండ్‌బీ రహదారి నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు సీసీ రోడ్డు మంజూరైందని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలపారు. అధ్వానంగా ఉన్న మట్టి రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు అనుమతి లభించినట్లు తెలిపారు. పల్లెపండుగ కార్యక్రమంలో 150 మీటర్ల పొడవున ఉన్న ఈ దారిలో నెలరోజుల్లో సీసీ రోడ్డును నిర్మిస్తామని తెలిపారు.

నేటి నుంచి ఆధార్ క్యాంప్‌లు

అద్దంకిటౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అద్దంకి మండలంలోని ఆయా సచివాలయాలల్లో ఈ నెల 22వ తేదీనుంచి 25వ తేదీ వరకు ఆధార్ క్యాంప్‌లను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బత్తిని సింగయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22వ తేదీన చక్రాయపాలెం, శింగరకొండపాలెం, ధేనువకొండ సచివాలయాలల్లో, 23న వెంపరాల, చిన్నకొత్తపల్లి, కొటికలపూడి, 24న ఉప్పలపాడు, కలవకూరు, తిమ్మాయపాలెం, 25వ తేదీన ధర్మవరం, జార్లపాలెం, నాగులపాడు సచివాలయాల పరిధిలో ఆధార్ క్యాంప్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. కొత్త ఆధార్ నమోదుతో ఆధార్ తిసుకొని పదేళ్ల దాటిన వారికి బయోమెట్రిక్ అప్‌డేట్, అడ్రస్ మార్పులు, వయస్సు, పేరు మార్పు, ఫోన్ నెంబర్ అప్‌డేట్, ఐదేళ్లలోపు చిన్నారులకు ఆధార్ కార్డుల జారీ వంటి సేవలను అందించడం జరుగుతుందని ఆయా గ్రామాల పరిధిలోని ప్రజలు ఈ అవకాశాలను సద్వినియోగపర్చుకోవాలని ఎంపీడీవో తెలిపారు.

నేటి నుంచి గ్రామసభలు

పంగులూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రీసర్వే జరిగిన గ్రామాలలో తలెత్తిన సమస్యల పరిష్కారానికి నేటి నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు మండల తహశిల్దార్ పోపూరి శింగారావు తెలిపారు. 22 మంగళవారం రేణంగివరం, 24న తూర్పు కొప్పెరపాడు, 26న కశ్యాపురం, 29న కోటపాడు, నవంబరు 1న అలవలపాడు, 2న చందలూరు గ్రామాలలో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు శింగారావు తెలిపారు. రీ సర్వే ప్రక్రియలో జరిగిన పొరపాట్లను సవరించేందుకు ఈ సభలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సభలలో మండల తహసీల్దార్‌తో పాటు సర్వేయర్, రీసర్వే డీటీ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారి పాల్గొంటారని తెలిపారు. రైతులు రీసర్వేలో తలెత్తిన భూసమస్యల పరిష్కారానికి అర్జీలు అందచేసి తమ సమస్యలు పరిష్కరించుకోవాలని తహశిల్దార్ శింగారావు కోరారు.

యద్దనపూడి : రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. గతంలో మండలంలో రెవెన్యూ అధికారులతో రీసర్వే జరిగిన గ్రామాలలో రైతులు, భూముల యజమానుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 23వ తేదీ బుధవారం నుంచి మండలంలోని నాలుగు గ్రామాలలో గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమస్యలు ఉన్నవారు అర్జీలు అందజేస్తే పరిష్కరిస్తామన్నారు. 23న గన్నవరం, 24న వింజనంపాడు, 25న జాగర్లమూడి, 26వ తేదీన యద్దనపూడిలో సభలు జరుగుతాయని తెలిపారు.

చిత్రలేఖనంలో చీరాల విద్యార్థినికి జిల్లాస్థాయి అవార్డు


ఈపూరుపాలెం(చీరాలటౌన్), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ దినోత్సవంగా నిర్వహించిన జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీల్లో ఈపూరుపాలెం బాలికోన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని మణిచందన రెండవ బహుమతి సాధించింది. ఈక్రమంలో సోమవారం కలెక్టర్ వెంకటమురళి ద్వారా అవార్డును అందుకుంది. దీంతో పలువురు ఆమెను ప్రశంసించారు.

చిన్నారులకు గొడుగుల పంపిణీ

పర్చూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలం కొమర్నేనివారిపాలెంలోని ఎంపీపీయూపీ పాఠశాలలోని చిన్నారులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచితంగా గొడుగులను పంపిణీ చేశారు. వానలు కురుస్తుండడంతో పాఠశాలకు వేళ్లేందుకు రొటేరియన్ నాగబైరు శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో సమకూర్చిన గొడుగులను క్లబ్ ప్రతినిధులు అందజేశారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు స్వచ్ఛమైన మంచినీటిని అందించేందుకు ఇప్పటికే ఆర్వో ప్లాంట్‌లను కూడా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్, కార్యదర్శి కోమటి అంజనేయులు, పంబి సదానందరెడ్డి, పోలిశెట్టి చంద్రశేఖరరావు, గ్రామ సర్పంచ్ మున్నంగి వెంకటసుబ్బయ్య, క్లబ్ సిబ్బంది రామకృష్ణ పాల్గొన్నారు.


గొడులతో చిన్నారులు

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
మంగళవారం 22 అక్టోబరు 2024



ఏసీలు, ఈవోలపై సస్పెన్షన్ ఎత్తివేత

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : దేవదాయ ధర్మాదాయ శాఖలో ఇద్దరు ఏసీలు, ముగ్గురు ఈవోలపై కూటమి ప్రభుత్వం సస్పెన్షన్‌ను ఎత్తివేసింది. సహాయ కమిషనర్లు వి.గిరికృష్ణ, డబ్బుగుంట వెంకటేశ్వర్లు, ఈవోలు, బి.మల్లికార్జున్‌రెడ్డి, జానకమ్మ, కుండా వరప్రసాద్‌లను సస్పెండ్ చేస్తూ జూలై 30వ తేదీన ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో ఈ సస్పెన్షన్‌ను తొలగించినట్లు తెలిసింది. ఈ ఐదుగురికి త్వరలోనే పోసింగ్స్ ఇస్తారని సమాచారం.



రాళ్లపాడు : పాత స్పిల్‌వే గేట్ల నుంచి లీకవుతున్న నీరు

ప్రమాద ఘంటికలు

సోమశిల, కండలేరు జలాశయాల వద్ద ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. రెండేళ్లక్రితం సంభవించిన వరదలకు సోమశిల దిగువప్రాంతం పూర్తిగా దెబ్బతిని డేంజర్ జోన్‌గా మారింది. ప్రమాదల నివారణతోపాటు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన యంత్రాంగం కనుకు వహిస్తోంది. అలాగే రాళ్లపాడు ప్రాజెక్టులోని ఏడు గేట్ల నుంచి నీరు లీకేజీ అవుతోంది. వెంటనే డ్యాం ఇంజనీర్లు స్పందించకపోతే వరద నీరంతా వృథా అవుతాయని రైతాంగం గగ్గోలు పెడుతోంది.

6



సోమశిల దిగువున కనిపించని హెచ్చరిక బోర్డు

మా ఇళ్ల వద్ద మద్యం వద్దు!

"మా ఇళ్ల వద్ద మద్యం దుకాణం ఏర్పాటు చేయనీయకండి అంకుల్. మీకు పుణ్యముంటది.' అంటూ నెల్లూరు నగరంలో విద్యార్థులు రోడ్డెక్కారు. వీరికితోడుగా మహిళలు, వృద్ధులు కూడా ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేశారు. చిల్డ్రన్స్‌పార్కు నుంచి హైవే మీదుకు వెళ్లే రహదారిపై వీరు ఆందోళన చేపట్టడంతో వాహన రాకపోకలు స్తంభించాయి. చివరకు ఎక్సైజ్ అధికారులు నచ్చచెప్పడంతో వారు శాంతించారు. ఇందుకూరు పేటలోనూ మద్యం షాపు ఏర్పాటును నిరసిస్తూ ఆందోళన జరిగింది.

8



ప్లకార్డులు చేతబట్టి నిరసనలో పాల్గొన్న విద్యార్థులు

రబీ సాగుకు సన్నద్ధం 6



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ఆనం, కలెక్టర్ ఇతర ఉన్నతాధికారులు

అమరులారా మీసేవలు మరువలేం!

విధినిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరులను స్మరిస్తూ సోమవారం జిల్లావ్యాప్తంగా పోలీసులు భారీ ర్యాలీలు నిర్వహించారు. నెల్లూరులోని పోలీస్‌కవాతు మైదానంలో అమరవీరుల స్థూపం వద్ద రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ ఆనంద్, జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జరిగిన ర్యాలీలో పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా విద్యార్థులతో కలిసి పోలీసులు ప్రదర్శనలు నిర్వహించారు.

6

మరో 8 స్టాక్‌పాయింట్లు

- ఇప్పటికే మూడు చోట్ల ఇసుక అమ్మకాలు
- రీచ్‌లలోకి వెళ్లేందుకు ర్యాంపులు
- వారంలో అన్నిచోట్లా యార్డులు

జిల్లా వాసులకు ఇసుక కష్టాలు తీరనున్నాయి. ఈ నెల 15న పర్యావరణ అనుమతులు లభించడంతో వీలైనన్ని రీచ్‌లను ప్రారంభించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే మూడు ప్రాంతాల్లో స్టాక్ పాయింట్ల ద్వారా ఇసుకను విక్రయిస్తున్నారు. అదనంగా మరో 8 చోట్ల స్టాకుపాయింట్లు ఏర్పాటు చేయనున్నారు. అయితే, ఆన్‌లైన్‌తోపాటు నేరుగా స్టాక్ పాయింట్‌కు వెళ్లి ఇసుకను బుకింగ్ చేసుకొని తరలించుకోవచ్చు.

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇప్పటికే మూడు ప్రాంతాలతోపాటు మినగల్లు, ముదివర్తిపాళెం, పల్లిపాడు, విరువూరు ప్రాంతాల్లో రీచ్‌లకు సమీపంలో స్టాక్ యార్డులను ఏర్పాటు చేయనున్నారు. అలాగే, నెల్లూరు నగర ప్రజల కోసంగా మరో నాలుగు ప్రాంతాల్లో పెన్నానది సమీపంలోని భగత్ సింగ్‌కాలనీ, బొడిగాడితోట ప్రాంతం, దీనదయాళ్ నగర్, పాత మున్సిపల్ కార్యాలయం వద్దనున్న పోర్లుకట్ట ప్రాంతాల్లో స్టాక్ పాయింట్ల ఏర్పాటుకు ఇరిగేషన్, రెవెన్యూ, మైనింగ్ శాఖలు సిద్ధం చేస్తున్నాయి. ఇప్పటికే భగత్‌సింగ్ కాలనీ ప్రాంతంలోని పెన్నానదిలోకి



ఇసుకను బయటకు తీసుకొచ్చేందుకు అవసరమైన ర్యాంపు (రోడ్డు) పనులు జోరుగా సాగుతున్నాయి. వారం రోజుల్లో పూర్తిస్థాయిలో 11 స్టాక్ పాయింట్‌లను ప్రారంభించేందుకు అధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు.

● ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లకు ఉచితం

పేదలకు ఉచిత ఇసుకను అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. ఇప్పటివరకూ ఎడ్లబండ్లతో మాత్రమే ఎక్కడ నుంచైనా ఇసుకను ఉచితంగా తీసుకొని వెళ్లేందుకు అనుమతి ఉన్నది. తాజాగా ట్రాక్టర్లకు కూడా అనుమతి ఇస్తూ నిర్ణయం తీసుకొన్నారు. ఎవరైనా తమ సొంత అవసరాల కోసం కూలీలను పెట్టుకొని ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో ఇసుకను తీసుకొని వెళ్లవచ్చు. స్టాక్ పాయింట్ ఉన్న ప్రాంతాల్లో కాకుండా మిగతా ప్రాంతాల్లో ఇసుకను తరలించుకోవచ్చు. అయితే, ఇందుకు సంబంధించి పూర్తి మార్గదర్శకాలు వెలువడాల్సి ఉంది.

త్వరలోనే రీటెండర్లు పిలుస్తాం


జిల్లాలో ఇప్పటివరకు ఉన్న మూడు స్టాక్ పాయింట్లతోపాటు మరో 8 స్టాక్ పాయింట్ల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించాము. త్వరలోనే వీటికి టెండర్లు పిలుస్తాము. నెల్లూరులో నాలుగు ప్రాంతాల్లో స్టాక్ పాయింట్‌లను ఏర్పాటు చేస్తున్నాము. ప్రజలకు వీలైనంత ఇసుకను అందుబాటులో ఉంచేలా అన్ని చర్యలు చేపడుతున్నాము.

- చంద్రశేఖర్, మైనింగ్ డీడీ

సాగునీటి సంఘాల ఎన్నికలు షురూ!

నోటిఫికేషన్ విడుదల చేసిన అధికారులు

40 రోజుల్లో పూర్తి చేసేలా ప్రణాళిక








వ్యవసాయంలో కీలకమైన సాగునీటి సంఘాల ఎన్నికలకు సమయం ఆసన్నమైంది. రైతులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్న ఈ ఎన్నికల నోటిఫికేషన్‌ను జలవనరుల శాఖ ఉన్నతాధికారులు సోమవారం విడుదల చేశారు. 40 రోజుల్లో ఎన్నికలు పూర్తి చేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. నవంబరు 29వ తేదీన ప్రాజెక్టు కమిటీల ఎన్నికతో ఈ ప్రక్రియ ముగుస్తుంది. ఈ ఎన్నికల నిర్వహణకు అవసరమైన రెవెన్యూ సిబ్బందిని కలెక్టర్ నామినేట్ చేయనున్నారు. ఆ తర్వాత ఆయా సంఘాల పరిధిలో ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తారు. మేజర్ ఇరిగేషన్ ప్రాంతాల్లోని కమిటీల్లో ఆరు నుంచి 12 మంది సభ్యులు, మైనర్ ఇరిగేషన్ ప్రాంతాల్లోని కమిటీల్లో గరిష్ఠంగా ఆరుగురు సభ్యులుగా ఎన్నికకావచ్చు. దీంతో గ్రామాల్లో సందడి మొదలైంది. సార్వత్రిక ఎన్నికలను తలపించేలా సాగునీటి సంఘాల ఎన్నికలు జరుగుతుంటాయి. ప్రస్తుతం రూ.5 లక్షల వరకు పనులను సాగునీటి సంఘాలు ఎటువంటి టెండర్లు లేకుండా చేయవచ్చు. ఈ మొత్తాన్ని రూ.10 లక్షల వరకూ పెంచుతారన్న ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆశావాహులు ఎక్కువయ్యారు.

● నాడు గాలికొదిలేశారు

సాగునీటి సంఘాలకు చాలా కాలం నుంచి ఎన్నికలు జరగలేదు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వంలోనూ ఎన్నికలకు ఇబ్బందులు ఉండడంతో అప్పటి ప్రభుత్వం రైతు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రతీ నీటి సంఘానికి నామినేటెడ్ కమిటీని నియమించింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నీటి సంఘాలను గాలికొదిలేసింది. టీడీపీ ప్రభుత్వం నియమించిన కమిటీలను రద్దు చేసి ఆ బాధ్యతలను ఇరిగేషన్ ఇంజనీర్లకు అప్పగించింది. కమిటీలను రద్దు చేసినంత స్పీడు కొత్త కమిటీలను నియమించడంలో వైసీపీ ప్రభుత్వం చూపించలేదు. ఐదేళ్లపాటు అటు ఎన్నికలు జరపక, ఇటు నామినేటెడ్ కమిటీలను నియమించకుండా సాగును నిర్లక్ష్యం చేసింది. అదే సమయంలో కాలువలపై కీలకంగా వ్యవహరించే లస్కర్లను కూడా తొలగించడంతో రైతాంగం పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

● జిల్లాలో ఐదు పీసీలు, 13 డీసీలు, 765 డబ్ల్యూఏలు ● నీటి యాజమాన్యంలో పెరగనున్న బాధ్యత ● రాజకీయ వర్గాల్లో మొదలైన సందడి

నెల్లూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి యాజమాన్యంలో నీటి సంఘాలది కీలకపాత్ర. ఆయా గ్రామాలు, కాలువల పరిధిలో నీటి వృథా జరగకుండా ప్రతీ ఎకరాకు నీటిని అందించేలా ఈ సంఘాలు కృషి చేస్తుంటాయి. గ్రామ, మండల స్థాయిలో సాగునీటి సంఘాల పాలకవర్గాలకు విశిష్ట గుర్తింపు ఉంటుంది. వైసీపీ ప్రభుత్వంలో ఎన్నికలు నిర్వహించకపోగా కనీసం నామినేటెడ్ కమిటీలను కూడా నియమించలేదు. రైతాంగం అవస్థలను గమనించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సాగునీటి సంఘాల ఎన్నికలపై దృష్టి పెట్టింది. ప్రస్తుతం ఈ కమిటీలన్నింటికీ ఇరిగేషన్ అధికారులే ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో రెండు మేజర్ ప్రాజెక్టు కమిటీలు(పీసీ) సోమశిల, పెన్నా డెల్టాలు ఉన్నాయి. ఈ రెండింటికి సోమశిల ఎస్ఈ, రెగ్యులర్ ఇరిగేషన్ ఎస్ఈలు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. అలానే మరో మూడు మీడియం ప్రాజెక్టు కమిటీలు గండిపాలెం ప్రాజెక్టు, కనుపూరు కెనాల్, స్వర్ణముఖి ఆయకట్టు సిస్టమ్ ఉన్నాయి. వీటితో పాటు 13 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు (డీసీ), 765 చిన్న తరహా సాగునీటి సంఘాలు(డబ్ల్యూఏ) ఉన్నాయి. డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఇన్‌చార్జ్‌లుగా ఉండగా, చిన్న తరహా సాగునీటి సంఘాలకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌స్థాయి అధికారులు ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు.



● పనులు చేయకుండానే బిల్లులు

నీటి సంఘం పరిధిలోని ఏ కాలువలో పనులు చేయాల్సి ఉన్నా ఆ సంఘం పాలకవర్గమే చూసుకునేది. ఈ సంఘాలకు ఆర్థిక లావాదేవీలు చేసే అధికారం కూడా ఉంది. సంఘంలోని సభ్యులంతా స్థానికులు కావడంతో వారు బాధ్యతగా వ్యవహరించేవారు. రైతులకు ఏ సమస్య వచ్చినా వెంటనే వీరి దృష్టికి తెచ్చేవారు. రైతులు చెల్లించే శిస్తును ఈ సంఘాలకు జమ చేసి తద్వారా కాలువల్లో అభివృద్ధి పను లు చేసేవారు. కానీ గడిచిన ఐదేళ్లుగా శిస్తు వసూలు చేసేవా రు కూడా లేకుండా పోయారు. ప్రస్తుతం జిల్లాలో రూ.50 కోట్ల వరకు శిస్తు వసూలు చేయాల్సి ఉంది. ఈ ప్రభావం నీటి యాజమాన్యంపై తీవ్రంగా పడుతోంది. కాలువల్లో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులను సాగు నీటి సంఘాల ద్వారా చేపడుతుంటారు. వీరంతా రైతులు కావడంతో పనులన్నీ పక్కాగా చేయించేవారు. కానీ గడిచిన ఐదేళ్లుగా ఈ సంఘాలు లేకపోవడంతో ఓఅండ్ఎం పనులను టెండర్లు ద్వారా అప్పగించారు. వీటిని బినామీల పేర్లతో దక్కించుకున్న వైసీపీ నేతలు.. పనులు చేయకుండానే బిల్లులు రికార్డు చేసుకోవడం గమనార్హం.

పారదర్శకంగా పూర్తి చేస్తాం

సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను సోమవారం విడుదల చేశాం. ప్రభుత్వం సూచించిన షెడ్యూల్ ప్రకారం పారదర్శకంగా ఎన్నికలను పూర్తి చేస్తాం. ఎన్నికల ప్రక్రియకు అవసరమైన రెవెన్యూ సిబ్బందిని కలెక్టర్ నామినేట్ చేస్తారు. ఆ తర్వాత ఓటర్ల జాబితా రూపొందిస్తాం.

- దేశే నాయక్, ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ

బటన్ నొక్కి.. విద్యార్థులను తొక్కి!

- అందని ఫీజు రీయింబర్స్‌మెంట్ ● ఫీజుల కోసం కాలేజీ నిర్వాహకుల ఒత్తిళ్లు
- అవస్థల్లో ఉన్నత విద్య విద్యార్థులు ● చెల్లింపులపై రాష్ట్ర ప్రభుత్వ దృష్టి

సుమారు రూ.90 కోట్లు పెండింగ్

కావలికి చెందిన ఓ రైతు కుమార్తె ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతోంది. ఇటీవల పరీక్షలు జరిగాయి. రూ.62వేలు ఫీజు చెల్లిస్తేనే పరీక్షకు హాజరు కానివ్వమని యాజమాన్యం తేల్చి చెప్పింది. ఆ విద్యార్థినికి విద్యాదీవెన కింద సొమ్ము జమ కాలేదు. దీంతో ఏం చేయాలో అర్థం కాక అప్పుచేసి మరీ ఫీజు చెల్లించారు.

ఇది ఈ ఒక్క విద్యార్థిని పరిస్థితేకాదు. జిల్లాలో అత్యధికశాతం మంది విద్యార్థులు ఇలాంటి కష్టాలే ఎదుర్కొంటున్నారు.

ఇంజనీరింగ్, డిగ్రీ, డిప్లొమో, పీజీ, ఇతర కోర్సులు చదివే విద్యార్థులు జిల్లావ్యాప్తంగా 35 వేల మందికిపైగా ఉన్నారు. సాధారణ, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులే ఎక్కువ మంది ఉండటంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతిస్తామని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం చెబుతుండటంతో విద్యార్థులు నలిగిపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పక్కనపెట్టి విద్యాదీవెన, వసతి దీవెన పథకాల కింద నగదు అందచేస్తామని చెప్పి విద్యార్థులను అవస్థల కూపంలోకి నెట్టేసింది. అనుకున్న సమయానికి నగదు అందక వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, కాపు, ముస్లిం, క్రిస్టియన్ వర్గాలకు చెందిన విద్యార్థులకు వారు కళాశాలల్లో చెల్లించే రుసుము మేరకు సొమ్ము అందించాలి. 75 శాతం హాజరు ఉన్నవారికి తప్పనిసరిగా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి. కోర్సు ఆధారంగా ఏడాదికి నాలుగు విడతల్లో అందచేస్తారు. 2023-24 విద్యా సంవత్సరంలో నాలుగు విడతల్లో రూ.90కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం చివరి సమయంలో నిధులు విడుదల చేస్తున్నామని బటన్ నొక్కినా నేటికీ విద్యార్థుల ఖాతాల్లో నగదు మాత్రం జమకాలేదు. వసతి దీవెన కింద రుసుముతోపాటు మెస్ చార్జీలు, పుస్తకాల కొనుగోలు, ఇతర అవసరాల కోసం నగదు చెల్లించాలి. ఏడాదికి రెండుసార్లు ఖాతాల్లో వేస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. ఐటీఐ విద్యార్థులకు రూ.10వేలు, డిప్లొమోకు రూ.15వేలు, డిగ్రీ, పీజీ, ఇతర కోర్సులు చేసేవారికి రూ.20వేలు చెల్లించాలి. అయితే గడిచిన రెండు విద్యాసంవత్సరాల్లో ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు.

● యాజమాన్యాల ఒత్తిడి

జిల్లాలో అత్యధికశాతం మంది విద్యార్థులు ప్రైవేట్ విద్యాసంస్థల్లోనే చదువుకుంటున్నారు. తప్పనిసరిగా ఫీజులు చెల్లిస్తేనే హాల్‌టికెట్లు ఇస్తామని, ధ్రువపత్రాలు అందచేస్తామని యాజమాన్యాలు ఖచ్చితంగా చెబుతున్నాయి. దీంతో విద్యార్థులు తమ సర్టిఫికెట్లు కూడా తెచ్చుకోలేక, కుటుంబ సభ్యులను నగదు అడగలేక మథన పడుతున్నారు. కొందరైతే అప్పులు చేసి మరీ ఫీజులు చెల్లిస్తున్నారు. దీనిపై కూటమి ప్రభుత్వమైన నిర్ణయం తీసుకుని తమ బిడ్డలకు న్యాయం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

- నెల్లూరు (విద్య)



● కూటమి ప్రభుత్వం కసరత్తు

నేరుగా కాలేజీలకే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులపై విధివిధానాలను సిద్ధం చేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గందరగోళంగా మారిన ఈ పథకాన్ని గాడిన పెట్టేందుకు మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు అధికారులు చర్యలు ప్రారంభించారు. ఎన్నికల కోడ్ సాకుతో విద్యార్థులకు గత మార్చిలో బటన్ నొక్కినా బ్యాంకు ఖాతాలకు విద్యాదీవెన నగదు చేరలేదు. దీంతో ప్రతి విద్యార్థి సగటున రూ.50వేల నుంచి లక్షన్నర వరకు ఫీజులు బకాయిలు ఉండిపోయాయి. పాత ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్నే అమలు చేసేందుకు అవసరమైన విధివిధానాలను రూపొందిస్తున్నారు. త్వరలోనే విద్యార్థులకు న్యాయం జరుగుతుందని, ఎలాంటి ఆందోళన చెందవద్దని కళాశాలల ప్రతినిధులు చెబుతున్నారు.

సమాజానికి పోలీసు వ్యవస్థ వెన్నెముక

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- పోలీసు అమరవీరులకు ఘన నివాళి

నెల్లూరు (క్రైం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : సమాజానికి పోలీసు వ్యవస్థ వెన్నెముకని, దేశం లోపల ఉన్న ఇంటర్నల్ టెర్రరిజం, నక్సలిజం, సంఘ విద్రోహశక్తులను అణచివేయడంలో పోలీసుల పాత్ర కీలకమని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్ వద్ద ఎస్పీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో జరిగిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. అంతకుముందు పోలీసు కవాతు మైదానంలో అమరవీరులకు నివాళులు అర్పించారు. మంత్రి మాట్లాడుతూ సమాజ శ్రేయస్సే ఊపిరిగా ప్రజల శ్రేయస్సు కోసం ప్రాణాలనే పణంగా పెట్టిన యోధులకు వెలకట్టలేని మీ త్యాగాలకు నా హృదయాంజలి అర్పిస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ ఓ ఆనంద్ మాట్లాడుతూ ప్రజా రక్షణకు పోలీసుల సేవలు స్ఫూర్తిదాయకమని, అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమంటూ కొనియాడారు. ఎస్పీ మాట్లాడుతూ కర్తవ్య నిర్వహణలో ప్రమాదాలకు తలవంచకుండా, ప్రాణాలను లెక్క చేయకుండా, నింగి సైతం మీకు వంగి సలాం చేస్తోందని, నిన్ను తనలో దాచుకున్నందుకు నేలతల్లి గర్విస్తోందని, విధి నిర్వహణలో మీ బలిదానాలు వెలకట్టలేనివని, ఓ వీర జవాన్‌లారా మీకు మా నీరాజనాలు' అంటూ శ్రద్ధాంజలి ఘటిస్తూ మాట్లాడారు. జిల్లాలో అమరులైన పోలీసు కుటుంబాలకు ఆర్థిక సహాయ చెక్కులు, జ్ఞాపికలను మంత్రి ఆనం అందజేశారు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, మేయర్ పొట్లూరి స్రవంతి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.


అమరులైన పోలీసుల కుటుంబసభ్యులతో మంత్రి ఆనం,


ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

నగరంలో ర్యాలీ

అమరవీరుల సంస్మరణ ర్యాలీని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. పోలీసు పెరేడ్ మైదానం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు అమర వీరులకు జోహార్లు అర్పిస్తూ ఈ ర్యాలీ సాగింది. ర్యాలీలో అదనపు ఎస్పీలు సీహెచ్ సౌజన్య, శ్రీనివాసరావు, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


జలదంకి రోడ్డుకు మరమ్మతు చేయిస్తూ...

రెండు దశాబ్దాల క్రితం ఇద్దరు వ్యక్తులతో మొదలైన 'మన ఊరు పిలుస్తోంది' ట్రస్ట్ ఇప్పుడు నూటయాభై మందికి చేరుకుంది. గ్రామంలోని యువత, విద్యావంతులు, బయటిప్రాంతంలో పనిచేసే ఉద్యోగులు, వ్యాపారులను ప్రోత్సహించి ట్రస్ట్ ఏర్పాటులో కీలకమయ్యేలా చేశారు. విద్యార్థుల మొదలు గ్రామస్థుల కోసం నిత్యం ఏదో ఒక సేవ చేస్తూ ట్రస్ట్ సభ్యులు ముందుకు కదులుతున్నారు. అలాగే, సర్పంచు, సాగునీటి సంఘాల ఎన్నికల్లోనూ కీలకంగా వ్యవహరించి ఏకగ్రీవం అయ్యేల రాజకీయ పార్టీల నేతలను ఒప్పిస్తున్నారు. అంతటి మహోన్నత సేవలు అందిస్తున్న ఆ ట్రస్ట్ గురించి తెలుసుకోండి.

\- జలదంకి (ఆంధ్రజ్యోతి)

అభివృద్ధి ట్రస్ట్‌మి!

- లింగరాజు అగ్రహారంలో ఇద్దరు ఉద్యోగులతో మొదలై 150 మందికి చేరిక
- విద్య, వైద్యంతోపాటు గ్రామాభివృద్ధే లక్ష్యం

ఆదర్శం aadarsham

జలదంకి మండలంలోని లింగరాజు అగ్రహారానికి చెందిన ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు గొట్టిపాటి మాల్యాద్రి, గాలి శ్రీనివాసులు 20 ఏళ్ల క్రితం అప్పటి కలెక్టర్ ఆదేశాలతో డిప్యుటేషన్‌పై సాక్షరభారత్, జనవిజ్ఞాన వేదిక తరఫున పని చేశారు. ఆ సమయంలో వారి మదిలో పుట్టిన ఆలోచనే మన ఊరు పిలుస్తోంది. గ్రామాభివృద్ధి కోసం ట్రస్ట్ ఏర్పాటుకు నాంది పలికింది. ఇంతింతై.. వటుడింతై అన్నట్టుగా గ్రామానికి చెందిన పలు రకాల ఉద్యోగ వ్యాపారాల్లో స్థిరపడిన వారితో 150 మందితో సభ్యులను తయారు చేశారు. ఈ ట్రస్ట్‌కు బీజం పడిన మొదట్లో గ్రామ ప్రభుత్వ పాఠశాలలో గదుల కొరతను గమనించారు. అదనపు తరగతి గదుల కింద పూరిపాకను ఏర్పాటు చేశారు. ఇలా మొదలై నేడు పలురకాల అభివృద్ధి చేస్తున్నారు. ఎంత ఎదిగినా తల్లిదండ్రులు, జన్మస్థలాన్ని మరువకుండా తమకు చేతనైనంత సాయం చేస్తూ ఇతరులకు స్ఫూర్తి నింపుతున్నారు.

ట్రస్ట్ సభ్యులు వీరే!

ట్రస్ట్ ఫౌండర్లు, సభ్యులు గాలి శ్రీనివాసులు కుట్టుబోయిన లక్ష్మీనారాయణ గొట్టిపాటి మురళీ, బెల్లం మధు, గాలి చైతన్య, కొర్రపాటి ప్రమోద్, గొట్టిపాటి రమేష్, నంబూరి మస్తానయ్య గొట్టిపాటి మాల్యాద్రి, యనమల క్రిష్ణయ్య, తల్లపనేని చెన్నకేశవ, మట్టెపు క్రిష్ణయ్య, గొట్టిపాటి రామ్మూర్తి, గాలి క్రిష్ణ, గాలి మధు, కొర్రపాటి మహేష్, గాలి మహేంద్ర, గొట్టిపాటి అశోక్, దావులూరి మధు, సర్పంచ్ మంగల తిరుమల, మాజీ జడ్పీటీసీ యనమల శ్రీనివాసులు ఉన్నారు.


ట్రస్ట్ ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో గ్రామస్థులు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

సేవా కార్యక్రమాలివే..

- యువతను ప్రోత్సహించేందుకు క్రికెట్ జట్ల ఏర్పాటు, పండుగల సమయంలో వివిధ ప్రాంతాల్లో జరిగే టోర్నీల్లో ఆడించడం. క్రికెట్ కిట్ల అందజేత
- గ్రామంలో వైద్యశిబిరాలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇప్పిస్తున్నారు. అలాగే శస్త్రచికిత్స అవసరం అయ్యే వారికి ప్రైవేటు వైద్యశాలలను సంప్రదించడం. రక్తదాన శిబిరాలు నిర్వహించడం.
- గ్రామంలో రాజకీయ కక్షలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు ఆయా పార్టీల నాయకులతో చర్చలు జరిపి గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పడం.
- సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం అయ్యేలా చూడటం
- గ్రామం నుంచి జలదంకి, కావలికి వెళ్లే రోడ్లకు మరమ్మతులు చేయించడం. ఇందుకు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను సంప్రదించి ట్రస్ట్ ద్వారా ఆర్థికసాయం చేయడం.
- గ్రామీణ ప్రాంత ప్రజలకు రక్తదానంతో కలిగే ప్రయోజనాలను వివరించడం
- అంటువ్యాధులు ప్రబలకుండా వీధులు శుభ్రంగా ఉండేలా పారిశుధ్యం- పరిశుభ్రతపై అవగాహన పెంచడం. ఇది నిరంతర ప్రక్రియ
- ఆలయాల అభివృద్ధికి ట్రస్ట్ తమ వంతు సహాయసహకారాలు అందజేయడం.
- ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ట్రస్ట్ వారితో కలసి పనిచేయడం. సర్పంచ్‌గా ఎవరు ఎన్నికైతే వారితో కలిసి అభివృద్ధిలో భాగస్వాములవడం, పనులకు సహాయకారిగా ఉండటం.
- పంటలకు తెగుళ్లు సోకితే వ్యవసాయ శాస్త్రవేత్తలను పిలిపించి రైతులకు సలహాలు ఇప్పించడం. తెగుళ్ల అరికట్టేందుకు మందులు పిచికారీ చేయించడం. అధిక మోతాదులో ఎరువులు, పురుగు మందులు వాడకుండా అవగాహన కల్పించి అన్నదాతలకు పెట్టుబడి ఖర్చులు తగ్గేలా చేయడం.
- సాగునీటి చెరువులు, కాలువలకు సోమశిల జలాలు వచ్చేలా అధికారులను సంప్రదించి సాగునీటి ఇబ్బందులు లేకుండా ట్రస్ట్ పనిచేస్తోంది.
- ఉపాధిహామీ పనులను పేదలకు కల్పించడం. పొలాలకు దారులు వేయించడం.
- ప్రతి ఏడాది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా ఉపకరణాలు అందజేయడం. సాయంత్రం ట్యూషన్లు చెప్పించడం.
- స్వాతంత్ర్య దినోత్సవాన ఆటలు, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయడం
- గ్రామ ప్రధాన కూడళ్లలో సిమెంటు బెంచీల ఏర్పాటు
- హిందూ శ్మశానవాటికలో ముళ్లకంప, చెత్తను తొలగించి పరిశుభ్రంగా ఉంచడం
- వర్షాకాలంలో పాఠశాల ఆవరణలో నీరు నిల్వకుండా మట్టి వేసి ప్రాంగణం ఎత్తు పెంచడం
- విద్యకు దూరమైన పిల్లలను పిల్లల్ని గుర్తించి తల్లిదండ్రుల్లో అవగాహన పెంచి మరలా బడులు, కాలేజీలకు వెళ్లేలా చేయడం
- పేద విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బయట ప్రాంతాల్లో చదివే పిల్లలకు ఆర్థికసాయం చేయడం
- ఉన్నత చదువులు పూర్తి చేసిన ఉద్యోగాల కల్పనకు సహాయం
- కోచింగ్ సెంటర్ల నిర్వాహకులను సంప్రదించి ఉచితంగా శిక్షణలు ఇప్పించడం


డ్యాం ముందు ప్రమాదకర ప్రాంతం ఇది. ఇక్కడ కనిపించని హెచ్చరిక బోర్డు


బ్రిడ్జికి ఇరువైపులా కానరాని రక్షణ దిమ్మెలు


రక్షణ గోడలేని అప్రాన్... ఇక్కడ పడితే అంతే!

ప్రమాద ఘంటికలు

మోగుతున్నాయ్!

- గత వరదకు దెబ్బతిన్న 'సోమశిల'
- హెచ్చరిక బోర్డులు లేక ప్రమాదాలు

సోమశిల జలాశయం వద్ద ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. డేంజర్ జోన్ల వద్ద కనీసం సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో పర్యాటకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక్కడున్న అధికారుల తీరు విధులకు వచ్చామా? వెళ్లామా? అనే ధోరణిలో ఉందని, జలాశయ పరిసర ప్రాంతాలు, ప్రమాదాల నివారణ చర్యలపై ఏమాత్రం శ్రద్ధ వహించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత వరదలకు జలాశయం ముందు కట్టడాలు ధ్వంసమై అప్రాన్, డౌన్‌స్ట్రీమ్ ప్రాంతాలు డేంజర్ జోన్లుగా మారిన విషయం తెలిసిందే. ఆయా ప్రాంతాలలో సందర్శకులు తిరగకుండా నివారణ చర్యలు, హెచ్చరిక బోర్డులు పెట్టాలి. కానీ ఆ దిశగా పట్టించుకొన్న దాఖలాలు లేవు. అలాగే 11, 12 క్రస్ట్‌గేట్ల నుంచి నీరు సరఫరా చేసే ప్రాంతంలో ఏర్పాటు చేసిన బ్రిడ్జి రాకపోకలకు ముఖ్య ఆదారం. అలాంటి బ్రిడ్జికి ఇరువైపులా రక్షణ దిమ్మెలు తొలిగిపోయి రెండేళ్లు గడుస్తున్నా ఏర్పాటు చేయలేదు. ఈ ప్రాంతంలో 10 నుంచి 30 అడుగుల వరకు లోతు ప్రాంతాలు ఉన్నాయి. వాహనదారులు ఏమాత్రం అశ్రద్ధ వహించినా ఈ గుంతలో పడటం తథ్యం. మరోవైపు అప్రాన్‌లో అభివృద్ధి పనులు చేస్తున్న గుత్తేదారు కూడా పనులు చేసే చోట జాగ్రత్తలు తీసుకోకపోవడం గమనార్హం.

\- అనంతసాగరం (ఆంధ్రజ్యోతి)

15,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

సోమశిల జలాశయానికి ఎగువ నుంచి సోమవారం 15,200 క్యూసెక్కుల వరద వస్తోం ది. డ్యాం సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 60.011 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 50, కండలేరుకు 10,000, ఉత్తరకాలువకు 300 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

రాళ్లపాడులో నీళ్లు లీకేజీ!

ఏడు గేట్ల నుంచి నీటి వృథా

లింగసముద్రం (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టు పాత స్పిల్‌వేలోని గేట్ల నుంచి నీరు ఉధృతంగా లేకేజీ రూపంలో మన్నేరులోకి వెళుతోంది. పాత స్పిల్‌వేలో 10 సాధారణ గేట్లు, రెండు పూడు గేట్లు ఉన్నాయి. ఈ పది గేట్లలో 1, 2, 10 గేట్లు మినహా మిగిలిన ఏడు గేట్ల నుంచి నీరు లీకవుతోంది. ప్రధానంగా 6, 7, 8 గేట్ల నుంచి నీరు లీకేజీ ఎక్కువగా ఉంటోంది. ఈ విషయమై ఏఈ చంద్రమౌళి మాట్లాడుతూ గేట్ల వద్ద గడ్డి పెట్టించి లీకేజీని అరికడతామని స్పష్టం చేశారు.

పూడిక తొలగింపు

ప్రాజెక్టు కుడి ఎడమ కాలువల్లో పూడిక తీత, జంగిల్ తొలగింపునకు నోచుకోలేదు. దీంతో కాలువలకు నీరు విడుదల సమయంలో తీవ్ర ఆటంకం ఏర్పడే అవకాశం ఉంది. ఈ విషయమై ఇటీవల ప్రాజెక్టును సందర్శించిన కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు అధికారులు సమస్యను వివరించారు. దీంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సోమవారం మధ్యాహ్నం నుంచి ఎడమ కాలువ మొదటి నుంచి పూడిక తీత, జంగిల్ తొలగింపు పనులను అధికారులు చేపట్టారు. జరుగుతున్న పనులను డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ చంద్రమౌళి పరిశీలించారు. ఈ పనులు పూర్తయ్యాక కుడి కాలువ పూడికతీత, జంగిల్ తొలగిస్తామని వారు తెలిపారు.


ఎడమ కాలువలో పూడికతీత, జంగిల్ తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్



ఇలాగా కూడా చేయవచ్చా ?

ఇదేంటి... ఇలాంటి ఆక్రమణలు కూడా ఉంటాయా..? రోడ్డుపై ఉండే విద్యుత్ స్తంభంతోపాటు ట్రాన్స్‌ఫార్మర్‌ను కలిపి ఆక్రమించాడు మండలంలోని మామిడిపూడి దళితవాడకి చెందిన ఓ వైసీపీ నాయకుడు. మన ప్రభుత్వమేగా అడిగేదెవరు... అనుకున్నాడో.. ఏమో.. గతంలో ఆయన విద్యుత్ స్తంభాన్ని ట్రాన్స్‌ఫార్మర్‌తో కలిసి ఆక్రమించి ప్రహరీ గోడ కట్టేశాడు. ఈ విషయమై తాజాగా టీడీపీ నాయకులు ఎంపీడీవో నాగమణికి ఫిర్యాదు చేశారు.

\- ముత్తుకూరు (ఆంధ్రజ్యోతి)

డీఎస్సీ కోచింగ్‌కు దరఖాస్తు గడువు పొడిగింపు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోడానికి ప్రభుత్వం ఈనెల 25వ తేదీ వరకు గడువు పొడిగించిందని సాంఘీక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ బి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. కోచింగ్ తీసుకోవాలను కొనేవారు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

రేపు 'నర్సింగ్' ఎన్నికలు

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సింగ్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 23వ తేదీన జరగనున్నాయి. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ఎన్నికల ఓటింగ్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో జరుగుతాయి. ఇందులో రెండు ప్యానళ్లు తపపడుతున్నాయి.

ఒత్తిళ్లకు గురికాకుండా ఓటేయండి

- ఏపీజీఈఏ జిల్లా కార్యదర్శి రాంప్రసాద్

నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నర్సుల జిల్లా ఎన్నికల్లో అధికార, అనధికార, ఒత్తిళ్లకు గురికాకుం డా నచ్చిన ప్యానెల్‌కు ఓటు వేయాలని ఏపీజీఈఏ జిల్లా కార్యదర్శి పీవీఎస్‌టీ రాంప్రసాద్ ఒక ప్రకనటలో పేర్కొన్నారు. ఈ ఎన్నికలు రహస్య బ్యాలెట్ ద్వారా జరుగుతాయని, ప్రభుత్వ నర్సులు స్వతంత్రంగా ఓటేయవచ్చని తెలిపారు. ఈ ఎన్నికలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా నర్సులను చైతన్య పరిచామని పేర్కొన్నారు. నర్సులందరూ తప్పనిసరిగా ఎన్నికలకు హాజరై, నర్సుల సంక్షేమానికి పాటుపడే ప్యానెల్‌ను స్వేచ్ఛగా ఎన్నుకోవాలని తెలిపారు. ఓటు నర్సుల ఉద్యోగ భవిష్యత్తును నిర్దేశిస్తుందని పేర్కొన్నారు. ఎన్నికలు ప్రజాస్వామ్యయుత వాతావరణంలో స్వేచ్ఛగా జరపాలని అధికారులను కోరారు.

సాగుకు సమాయత్తం

- కరుణించిన వరుణుడు.. పుష్కలంగా సాగునీరు
- దుక్కి పనుల్లో అన్నదాతల బిజీ
- విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసిన వ్యవసాయశాఖ

నెల్లూరు (వ్యవసాయం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీ సీజన్ ప్రధానమైంది. వరి పంటకే అధిక శాతం రైతులు ప్రాధాన్యమిస్తారు. మెట్ట ప్రాంతాల్లో వేరుశనగ, మినుము, నువ్వులు, అలసంద తదితర పంటలు సాగు చేస్తారు. ఈ ఏడాది సోమశిలలో నీరు పుష్కలంగా అందుబాటులో ఉంది. దాదాపు 60 టీఎంసీల నీరు ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. సంగం, నెల్లూరు బ్యారేజి, కావలి కాలువ, సర్వేపల్లి రిజర్వాయర్, కనుపూరు కాలువ, అల్లూరు చెరువు, కండలేరు డ్యాంల ద్వారా సాగునీరు అందుతోంది. ఇప్పటికే వ్యవసాయ శాఖ అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు నివేదికలు అందజేసింది. దాదాపు 2లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం ఉండగా, 64,019 క్వింటాళ్ల మేర వరి విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇంకా 35981 క్వింటాళ్ల రాగులు, సజ్జలు, వేరుశనగ, మినుము, శనగ, మొక్కజొన్న తదితర పంటల విత్తనాలు కూడా రైతులకు అందుబాటులో ఉంచేందుకు ఏపీ సీడ్స్‌తోపాటు ప్రైవేటు డీలర్లతో వ్యవసాయశాఖ అధికారులు ఇప్పటికే సమావేశాలు నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. ఏపీ సీడ్స్ ద్వారా 12 వేల క్వింటాళ్లు, 80వేల క్వింటాళ్లు విత్తనాలు అధీకృత ప్రైవేటు డీలర్ల ద్వారా రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. 8వేల క్వింటాళ్ల విత్తనాలు మాత్రం రైతుల నుంచి రైతులు సేకరించుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

6200 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధం

జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో 6200 క్వింటాళ్ల విత్తనాలను వ్యవసాయ శాఖ అందుబాటులో ఉంచింది. ఇందులో బీపీటీ-5204 రకం 900 క్వింటాళ్లు అదేవిధంగా కెఎన్ఎం-1638 రకం 4500, ఎన్ఎల్ఆర్-34449 రకం 800 క్వింటాళ్లు ఉన్నాయి. కిలో రూ.5 సబ్సిడీతో అందిస్తున్నారు.



ఆర్ఎన్ఆర్-15048, ఎన్ఎల్ఆర్-3354 రకాలు కూడా త్వరలో అందుబాటులో ఉంచుతామని అధికారులు చెబుతున్నారు.

25,590 మెట్రిక్ టన్నుల ఎరువులు

రబీలో జిల్లాకు దాదాపుగా 2.28లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉందని వ్యవసాయశాఖ అంచనా. ప్రస్తుతం జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో 25590 మెట్రిక్ టన్నుల ఎరువులను అందుబాటులో ఉంచారు. వీటిలో 8012 మెట్రిక్ టన్నుల యూరియా, 2206 మెట్రిక్ టన్నుల డీఏపీ, 1194 మెట్రిక్ టన్నుల ఎంఒపి, 13814 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 364 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పి ఎరువులు ఉన్నాయి. రెండ్రోజుల్లో మరో 5500 మెట్రిక్ టన్నుల యూరియా, 1800 మెట్రిక్ టన్నుల డీఏపీ ఎరువులు దిగుమతి చేసుకోవడం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు

రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాం. నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని ఇప్పటికే ప్రైవేటు డీలర్లకు సూచనలు ఇచ్చాం. లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించాం కూడా. భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటల జాబితా ప్రాథమిక సేకరణ జరిగింది. పూర్తిస్థాయి జాబితా సిద్ధం చేసేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలిస్తున్నారు. నష్టపోయిన రైతులకు సబ్సిడీతో విత్తనాలు అందిస్తాము.

\- పి.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి



శివాలయంలో హుండీ చోరీకి యత్నం

మర్రిపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : నందవరం శివాలయంలో ఆదివారం రాత్రి దుండ గులు దొంగతానికి ప్రయత్నించారు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ శ్రీనివాసురావు స్థలాన్ని పరిశీలించారు.

సమాజ శ్రేయస్సే పోలీసుల లక్ష్యం

- పోలీసు అమరవీరుల ఘన నివాళి
- విద్యార్థులతో కలిసి ర్యాలీలు
- అమరుల త్యాగాలు స్మరించుకుంటూ జోహార్లు



ఆత్మకూరు: ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎస్పీ వేణుగోపాల్



కావలి: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

కావలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని డీఎస్పీ శ్రీధర్ ఆదేశాల మేరకు సోమవారం పోలీసులు విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి ట్రంకురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. పొట్టిశ్రీరాములు విగ్రహం సెంటర్‌లో మానవహారం నిర్వహించి పోలీస్ అమరవీరులకు నివాళులుగా కొంత సేపు మౌనం పాటించారు. కార్యక్రమంలో రూరల్, వన్‌టౌన్, టూ టౌన్ సీఐలు రాజేశ్వరరావు, ఎండీ ఫిరోజ్, శ్రీనివాసరావు, ఎస్ఐలు పాల్గొన్నారు.

● కొండాపురం: మండలకేంద్రంలో ఎస్ఐ ఎం.వెంకటరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఆదర్శపాఠశాల వద్ద నుండి బస్టాండు కూడలి వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు.

● జలదంకి: మండల ఎస్ఐ లతీఫున్నీసా ఆధ్వర్యంలో సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. బస్టాండు కూడలి నుండి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. శ్రీసాయి విద్యాసంస్థల అధినేత అయ్యలరెడ్డి ఎస్ఐ లతీఫున్నీసాను సన్మానించారు.

● బిట్రగుంట: సమాజ శ్రేయస్సు కోసం పని చేయడమే పోలీసుల లక్ష్యమని స్థానిక ఎస్ఐ భోజ్యా అన్నారు. మండలకేంద్రంలోని ఎస్ఆర్‌కే ప్రైవేట్ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. విశ్వనాథరావుపేట నుంచి బోగోలు బజారు కూడలి వరకు ఈ ర్యాలీ కొనసాగింది.

● ఉలవపాడు:రామాయపట్నం మెరైన్ పోలీసులు సీఐ శివన్నారాయణ ఆ ధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రామాయపట్నం మెరైన్ ఎస్సైలు ఎస్‌కే షరీఫ్, పీ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

● సంగం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ వేమారెడ్డి, ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో పోలీస్‌లు చేపట్టిన ర్యాలీని ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ ప్రారంభించారు. స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి పోలీసు అమర వీరులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఉదయగిరి రూరల్: విధి నిర్వహణలో పోలీసుల త్యాగాలు మరువలేనివని ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో విద్యార్థులు, పోలీసు సిబ్బందితో కలిసి ర్యాలీ చేపట్టి బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● దుత్తలూరులో: సిద్ధార్థ పాఠశాల విద్యార్థులు, పోలీసు సిబ్బందితో కలిసి ఎస్ఐ ఆదిలక్ష్మీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం 565 జాతీయ రహదారిపై మానవహారం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● ఆత్మకూరు: పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని డీఎస్పీ వేణుగోపాల్, సీఐ గంగాధర్ పేర్కొన్నారు. ఆత్మకూరులో పోలీసులు స్థానిక స్టేషన్ నుంచి విద్యార్థులతో కలిసి పట్టణ పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు షేక్ జిలాని, సాయి ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● ఏఎస్ పేట: ఎస్ఐ సైదులు ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ నుండి బస్టాండ్ సెంటర్, నగారా ఖానా సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

● వరికుంటపాడు: ఎస్ఐ రఘునాథ్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు, నాయకులు ఉన్నత పాఠశాల నుంచి జాతీయ రహదారి మీదుగా నినాదాలు చేస్తూ బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం మానహారం ఏర్పాటుచేసి అమరులైన పోలీసులకు నివాళులర్పించారు.

● వింజమూరు: ఎస్ఐ వీరప్రతాప్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, సుభాన్, మాధవ, పద్మారెడ్డి పాల్గొన్నారు.

● కలువాయి: స్థానిక బస్టాండు సెంటర్‌లో పోలీసు అమరవీరుల స్థూపం వద్ద రాపూరు సీఐ విజయకృష్ణ, ఎస్ఐ సుమన్, సిబ్బందితో పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 శేష గిరి రావు, వైద్యులు రాజేష్, హెచ్ఎం. అబ్బాస్ అలీ, పెంచలరావు, నాగేశ్వరావు ఉన్నారు.

● సీతారామపురం: ఎస్సై శివకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వరకు నిర్వహించారు.

బయోమెట్రిక్ ఆధారంగా ఎరువులు సరపరా చేయాలి : ఏడీఏ

కందుకూరు, అక్టోబరు 21 : (ఆంధ్రజ్యోతి) : ఆధార్ కార్డుతో రైతులకు బయోమెట్రిక్ చేయించి ఎరువులు సరఫరా చేయాలని, వాటి తాలుకా బిల్లుకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) అనసూయ ఎరువుల షాపు డీలర్లకు సూచించారు. సోమవారం కందుకూరు సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల ఎరువుల షాపు డీలర్లతో సమావేశం అయ్యారు. డీలర్లు తప్పనిసరిగా ధరల పట్టికలో లభ్యమగు ఎరువుల, నిల్వ ఎరువులు పొందుపరచాలని పేర్కొన్నారు. ప్రతి ఎరువులను నిర్ధేశించన ఎంఆర్‌పీ రేట్లకే విక్రయించాలని, ఇతర ఎరువులను లింక్ పెట్టొదన్నారు. డీలరు లైసెన్సులో ఫారం ఓ జతపరచిన తరువాతే అమ్మకాలు జరపాలని, సూచించిన నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గుడ్లూరు, లింగసముద్రం, వలేటివారిపాలెం, కందుకూరు మండలాల వ్యవసాయ అధికారులు బీ రవికుమార్ టీ అబ్రహం లింకన్, ఎం హేమంత్ భరత్‌కుమార్, వీ రాము, ఐదు మండలాల డీలర్లు పాల్గొన్నారు.

నీరు కలుషితం కాకుండా చూడాలి

- సబ్ కలెక్టరును కోరిన మాజీ ఎమ్మెల్యే శివరాం

కందుకూరు, అక్టోబరు 21: నియోజకవర్గంలోని 103గ్రామాలు, ఉదయగిరి నియోజకవర్గంలోని 30కి పైగా గ్రామాలకు తాగునీరందించే రాళ్లపాడు రిజర్వాయరు నీరు కలుషితం కాకుండా చూడాలని మాజీ ఎమ్మెల్యే, కందుకూరు నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ దివి శివరాం డిమాండ్ చేశారు. అభివృద్ధి కమిటీ ప్రతినిధులతో కలిసి సోమవారం ఆయన సబ్ కలెక్టరు శ్రీపూజను కలిసి రాళ్లపాడు రిజర్వాయరులో నీటి నిర్వహణపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శివరాంతో పాటు షేక్ రఫి, కాకుమాని మాదవరావు, పోకూరి మాలకొండయ్య, తోకల వెంకటేశ్వర్లు, చింతరబోయిన నరేష్, గాండ్ల హరిప్రసాదు, షేక్ జిలాని, తదితరులున్నారు.

● **అధికారుల డుమ్మా**

లింగసముద్రం (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు మండలస్థాయి అధికారులు డుమ్మా కొడుతున్నారు. సోమవారం ఈ కార్యక్రమానికి తహసీల్దార్ శ్రీనివాసరావుతో పాటు లింగసముద్రం సెక్టార్ అంగన్వాడీ సూపర్‌వైజర్ రాధాబాయి మాత్రమే హాజరయ్యారు. మిగిలిన ఇతర శాఖల మండల స్థాయి అధికారులు హాజరు కాలేదు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాసరావును వివరణ కోరగా, తాను అధికారులందరికీ సర్క్యులర్లు పంపించి జరగబోయే కార్యక్రమాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఇళ్ల మధ్య మందు షాపు వద్దే వద్దు!

నెల్లూరు(క్రైం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తమ నివాసాల మధ్య ఉన్న వైన్‌షాపును వెంటనే తొలగించాలని పెద్ద సంఖ్యలో మహిళలు, వృద్ధులు, చిన్నారులు డిమాండ్ చేశారు. ఫ్లకార్డులు చేత పట్టుకొని నెల్లూరు నగరంలోని చిల్డ్రన్స్‌పార్కు జాతీయ రహదారి వద్ద సోమవారం నిరసన తెలిపారు. చిల్డ్రన్స్ పార్క్ వైపు నుంచి జాతీయరహదారి పైకి వాహనాలు రాకుండా అడ్డుకున్నారు. సుమారు గంటకు పైగా రోడ్డుపై నిరసన తెలపడంతో హరనాథ పురం వరకు రోడ్డు కు రెండు వైపులా వాహనాలు నిలిచిపో యాయి. బాలాజీనగర్ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని ప్రజలకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు ససేమిరా అన్నారు. చివరకు బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు ఘటనా స్థలానికి చేరుకొని ఎక్సైజ్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వగా వారు ఆందోళన విరమించారు.

● ఇందుకూరుపేట : మద్యం షాపు మాకొద్దని ఇందుకూరుపేట ప్రజలు సోమవారం ఆందోళనకు దిగారు. గ్రామం నడిబొడ్డులో మద్యం షాపు ఎలా ఏర్పాటు చేస్తారని నిర్వాహకులను వారు నిలదీశారు. ఆందోళనతో సుమారు గంటసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చలు జరిపి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థి

ఉలవపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అండర్-17 వాలీబాల్ విభాగంలో పెద్దపట్టపుపాలెం జడ్పీ స్కూల్ విద్యార్థిని తూపిలి ఆనంది ప్రతిభ కనపరి అంతర్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కే సలీం భాషా తెలిపారు. ఈనెల 19న ఉమ్మడి ప్రకాశం జిల్లా త్రోవగుంటలో ఈ పోటీలు జరిగినట్లు పీడీ దాసరి బాలయ్య పేర్కొన్నారు.

రైతులను ఆదుకుంటాం

- ఉదయగిరి సబ్ డివిజన్ ఇన్‌చార్జి వ్యవసాయ సహాయ సంచాలకుడు పీ.చెన్నారెడ్డి



ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన రైతులను అన్నివిధాలా ఆదుకుంటామని ఉదయగిరి సబ్ డివిజన్ ఇన్‌చార్జి వ్యవసాయ సహాయ సంచాలకుడు పీ.చెన్నారెడ్డి తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ..

ఈ ముఖాముఖి

? సబ్ డివిజన్‌లో వర్షాలకు ఏ ఏ పంటలు దెబ్బతిన్నాయి

! ఉదయగిరి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో సీతారామపురం మండలంలో పూత, కోత దశలో ఉన్న వరి పంటకు అధికంగా నష్టం చేకూరింది. సుమారు 20 హెక్టార్లలో వరి పంట దెబ్బతింది.

? రైతులకు పరిహారం ఎలా అందిస్తారు

! ఈ-క్రాప్ చేయించుకున్న ప్రతి రైతుకు ప్రభుత్వ పరంగా పంట నష్టపరిహారం అందేలా చర్యలు చేపడతాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరలో ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం.

? నకిలీ విత్తనాల బెడద ఉంది కదా

! నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తాం. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి. ఒకవేళ పంట నష్టపోతే అలాంటి రైతులకు పరిహారం అందేలా చూస్తాం.

? సబ్సిడీపై టార్పాలిన్ పట్టలు ఎప్పుడు ఇస్తారు

! ఐదేళ్లుగా రాయితీపై టార్పాలిన్ పట్టలు పంపిణీ చేయలేదు. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు పంటను కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. వీటిని దృష్టిలో పెట్టుకొని రాబోయే రోజుల్లో ప్రభుత్వం రైతులకు 50 శాతం రాయితీపై పట్టలు పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతోంది.

న్యూస్ బాక్స్

విద్యార్థి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుర్గంపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి గుమ్మళ్ల దశరథ ఆదివారం మధ్యాహ్నం నుంచి కనిపించడంలేదని తల్లి రాజేశ్వరి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల మేరకు.. ఉదయగిరిలో కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న రాజేశ్వరి ఆదివారం మధ్యాహ్నం భోజనానికి వెళుతూ కుమారుడిని దుకాణంలో ఉంచి వెళ్లింది. తిరిగి దుకాణానికి వచ్చిన రాజేశ్వరికి కుమారుడు, దుకాణంలో రూ.9 వేల నగదు కూడా కనిపించలేదు. దీంతో రాజేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. కాగా, దశరథ ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు.

ఇంటూరికి బెస్ట్ ఇండియన్ ఆర్టిస్ట్ అవార్డు

కందుకూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంకు చెందిన విశ్రాంత రెవెన్యూ ఉద్యోగి, సినీ నటుడు ఇంటూరి మల్లికార్జునరావుకు బెస్ట్ ఇండియన్ ఆర్టిస్టు అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని రవీంద్రభార తిలో ఆదివారం రాత్రి ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు ఇచ్చారు.

హైవే పనుల పరిశీలన

వలేటివారిపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా సింగరాయికొండ నుండి నెల్లూరు జిల్లా మాలకొండ వరకు జరుగుతున్న నేషనల్ హైవే నిర్మాణ పనులను సోమవారం మాలకొండలో బీజేపీ ప్రతినిధుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ మూడు లైన్‌లు నిర్మాణ పనులను నాలుగులైన్‌ల రహదారిగా మార్చాలని, కందుకూరు నుండి మాచవరం వెళ్లే రహదారిలో ఎర్రవాగు దగ్గర అండర్ బైపాస్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కందుకూరు పార్టీ కన్వీనర్ ఘట్టమనేని హరిబాబు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జొన్నాదుల రాఘవులు, కొమ్మి నరసింగరావు, తొగంటి శ్రీనివాసులు, ఉన్నం సింహాద్రి పాల్గొన్నారు.

ఘనంగా గంధ మహోత్సవం

ఏఎస్ పేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజవోలులోని గ్యార్మి ఏ షరీఫ్ మహబూబ్ సుభాహని దర్గా గంధ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ జెండాకు గ్రామోత్సవం చేశారు.

వేరుశనగ యాజమాన్య పద్ధతులపై అవగాహన

ఉలవపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వేరుశనగ పంటలో ఖర్చు తగ్గించి సమగ్ర పోషకాల యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ, చీడపీడల యాజమాన్యంపై కందుకూరు విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జీ.ప్రసాద్‌బాబు రైతులకు అవగాహన కల్పించారు. సోమవారం మండల వ్యవసాయ అధికారి తిరుమల జ్యోతి ఆధ్వర్యంలో కరేడు పంచాయతీలోని టెంకాయచెట్లపాలెం, బట్టిసోమయ్యపాలెం గ్రామాల్లో వేరుశనగలో సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాలను అమలు పరిచారు. జాతీయ ఆహార భద్రతా మిషన్‌లో భాగంగా వేరుశనగతో సహజ నూనెల తయారీ వంటి అంశాలపై వివరించారు. విత్తనశుద్ధి, జీవన ఎరువులు, జీవ శిలీంధ్ర నాశినుల వాడకంపై ప్రదర్శన నిర్వహించారు. రైతులకు పచ్చిరొట్ట, జనులు విత్తనాలు, జీవన ఎరువులు అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటేష్, డాక్టర్ జ్యోతి, రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు వంశీ, ప్రకృతి వ్యవసాయ శిక్షకులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.